ఆంధ్రప్రదేశ్

ఏప్రిల్ - మే, 1972

50 పైసలు



ఆంధ్రకేసరి కథ



1872 ఒంగోలు ప్రాంతాన వల్లూరు గ్రామంలో
ఒంగులూరు గోపాల కృష్ణయ్య సామాన్య కుటుంబీకుడు చిన్న వ్యవసాయ దారుడు —
భార్య సుబ్బమ్మ, ఇద్దరు కూతుళ్లతో సౌఖ్యంగా సంసారం నడిపించేవాడు.
భార్య మళ్లీ ప్రసవించే రోజులు వచ్చాయి. పుట్టినింటి కనపర్తిలో పుట్టింటికి ఆమెను గోపాల కృష్ణయ్య పంపాడు —
జాగ్రత్తగా వెళ్లిరా!
కనపర్తిలో అన్నల ఇంట్లో సుబ్బమ్మ కన్నది —
మగపిల్లాడు!
భాగ్యమంటే — భాగ్యం, కనపర్తిది ఆ పసివాడు ప్రకాశం. ఆంధ్ర కేసరి ప్రకాశం!
సుబ్బమ్మ శిశువుతో వల్లూరు చేరుకుంది. గోపాలకృష్ణయ్య ఆనందానికి మేరలేదు.
అచ్చు నీ పోలికే!
సంవత్సరం గడిచింది. దేశంలో అనావృష్టి. అసలే గోపాల కృష్ణయ్యకు పొలంమీద వచ్చే ఆదాయం అంతంత —
అంతలో అతి భయంకరమైన ధాత కరువు వచ్చిపడింది —
ఈ సంసారాన్ని ఎలాగ నడిపిస్తానో?....

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 16

ఏప్రిల్, మే 1972
చైత్రం – వైశాఖం, జ్యేష్ఠం 1894

సంచిక : 6, 7

ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ముఖ చిత్రం :
ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం

రెండవ అట్ట :
మూడవ అట్ట : } ప్రకాశం జీవితచరిత్ర : బొమ్మల సీరియల్

నాల్గవ అట్ట : చేపల వేట

సాలు చందా ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిష్టర్డు నెం : 133

ఈ సంచికలో

పేజీ

యాత్రిక సౌకర్యాలు

వేసవిలో ఉన్నవాళ్లు చల్లటి ప్రదేశాలకు వెళ్లడం సహజము. మరి కొందరు–అంటే విద్యార్థులు, వివిధ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు శెలవలు పెట్టి తమతమ స్వస్థానాలకు వెళ్ళుతుంటారు. ఇంకా కొంత మంది విజ్ఞాన సముపార్జనకు సుందరమైన ప్రదేశాలు, ఆసక్తిదాయకమైన చోట్లు చూడడానికో, పుణ్యం కోసం తీర్థయాత్రలకో వెళ్ళుతారు. యాత్రికులకు ఆసక్తి దాయకమైన స్థలాలు చూడదలసిన వారికి–ఆంధ్ర ప్రదేశ్‌లో అటువంటివి పుష్కలంగా లభిస్తాయి. తిరిగి చూడడానికి స్వల్ప వ్యవధి మాత్రమే వున్నవారు కూడా తమతమ అభిరుచుల ననుసరించి కొన్ని ప్రదేశాలను మాత్రమే ఎన్నుకుని చూసిరావడానికి అవకాశం వుంది.

ఊరికే "వూళ్ళు చూసుకుంటూ పోవడాన్ని" హడావిడి పర్యటన అనవచ్చు. కాని ఏదిఏమైన పర్యటన పర్యటనే. చూడదగిన ప్రదేశాలకు వెళ్ళి తాపీగానో, హడావిడిగానో చూసిరావడం జాతీయ సమైక్యతకూ, విదేశ మారక ద్రవ్య సంపాదనకూ దోహదం చేస్తుంది. టూరిజంను ఒక పరిశ్రమగా భావిస్తే, వివిధ స్థాయిలలో ఆకర్షణ కలిగిన యాత్రిక ప్రదేశాలను వినియోగదార్లు వాడుకునే తయారైన వస్తువులుగా పరిగణించ వచ్చు. ఒక యాత్రికుడు ఏఏ ప్రదేశాలు చూడగలడనే విషయం, అతనికి వున్న వ్యవధిమీదా, ఆర్థిక శక్తిమీదా, అతని అభిరుచీ, అతనికి వుండే ఆసక్తి మీదా ఆధారపడి వుంటుంది. అతని పర్యటన కార్యక్రమం ఆయా పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసుకోవలసి వుంటుంది. ఇది ఎంత లాభ దాయకంగా తయారుచేయవచ్చు అనేది ట్రావెల్ ఏజెంటును బట్టి, యాత్రీలను ప్రోత్సహించే వారినిబట్టి, గైడును బట్టి వుంటుంది.


రాష్ట్రంలోని మనోహరమైన దేవాలయాలు, పురాతన కట్టడాలు, చారిత్రక ప్రాధాన్యం గల కోటలు మొదలగు వాటిలో ఆంధ్ర జాతీయ సాంస్కృతిక సంపద కొట్టవచ్చినట్లు కనిపిస్తుంటుంది. శిల్ప,వాస్తు విద్యాపారీణతకు నిలయాలుగా అవి చూపరులను ఆకర్షిస్తుంటాయి. వాటి పరమాణువులో చరిత్ర శబ్దిస్తుంటుంది. అవి యాత్రికులను ఒక మహోన్నతమైన పురాతన స్వర్ణయుగంలోకి తీసుకుపోతాయి. రాష్ట్రంలోని నదీమతల్లుల సౌందర్యమూ, అరణ్య ప్రాంతాల అందచందాలు, మనోజ్ఞమైన సంస్కృతి సంపద యాత్రికులను మంత్ర ముగ్ధులను చేస్తాయి.

రాష్ట్ర ప్రభుత్వ యాత్రిక శాఖ ప్రజలలో టూరిజంపట్ల ఆసక్తి కలుగజేయడానికీ, ఆర్థిక పరిమితులకు లోబడి వీలైనంతగా సౌకర్యాలు కలుగజేయడానికీ తగుచర్యలు తీసుకుని కృషి చేస్తున్నది. వరంగల్లులో రీజినల్ టూరిస్టు బ్యూరోను తిరిగి ఏర్పాటుచేయడం. అక్కడకూడా విశాఖపట్టణంలోవలె యాత్రికులకోసం పర్యటన వాహనాలు ఏర్పాటుచేయడం. భారత యాత్రిక అభివృద్ధిసంస్థ (ఐ.టి.డి.సి) వారిచే హైదరాబాదులో యాత్రిక–ప్రయాణ విభాగం ప్రారంభించబడడం. యివన్నీ టూరిజంను అభివృద్ధి చేయడానికి తీసుకున్న చర్యలు. హైదరాబాదులో నాలుగు లక్షల రూపాయల ఖర్చు పూర్తిగా కేంద్రప్రభుత్వం భరించి నిర్మిస్తున్న యూత్‌హాస్టల్‌కు యిటీవలనే, కేంద్రప్రభుత్వ టూరిజం, పౌర విమానయానశాఖ స్టేట్ మంత్రి శ్రీమతి సరోజిని మహిషి శంకుస్థాపన చేశారు. టూరిజం అభివృద్ధి పట్ల ఆమె వహిస్తున్న శ్రద్ధ అందరికీ తెలిసిన విషయమే.

హైదరాబాదులోని చార్మినార్ మీద ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పూర్తికావస్తున్నది. దీనికి కేంద్రప్రభుత్వమే నిధులను సమకూర్చింది. అదేవిధంగా నెహ్రూ జూలాజికల్ పార్కులో సింహాల ఆవరణ నిర్మాణానికి కూడా కేంద్రంద్వారా నిధులు సమకూర్చబడుతున్నవి. నాగార్జున సాగర్ పెర్రీపాయింట్ వద్ద "డ్రైవ్‌యిన్ కౌంటర్" నిర్మాణము. ఉస్మాన్ సాగర్‌వద్ద పిక్‌నిక్ షెడ్డుల ఏర్పాటు, మంగినపూడి బీచి అభివృద్ధి, విశాఖపట్టణం "లాసన్స్ బే" వద్ద "ఛేంజింగ్ రూముల" నిర్మాణం, అరకులో యాత్రిక విశ్రాంతి గృహం ఏర్పాటు–యివి యింతవరకు జరిగిన కృషిలో కొన్ని ముఖ్యాంశాలు. బాగా శిక్షణపొందిన గైడ్లు కొరతగా వున్నందున యిటీవలనే గైడ్ల శిక్షణ కోర్సు నిర్వహించబడింది.

టూరిజంకు జాతీయ, అంతర్జాతీయ సరిహద్దులులేవు. అది సార్వజనీన సమ్మోహనకరమైనది. వివిధ జాతి ప్రజలమధ్య స్నేహ సౌహార్ద్ర వంతెనలను నిర్మించి పరస్పర అవగాహన పెంచుతుంది.

సత్వర ఆర్థిక ప్రగతి మన తక్షణ కర్తవ్యం



— ముఖ్యమంత్రి

[రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నికైన సందర్భంగా 1972 మార్చి 20వ తేదీన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంనుండి ముఖ్యమంత్రి చేసిన ప్రసంగ పాఠం.]

"కాంగ్రెసు శాసనసభ పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఫలితంగా రెండవసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా యివ్వాళ నేను అధికారం స్వీకరించాను. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానీకానికి సేవ చేయాలనే దృఢదీక్షతో, నమ్రతతో నేను మళ్లీ అధికారం స్వీకరించాను. మళ్లీ నాపట్ల విశ్వాసంతో, నాకు యీ బాధ్యత అప్పగించినందుకు ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీకి, కాంగ్రెసు శాసనసభా పార్టీకీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రధాన మంత్రి అనుసరిస్తున్న విధానాలను ప్రజలు నిస్సంకోచంగా, కృత నిశ్చయంతో, దృఢంగా బలపరిచారనే విషయం రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలవల్ల స్పష్టంగా ఋజువయింది. కాంగ్రెసు పార్టీలోను, ప్రభుత్వంలోను ప్రజలు తమ సంపూర్ణ విశ్వాసం ప్రకటించారు. రాష్ట్ర సమైక్యతావాద శక్తులు బలపడి, రాష్ట్ర సుస్థిరత్వానికి నిశ్చయత ఏర్పడింది. వచ్చే ఐదేండ్ల కాలానికి బలమైన, స్థిరమైన ప్రభుత్వం ఏర్పడటంద్వారా రాష్ట్ర అభ్యుదయ సాధనకు రాచబాట ఏర్పడింది. వచ్చే ఐదేండ్ల కాలంలో, లోగడ జరిగిన కాలయాపన సరిదిద్దుకుని త్వరితగతితో దారిద్ర్య నిర్మూలనలో ప్రగతి సాధించడానికి కృషిచేయడం మన కర్తవ్యం. మనం ప్రజాస్వామ్యం, సోషలిజం, సెక్యులరిజం అనే లక్ష్యాలకు అంకితమైవున్నాం. ఈ మార్గాన్ని విడువకుండా, యీ లక్ష్యాలలో ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడానికి కృషిచేయడం మనధర్మం.

గడచిన ఆరునెలల కాలంలో అనేక చరిత్రాత్మక సంఘటనలు జరిగినవి. గడచిన సంవత్సరకాలం, కాంగ్రెసుకు అఖండ విజయం సాధించిన లోకసభ మధ్యంతర ఎన్నికలతో ప్రారంభమైంది.

బంగ్లాదేశ్ నుండి వలస వచ్చిన సుమారు కోటిమంది శరణార్థుల సమస్య చాల క్లిష్టమైన పరిస్థితులను కల్పించింది. ఈ సమస్యను పట్టుదలతో, వివేకంతో విజయవంతంగా పరిష్కరించిన ఖ్యాతి మన ప్రజలది, మన ప్రధానమంత్రిది. పాకిస్తాన్ దురాక్రమణను విజయవంతంగా త్రిప్పికొట్టగలిగాం. బంగ్లాదేశ్ విముక్తి స్వల్పకాలంలోనే సాధించగలిగాం. నీతి నియమాలు లేని మిలిటరీ పాలకులు నామ రూపాలు లేకుండా చేయదలచిన ఒక పొరుగు జాతిని రక్షించి, దానిని విముక్తం చేసి, ప్రజాప్రభుత్వం అక్కడ ఏర్పడడానికి తోడ్పడి, తన సైన్యాలను బేషరతుగా ఉపసంహరించుకున్న సంఘటన ప్రపంచ చరిత్రలోనే అపూర్వ విషయం. ప్రపంచంలోని పీడిత ప్రజల నాయకురాలుగా శ్రీమతి ఇందిరాగాంధీ ఖ్యాతి గడించింది. రాష్ట్ర శాసన సభలకు జరిగిన సాధారణ ఎన్నికలు అన్ని రాష్ట్రాలలోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడడానికి దోహదం చేసినవి. శ్రీమతి ఇందిరాగాంధీకి కాంగ్రెసు పార్టీకి యింతకుముందెన్నడూ లేనంత బలాన్ని చేకూర్చినవి.

అనావృష్టి పరిస్థితులను ఎదుర్కోవటంలోగాని, దేశరక్షణ కృషిలోగాని, ఎన్నికల నిర్వహణలోగాని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం చేసిన కృషి గణనీయమైనది. రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి రక్షణ కృషిని బలపరిచారు. ఎన్నడూ లేనంత ఎక్కువ సంఖ్యలో ప్రజలు కాంగ్రెసు పార్టీ అభ్యర్థులను గెలిపించారు. ప్రజలుసాధించిన యీ ఘనవిజయాలకు, వారు ప్రభుత్వానికి అందజేసిన సంపూర్ణ సహకారానికి వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను

మనం యీనాడు ప్రజల దారిద్ర్య నిర్మూలనకూ, బలహీన వర్గాల, వెనుకబడిన వర్గాల ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థాయి పెంచడానికి ప్రాధాన్యం యిచ్చి పనిచేయవలసి వున్నది. శాసన సభ్యుల, మంత్రి వర్గ సభ్యుల జాబితాను గమనిస్తే యీ విషయం మనకు స్పష్టమవుతుంది. ఈ వర్గాల ప్రజల విషయంలోనే కాక, మత, భాషావిషయిక అల్పసంఖ్యాక వర్గాల ప్రజల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడం మనం అనుసరించే ముఖ్య విధానం, భాషను అభివృద్ధిచేసే విషయంలో గాని, బోధనాభాష విషయంలోగాని, రాష్ట్రంలో అల్పసంఖ్యాక వర్గాల ప్రజల స్థాయి విషయంలోగాని, లోగడ ఏఏ సౌకర్యాలు వారికి వున్నవో వాటిని కొనసాగిస్తామని యీ సందర్భంగా వారికి నేను హామీ యిస్తున్నాను. ఎందుకంటే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎప్పుడూ సార్వజనీన రాష్ట్రంగా, ప్రగతిదృక్పథంగల రాష్ట్రంగా పేరుపొంది, సంకుచిత విధానాలకు దూరంగానే వుంది, మన రాష్ట్రంలో ఉర్దూ

భాషకు ఒక ప్రత్యేక స్థానం వున్నది. ఇక ముందుకూడా అలాగే వుంటుంది.

విద్యావంతులలోనూ యువకులలోనూ ఉన్న నిరుద్యోగ పరిస్థితిని తొలగించడానికీ, గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడానికీ త్వరితగతిలో ఆర్థికాభివృద్ధి సాధించే విషయంలో ఒక నిర్ణీత కాలవ్యవధి కార్యక్రమాన్ని రూపొందించి అమలు పరచడానికి నేను గట్టిగా కృషి చేస్తాను. మనం యీనాడు ఎదుర్కొంటున్న సమస్యలు క్లిష్టమైనవి. బృహత్తరమైనవి కావడంచేతనూ, ఎంత ముఖ్యమైనప్పటికీ కేవలం వ్యవసాయోత్పత్తిద్వారానే యివి పరిష్కరించబడవు కనుకనూ, రాష్ట్రంలో పలు ప్రాంతాలలో అంతకంతకు ఎక్కువగా పరిశ్రమలను ఆకర్షించడానికి మనం తీవ్రంగా కృషిచేయాలి.

"గత సెప్టెంబరులో నేను ముఖ్యమంత్రిగా అధికార స్వీకార చేసిన సందర్భంలో నా రేడియో ప్రసంగంలో మనవి చేసినట్లుగ తెలంగాణాకు సంబంధిన సమస్యల విషయంలో ప్రధానమంత్రి ఆదేశాలనన్నిటినీ నేను తూచా తప్పకుండా పాటిస్తాను. నిజాని యీ విషయంలో యిప్పటికే అనేక నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడమూ, వీటివల్ల తెలంగాణా ప్రజలలో ఒక కొత్తవిశ్వాసం ఏర్పడమూ కూడా జరిగింది.

త్వరలోనే దేశంలో సామ్యవాద సమాజాన్ని స్థాపించుకునేందుకు వీలుగా దేశ అంతరంగిక, విదేశాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రధానికి అండగా నిలిచే వారిలో అగ్రశ్రేణిలో వుండవలసిందని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానీకానికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను."

★

పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్ఠం చేయడం అవసరం

ముఖ్యమంత్రి అభిభాషణ


"ప్రణాళికా పథకాల అమలుకు అవరోధం కలిగే ప్రమాదాన్ని నివారించడానికి వీలుగా వనరులను సమీకరిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాల్సి ఉంది. దీనికిగాను పరిపాలనలో ప్రమాణాలకు దెబ్బ తగలకుండా ఖర్చులో అవసరమైన పొదుపును పాటిస్తూ, పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్ఠంచేయాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు మార్చి 26 వ తేదీన ఢిల్లీ నుండి ప్రసారమైన "ప్రస్తుత పరిస్థితులు" అనే కార్యక్రమానికి సంబంధించి ఆలిండియా రేడియోకు ఇంటర్వ్యూ యిచ్చిన సందర్భంలో అన్నారు. "సాంఘిక న్యాయాన్ని కల్పించే దృక్పథంతో సాహసోపేతమైన సృజనాత్మక కార్యక్రమాన్ని మనం చేపట్టాలి. ప్రజలలో సంతృప్తినీ విశ్వాసాన్ని కల్పించడానికి బడుగువర్గాల ప్రజల అభ్యున్నతికి కృషిజరగాలి. బడుగు ప్రజల అభివృద్ధియే మనధ్యేయం. తద్వారా మన ఆర్థిక ప్రగతికి నూతన దృక్పథం ఏర్పడుతుంది"

ముఖ్యమంత్రి ఇంకా ఇలా అన్నారు "ఆంధ్రప్రదేశ్ చాలా పెద్దరాష్ట్రం. జనాభా 4.5 కోట్లు ఉంది. గణనీయమైన ప్రకృతి వనరులు కూడా ఉన్నాయి అగ్రస్థాయిన అభివృద్ధిని సాధించడానికి క్రమబద్ధమైన చర్యల ద్వారా పెద్దఎత్తున యీరాష్ట్రం ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాల్సి ఉంది. నిరంతరం దుర్భిక్ష పరిసితి వరదల బెడద వల్లగానీ కొన్ని మానవ కల్పిత క్లిష్టపరిస్థితుల వల్లగానీ జరిగిన కష్టనష్టాలను నివారించడానికి పూనుకోవాలి. మన విద్యుచ్ఛక్తి, నీటిపారుదల పథకాలు మనకు ఫలితాలు యివ్వాలి తద్వారా లభించిన ఆదాయాన్ని మరింత జనాభాకు లాభం చేకూర్చే విధంగా తిరిగి యీ పథకాల విస్తరణకు ఖర్చు చేయడానికి వీలు కలుగుతుంది."

"ఆంధ్ర ప్రదేశ్‌లో నూతన వ్యవస్థ ఏర్పడడంతో కొత్త ఆశలు చిగురించాయని తెల్పడానికి నేను సంతోషిస్తున్నాను. కొత్తగా ఏర్పడిన శాసన సభలో బడుగు వర్గాలకు ఎక్కువ ప్రాతినిధ్యం లభించింది. నూతన మంత్రివర్గ నిర్మాణంలో అది పూర్తిగా ప్రతిబింబించింది.

"ఈ రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య అఖిల భారత సమస్యలో ఒక భాగంగా ఉంది. వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించినంత మాత్రాన యీ సమస్య పరిష్కారం కాదు. మన ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామికీకరణ ప్రాతిపదికగా ఉండి, ఎక్కువ పరిశ్రమలు స్థాపించబడి, అవి అన్ని ప్రాంతాలకు సమంగా పంపిణీ అయినప్పుడే యీ సమస్య పరిష్కార మవుతుంది. పొదుపుకు మనం ప్రాధాన్యం యివ్వాలి. ఉత్పత్తి దాయకమైన కార్యక్రమాలలో వినియోగించాలి.

"పైనపేర్కొన్న వాటిలో కొన్ని లక్ష్యాలను మనం సాధించ గలిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ స్వల్పకాలంలోనే ఆర్థికంగా అభివృద్ధి సాధించగలుగుతుం దనడలో నాకెట్టి సందేహమూ లేదు. ఈ రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంది."



1972–73 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక బడ్జెట్ అంచనాలను ఆర్థిక మంత్రి శ్రీ అనగాని భగవంతరావు మార్చి 22వ తేదీన శాసన సభకు సమర్పించారు

ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తి పాఠం

1970–71 సంవత్సరపు లెక్కల బట్టి ద్యోతకమయ్యే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, మన వసతులను, బాధ్యతలను పునఃపరిశీలన చేసి, అలాగే 1972–73 సంవత్సరపు అంచనాలను పరిశీలన చేసి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకుముందు తెలంగాణా, రాష్ట్రంలోని మిగతా ప్రాంతానికి మధ్య కేటాయింపుల అంకెల విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల గురించి ముందు ప్రస్తావిస్తాను. క్రితం సమావేశపు ముగింపు రోజుల్లో, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘం అభివృద్ధి, ఆర్థిక పరిస్థితుల ఉపసంఘపు తుది నివేదికను 22–11–1971 న ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘపు మొదటి, రెండవ, అయిదవ నివేదికలతో సహా, ఈ నివేదికను కూడా ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించింది. కొన్ని పెద్ద పద్దుల క్రింద జమ, ఖర్చులకు సంబంధించిన కేటాయింపుల సూత్రాలకు వర్తించే సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. మిగతా కొన్ని సిఫారసుల విషయంలో, ఇంకా విషయ సేకరణ జరుగవలసివుంది. ప్రాంతీయ సంఘంతో సంప్రతింపులూ జరుపవలసివుంది. ఈ విషయమై ప్రభుత్వం అప్పుడే పనిని ప్రారంభించింది. ప్రస్తుత బడ్జెటు ప్రచురణల గురించి చెప్పుకోదగిన ముఖ్య విషయమేమిటంటే, వార్షిక ఆర్థిక ప్రకటనకు సంబంధించి అన్ని అంశాల గురించి ప్రారంభపు నిల్వనుంచి ముగింపు నిల్వ వరకూ తెలంగాణాకు, రాష్ట్రంలోని మిగతా ప్రాంతానికి మొదటిసారిగా ప్రత్యేకంగా అంకెలు సూచించబడినై. ఇందుకై 1971–72 సవరించిన అంచనాలలోని ప్రారంభపు నిల్వను 1 : 2 నిష్పత్తిలో సూచన ప్రాయంగా విభజించడం జరిగింది. ముగింపు నిల్వను లెక్కించేందుకై, కంటింజెన్సీ నిధి కూడా ఇదే మాదిరిగా విభజించబడింది.

1970–71 లెక్కలు

1969–70లో కేంద్రంనుంచి కొంత ప్రత్యేక ఆర్థిక సహాయం సమకూరినప్పటికి, 1970–71 సంవత్సరం రు. 16.68 కోట్ల ఓవర్ డ్రాఫ్టుతో ప్రారంభమైంది. ఈ సంవత్సరంలో, రెవిన్యూ ఖాతాన జమలు రు. 296.26 కోట్లువుంటే, రెవిన్యూ ఖాతాన ఖర్చు రు. 296.66 కోట్లువుంది. అంటే తరుగు రు. 0.40 కోటి అన్నమాట. అన్ని ఆర్థిక వ్యవహారాలను లెక్కలోకి తీసుకుంటే, 1970–71 సంవత్సరపు మొత్తం తరుగు రు. 30.66 కోట్లు. తత్ఫలితంగా 31–3–1971 నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రు. 47 34 కోట్లు ఓవర్ డ్రాఫ్టు తీసుకున్నాం.

1971–72 సవరించిన అంచనాలు

రివిన్యూ ఖాతా: రు 319.65 కోట్ల బడ్జెటు అంచనాస్థానే, రాష్ట్ర ప్రణాళికకు, కేంద్రం ప్రతిపాదించిన పథకాలకు కేంద్ర ప్రభుత్వంనుంచి లభించిన గ్రాంట్లను కలుపుకొని, రివిన్యూ ఖాతాన జమలు రు. 327.36 కోట్లు వుండవచ్చునని అనుకుంటున్నాం. యూనియన్ ఎక్సైజు సుంకాలు, సహాయగ్రాంట్ల విషయంలో రాష్ట్రపు వాటా క్రింద కేంద్ర ప్రభుత్వం నుంచి లభించగల వనుకుంటున్న అదనపు జమలే ఈ పెరుగుదలకు ముఖ్య కారణం. రు. 305.87 కోట్ల బడ్జెటు అంచనా స్థానే, రివిన్యూ ఖాతా క్రింద ఖర్చు రు. 330.78 కోట్లు వున్నట్టు తేలింది. ఖర్చు పెరుగుదలకు ముఖ్య కారణం 1971–72 ఖరీఫ్ తరుణంలో రాష్ట్రంలో అధిక ప్రాంతాల్లో దాపురించిన అనావృష్టి ఫలితంగా ప్రభుత్వం భారీయెత్తున నిర్వహించిన సహాయ కార్యక్రమాలు. ఈ కారణంగా అయిన ఖర్చు రు 12.98 కోట్లు అని అంచనా వేయబడింది.

పెట్టుబడి : వినియోగం. 1971–72 బడ్జెటులో మొత్తం పెట్టుబడి వినియోగంపై రు. 52.28 కోట్లు కేటాయింపబడినై. సవరించిన అంచనాల ప్రకారం ఆ అంకె ఇప్పుడు రు. 54.75 కోట్లు. ఇందులో ప్రణాళికా పథకాలపై పెట్టుబడి ఖర్చే రు. 51 కోట్లు వుంది.

మొత్తం పరిస్థితి : పైన సూచించిన సవరించిన అంచనాల ప్రకారం. ఈ ఏడాది ఆర్థిక వ్యవహారాల ఫలితంగా మొత్తం తరుగు రు. 32.42 కోట్లు వుండవచ్చు ముగింపు నిల్వ (–) రు. 79.76 కోట్ల రొక్కపు తరుగు అన్న మాట. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ముగింపులో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఎంత వోవర్ డ్రాఫ్టును ఆశించవలసి వుంటుందో ఈ అంకెనుబట్టి తెలుసుకోవచ్చు.

1972–73 బడ్జెట్ అంచనాలు

రివిన్యూ జమలు : కేంద్ర ప్రభుత్వమిచ్చే ప్రణాళికా గ్రాంట్లతో సహా ఇప్పటి పన్ను విధింపు స్థాయిన ఆశిస్తున్న జమలు రు. 344.70 కోట్లు అని అంచనా వేయబడింది. పెరుగుదలకు ముఖ్య కారణాలు–ఆదాయముపై పన్నులు రు. 184 లక్షలు, అమ్మకపు పన్ను రు. 352 లక్షలు, మిగతా పన్నులు సుంకాలు రు. 221 లక్షలు, మొత్తం రు. 675 లక్షలు. యూనియన్ ఎక్సైజు సుంకాల్లో రాష్ట్రపు వాటా 434 లక్షలు. అయితే ఇందుకు ప్రతిగా కేంద్ర ప్రభుత్వపు సహాయ గ్రాంట్లలో తరుగుకూడా వుంది. (రు. 755 లక్షలు).

రివెన్యూ ఖర్చు : బడ్జెటులో రివిన్యూ ఖాతాన మొత్తం ఖర్చు క్రింద రు. 331.76 కోట్లు కేటాయించబడింది. ఇందులో ప్రణాళికేతర కార్యక్రమాలకు రు. 294.39 కోట్లు, రాష్ట్ర ప్రణాళికకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలకు రు. 37.37 కోట్లు. ప్రణాళికేతరంగా రివిన్యూ ఖాతాన జరిగే ఖర్చు కుడి ఎడమంగా 1971–72 సవరించిన అంచనాల స్థాయిలో పరిమితం చేయబడింది. రివిన్యూ ఖాతాన, ఆర్థిక వ్యవహారాల నికర ఫలితం ప్రకారం రివిన్యూ మిగులు రు. 12.94 కోట్లు వుంటుంది.

పెట్టుబడి వినియోగం : బడ్జెటులో రు. 53.68 కోట్లు కేటాయించబడింది. ప్రణాళిక, ప్రణాళికేతరమైన పద్దుల క్రింద జరిగే పెట్టుబడి ఖర్చుతో సహా, ఇందులో ప్రణాళికా పథకాల కిందనే అయిన ఖర్చు సుమారు రు. 50.54 కోట్లు. 1972–73 వార్షిక ప్రణాళిక మొత్తం ప్రస్తుతానికి రు. 105 కోట్లుగా నిశ్చయించబడింది.

పబ్లిక్ ఋణం : బహిరంగ మార్కెటునుంచి లభించిన పెట్టుబడి జమల మూలంగా రు. 25 కోట్లు మొత్తం సమకూరగలదని అంచనా వేయబడింది. వచ్చే ఆర్థిక సంవత్సర క్రమంలో తలపెట్టే ఋణపు మొత్తంలో పెరుగుదలకు కారణం– 31–3–72 నాటికి చెల్లించవలసి వున్న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వోవర్ డ్రాఫ్టును 1972–73లో సుమారు రు. 10 కోట్లకు తగ్గించవలసిన అవసరం ఏర్పడింది. ఋణాలు, అడ్వాన్సులతో సహా అప్పు, డిపాజిట్టు పద్దుల క్రింద ఆర్థిక వ్యవహారాల నికర ఫలితంగా మిగులు (+) రు. 217 కోట్లు, అనుకుంటున్న మొత్తం తరుగు రు. 38.67 కోట్లు వుటుంది.

రొక్కపు నిల్వ : 1972–73 సంవత్సర ప్రారంభంలో లభించగలదనుకుంటున్న రు. 79.76 కోట్ల వోవర్ డ్రాఫ్టును లెక్కలోకి తీసుకుంటే, ఈ సంవత్సరం ముగింపు రొక్కపు నిల్వ తరుగు రు. 118.33 కోట్లు, వుండవచ్చు.

1972-73 వార్షిక ప్రణాళిక

1972–73 రాష్ట్ర వార్షిక ప్రణాళిక కేటాయింపు రు. 105 కోట్లు అని నిశ్చయించబడింది. అంటే ప్రస్తుత సంవత్సరంలో మాదిరేనన్నమాట. ప్రస్తుత అభివృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలంటే, ఇంత వ్యయం అవసరం. అయితే ఈ కనీసపు వ్యయంకోసం కూడా, అదనపు వసతులను కల్పించుకొనటంలోనూ, ప్రణాళికేతర ఖర్చును తగ్గించుకొనటంలోనూ కొంత కృషి చేయవలసి వుంటుంది.

వోవర్ డ్రాఫ్టు పరిస్థితి

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి, ఇకముందు అనధికారంగా వోవర్ డ్రాఫ్టులను రాష్ట్ర ప్రభుత్వము తీసుకోవటం మానాలని కేంద్ర ప్రభుత్వము భావిస్తున్నట్టు గౌరవ సభ్యులకు తెలుసు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయ పడేందుకుగాను, రాష్ట్రాల వేస్ అండ్ మీన్స్ సాధనా సదుపాయాల అడ్వాన్సులను కొద్దిగా పెంచ వచ్చునని సూచింపబడినది. అలా అయితే, సంవత్సర క్రమంలో ఆదాయ వ్యయాల మధ్య ఏమైనా తాత్కాలికంగా జరిగే తక్కువకాలపు అసమానతలకై తగు ఏర్పాటు చేయటానికి వీలవుతుంది. 1972–73 లో కేంద్ర ప్రభుత్వ సహాయంతో సహా రాష్ట్ర వసతుల ద్వారా రు. 82 కోట్లు వుండే ప్రణాళికను మాత్రమే రూపొందించటానికి వీలవుతుందని ప్రణాళిక సంఘం వారు చర్చల్లో అభిప్రాయపడ్డారు. 1972–73 లో రు. 10 కోట్ల మేరకు అదనపు వసతులను రాష్ట్రం సమకూర్చుకోగలిగితే. ఈ మొత్తాన్ని రు. 92 కోట్లకు పెంచటానికి వీలవుతుంది. ప్రణాళికేతర రంగంలో రు. 3 కోట్ల తరుగు కూడా వుంది. దీనిని భర్తీ

చేసుకొని, రు 97 కోట్ల ప్రణాళికను తయారు చేసుకోవాలంటే, 1972_73 లో ప్రణాళికేతర రంగంలో రూ. 10 కోట్ల ఖర్చును తగ్గించుకొనవలసినదిగా ప్రణాళికా సంఘం సలహా ఇచ్చింది. అప్పుడు సుమారు రూ. 2 కోట్లను వెసులుబాటు చేసుకొనవలసి వుంటుంది. కాగా 1971_72 సంవత్సరాన్ని రూ. 70.8 కోట్లను మించనట్టి వోవర్ డ్రాఫ్టుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించుకోవలసిందిగా కూడా ప్రణాళికా సంఘం సూచించింది. ఇందులో 15 శాతాన్ని 1972_73లో చెల్లించుకోవలసి ఉంటుంది. దీనిని భర్తీ చేసుకోవటం కోసం, బహిరంగ మార్కెట్ ఋణాలను భారీయెత్తున సమీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వబడుతుంది. వోవర్ డ్రాఫ్టులో మిగులు భాగాన్ని చెల్లించే నిబంధనల విషయమై రాష్ట్రప్రభుత్వంతో సంప్రదించి ఆ తరువాత ఒక నిర్ణయానికి రావటం జరుగుతుంది. ఇంతకీ అసలు ఇబ్బంది ఏమిటంటే, 1971_72 సంవత్సరానికి మన వోవర్ డ్రాఫ్టు రూ. 79.76 కోట్ల దాకా ఉండవచ్చు—ప్రణాళికా సంఘంతో జరిపిన చర్చల్లోకన్నా సుమారు రూ. 10 కోట్లు ఎక్కువ.

ఉద్యోగుల కరువు భత్యం

ఉద్యోగులకు కరువుభత్యాన్ని పెంచారన్న ప్రభుత్వ నిర్ణయం గౌరవ సభ్యులకు తెలుసు. ఇందువలన ఏడాదిలో అదనపు ఖర్చు రూ. 4.5 కోట్లు ఉండవచ్చు. కాగా, ఈ పెరుగుదల 1971 అక్టోబరు 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. అందుకయ్యేఖర్చు సుమారు 1972_73లో 2.3 కోట్లు బకాయీలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి చెల్లించబడుతాయి అని అనుకుంటున్నాం కాబట్టి దీనికి ఒక దారి చూడాలి.

ఈ విధంగా 31_3_1972 నాటికి అనుకున్నదానికన్నా అదనంగా తీసుకున్న వోవర్ డ్రాఫ్టులను చెల్లించడానికి ప్రభుత్వానికి రూ. 9 కోట్లు కావలసి ఉంటుంది. ఇక 1972_73లో ప్రణాళికేతర రంగంలో తరుగును భర్తీ చేసుకొనటానికి, మన ప్రణాళిక వ్యయాన్ని రూ 5 కోట్లు పెంచుకోటానకి రూ. 10 కోట్లు ఆదా చేసుకొనవలసి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అదనపు కరువు భత్యాన్ని ఇచ్చేందుకై రూ. 7కోట్లు మరియు ఇతర పద్దుల క్రింద రూ. 11.5 కోట్లు కావాలి. ఇవన్నీ కలిసి మొత్తం సుమారు రూ. 37.5 కోట్లకు రాగలదు. 1972_73 ప్రణాళికేతర రంగంలో ఖర్చు తగ్గించుకొనటం ద్వారాను పన్నులు, ఋణాలు వగైర బకాయీలను వసూలు చేయటం ద్వారాను ఈ మొత్తాన్ని సమీకరించుకొనవలసి ఉంటుంది. పోతే, 1972_73లో ఇందుకు అదనంగా రూ. 10 కోట్లవసతులను కూడా సమకూర్చుకోవాలి గదా.

1972_73 సంవత్సరాంతానికి వోవర్ డ్రాఫ్టు మొత్తము రూ. 118.3 కోట్లు ఉంటుందని గౌరవ సభ్యులకు తెలుసు. ఇందులో, ఇందాక నేను చెప్పినట్లు, కేంద్ర ఋణాల ద్వారా రూ 70.8 కోట్లను సర్దుబాటు చేసుకొనవచ్చు. ఇందుకు వర్తించే నిబంధనల గురించి తర్వాత నిర్ణయించటం జరుగుతుంది. అయినప్పటికీ, ఇంకా రూ 47.5 కోట్ల తరుగు ఉండనే ఉంటుంది. ఈ మొత్తాన్ని అదనపు వసతుల ద్వారానూ, బకాయీల వసూళ్ల ద్వారానూ, ఇందాక ప్రస్తావించిన ఖర్చు తగ్గింపు విధానాల ద్వారానూ భర్తీ చేసుకొనవలసి ఉంటుంది.

కాబట్టి 1972_73 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అకంగా చాలా కట్టుబాట్లను చేసుకొన వలసి ఉంటుందని గౌరవ సభ్యులు భావిస్తారని అనుకుంటున్నాను. పరిపాలనా వ్యవస్థను నిర్దుష్టమైన విధంగా నిర్వహించాలి. రిజర్వు బ్యాంకునుంచి అనధికారపు వోవర్ డ్రాఫ్టుల నిమిత్తం లేకుండా తగినంత అభివృద్ధి ప్రాణాళికను అమలు జరుపుకోవాలి. ఇందుకు ఎంతయినా ఆర్థిక సంయమం అవసరం.

దీనిని సమకూర్చుకోనేందుకు గాను, తగ్గించిన రూ. 82 కోట్ల ప్రణాళిక ప్రకారమే వివిధ శాఖలకు ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి డబ్బు ఇవ్వాలని అనుకుంటున్నాం. ఎందుకంటే ఈ రూ 82 కోట్ల ప్రణాళికకు మాత్రమే వసతులు తక్షణం అందుబాటులో ఉన్నాయి. అదనపు వసతులు చేతి కందినప్పుడు, ఏప్రిల్ లోనో, లేదా మే నెలలోనో ప్రణాళికను సమీక్షించి, కేటాయింపులను పునఃపరిశీలించ వలసి ఉంటుంది.

ఈ పై చెప్పిన వ్యయంలో తెలంగాణా ప్రత్యేక అభివృద్ధి పథకాలకై కేటాయించిన రూ. 9.43 కోట్లు చేర్చబడలేదు. ఆ మొత్తం ప్రత్యేకంగానే ఉంటుంది.

1971_72లో అనుసరించిన సూత్రం ప్రకారం, అంటే 1971 జనాభా లెక్కల ప్రకారం 90 శాతం జనాభా ప్రాతిపదిక పైన, మిగతా 10 శాతం వెనుకబడి ఉండటం ప్రాతిపదిక పైన 1972_73 వార్షిక ప్రణాళికలో ప్రాంతీయ వ్యయం నిర్దేశింపబడింది. ఈ సూత్రం ప్రకారం, కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతీయపు కేటాయింపులు వరుసగా రూ. 43.59 కోట్లు, రూ. 22.14 కోట్లు, రూ 39.24 కోట్లు ఉంటాయి. బడ్జెట్‌లో చేర్చిన ప్రస్తుత రూ. 105 కోట్ల ప్రణాళికలో ఈ కేటాయింపులు చేరి ఉంటై. అయితే ప్రణాళికా మొత్తం పరిమాణమే కుదించ బడినప్పుడు నికరపు కేటాయింపులు కూడా అందు కనుగుణంగా తగ్గించబడతాయి.

ఇక నా ప్రసంగాన్ని ముగించే ముందు గౌరవ సభ్యులకు ఒక మాట విన్నవించు కుంటున్నాను. వసతుల అందుబాటుకు అనుగుణంగా అభివృద్ధి వేగాన్ని అధికం చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. అందుకే నిరంతర కృషి చేస్తూ ఉంటుంది. సాగు నీరు, విద్యుచ్ఛక్తి, రోడ్లు, రవాణా వగైరాల అభివృద్ధి కోసం ఇదివరలోవలెనే హెచ్చు మొత్తాలను కేటాయించక తప్పదు. అలా చేస్తేనే వ్యవసాయ రంగంలోనూ, పరిశ్రమల రంగంలోను వేగంగా అభివృద్ధి చేకూరుతుంది. కాగా, దుర్బల వర్గాల పురోగతి కోసం. వివిధ పథకాలను నిర్వహించవలసి ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలన్నిటికై వసతులను సమీకరించటమనేది నిజానికి ఒక సవాలు లాంటిది. అయితే ఈ సవాలును జయప్రదంగా ఎదుర్కొని, కృతార్థులం కాగలమనే నమ్మకం నాకు ఉంది. మనం అవలంబిస్తున్న విధానాలకు ప్రజలు ఇచ్చే మద్దతుతో ఈ సమస్యలను సవ్యంగా పరిష్కరించుకోగలం. సాధారణ ఎన్నికల్లో ప్రజలు, ఈ విషయాన్ని—అనగా ఈ విధానాల పట్ల తమకున్న అభిమానాన్ని—సుస్పష్టం చేశారు. ★

భారత సైన్యము - ఒక పరిచయము

—ఇటిక్యాల మాణయ్య & మడపతి సంగమేశ్వర్

మన దేశమును రక్షించునట్టి సైనిక పటాలముల గురించి తెలుసుకొనుట మనకు ఎంతేని అవసరము. దీనివల్ల మొన్న మొన్నటివరకు జరిగిన భారత పాక్ యుద్ధమువలన జరిగిన ఫలితములు తెలుసుకొనడం చాలా సులభము.

భారత సైన్యమును మూడుభాగములుగా విభజింపవచ్చును. ఈ మూడు భాగములపై సర్వాధిపత్యము భారత రాష్ట్రపతికి కలదు. భూసేన (పదాతిదళము), నౌకాదళము మరియు విమానదళముల కమీషన్డ్ ఆఫీసర్ల హోదాలు ఈ క్రింది విధంగా వుండును.

నిర్ణీతగుర్తుల ద్వారా సైనిక ఆఫీసర్ ఏ హోదాకు చెందిన వ్యక్తియో తెలుసుకొనవచ్చును. ఆఫీసర్ల క్రింది హోదాగల వ్యక్తివద్ద "ఐడెంటిటి డిస్క్" పరిచయపు బిళ్ళ, జీతబత్తెము పుస్తకము వుండును. అధికారి హోదాగల వ్యక్తివద్ద 'పరిచయపత్రము" (Identity Card) మాత్రమే ఉండును

యుద్ధక్షేత్రములో ధరించు వస్త్రములవలననేగాక, వారి టోపి (బెరెట్) లపై వారి రెజిమెంటు చిహ్నము ఉండును

పదాతిదళము	విమానదళము	నౌకాదళము
1. జనరల్	1. ఎయిర్ మార్షల్ (ఛీఫ్)	1. అడ్మిరల్
2. లెఫ్టినెంట్ జనరల్	2. ఎయిర్ మార్షల్	2. వైస్ అడ్మిరల్
3. మేజర్ జనరల్	3. ఎయిర్ వైస్ మార్షల్	3. రియర్ అడ్మిరల్
4. బ్రిగేడియర్	4. ఎయిర్ కమోడర్	4. కమోడర్
5. కర్నల్	5. గ్రూప్ కెప్టెన్	5. కెప్టెన్
6. లెఫ్టినెంట్ కర్నల్	6. వింగ్ కమాండర్	6. కమాండర్
7. మేజర్	7. స్క్వాడ్రన్ లీడర్	7. లెఫ్టినెంట్ కమాండర్
8. కెప్టన్	8. ఫ్లైట్ లెఫ్టినెంట్	8. లెఫ్టినెంట్
9. లెఫ్టినెంటు	9. ఫ్లైయింగ్ ఆఫీసర్	9. సబ్ లెఫ్టినెంట్
10. సెకండ్ లెఫ్టినెంటు	10. పైలట్ ఆఫీసర్	10. ఆక్టింగ్ సబ్ లెఫ్టినెంట్
		11. వారంట్ ఆఫీసర్
		12. మిడ్‌షిప్‌మెన్

పదాతి దళమునకు సంబంధించిన ఆఫీసర్ హోదాకలవారిక్రింద మరిరెండు ఇతర అధికారులుందురు.

(i) జూనియర్ కమిషన్ ఆఫీసర్ : ఈ హోదాలో సుబేదార్ మేజర్, సుబేదార్, నాయబ్ సుబేదారులు ఉందురు.

(ii) నాన్ కమిషన్ ఆఫీసర్ : ఈ హోదాలో వారిని హవల్దార్, నాయక్, లాన్స్‌నాయక్ అని పిలిచెదరు.

పదాతిదళములో చిన్నహోదా కలవారిని "జవాన్" లేక "సిపాయి" అందురు.

సైనికులు ధరించు టోపీలరంగులు రెజిమెంటు వారీగా వేర్వేరుగా వుండును. దానితోపాటు వారి భుజములపై వారియొక్క రెజిమెంట్ పేరు వ్రాయబడియుండును.

సైనిక ఆఫీసర్లు, జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ల భుజములపైనా, నాన్ కమీషన్డ్ ఆఫీసర్ బాహువులపైనా వారి హోదాల గుర్తులు వుండును. కుడి బాహువుపై వారి "ఫార్మేషన్" గుర్తుండును. ఆఫీసర్లు, జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ల జేబులపై వారి పేరుకూడా వ్రాయబడియుండును. ఇంతేకాక వారి భుజములపైగా జేబువరకు వ్రేలాడునట్టి సన్నని త్రాళ్ళు, వారి రెజిమెంటు అనుసారముగా వివిధ రంగులలో వుండును. ఈ త్రాడును "లెనియార్డు" అందురు.

యుద్ధసమయములో ప్రతి సైనికునివద్ద ఆయుధ సామగ్రియేకాక, వర్షకాలపు కోటు, నీటిసంచి, చిన్నసంచి (హెవర్ సెక్) ఒక పెద్ద మూట యుండును. ఈ మూటను "పెక్" లేక "కిట్టు" అని పిలిచెదరు. ఈ మూటలో సైనికునకు అవసరమగు సూది మొదలుకొని కంబళి, దోమతెర, ఆహార పదార్థములు (రేషన్)ల వరకు చాలా వస్తువులు వుండును.

యుద్ధక్షేత్రములో పోరాడే సైనికుల చిన్నజట్టును "సెక్షన్" అందురు. దీనికి అధికారి నాన్ కమీషన్ ఆఫీసర్. ఈ జట్టులో 8 నుండి 11 మంది వరకు సైనికులుందురు. మూడు సెక్షన్‌ల జట్టును "ప్లాటూన్" అందురు. దీనికి ఒక జూనియర్ కమీషన్ ఆఫీసర్ అధికారిగావుండును. మూడు ప్లాటూన్ల సమూహమును "కంపెని" అందురు. దీనికి ఒక కమీషన్ ఆఫీసర్ అధికారిగావుండును. ఆరు కంపెనీల సమూహముతో ఒక "బటాలియన్" ఏర్పడును. దీనిలో సుమారు 900 మంది సైనికులుందురు. యుద్ధక్షేత్రములో స్వతంత్రముగా పోరాడే హోదా గలిగినట్టి జట్టులో ఇది అతిచిన్నది. ఈ బటాలియన్‌కు అధికారి "లెఫ్టినెంట్ కర్నల్" వుండును.

మూడు బటాలియన్ల సమూహంతో ఒక "బ్రిగెడ్" ఏర్పడును. బ్రిగేడియర్ దీనికి అధికారి. మూడు బ్రిగెడ్‌ల సమూహమును "డివిజన్" అందురు. మెజర్ జర్నల్ డివిజన్‌కు అధికారిగా నుండును. రెండు లేక అంతకంటె ఎక్కువ డివిజన్ల సైనిక పటాలమును "కోర్"అనెదరు. లెఫ్టినెంట్ జనరల్ ఈ "కోర్"కు అధికారి, మొత్తము పదాతిదళమునకు బాధ్యత గల అధికారిని "జనరల్"అని పిలిచెదరు. యుద్ధసమయములో వ్యూహ రచనబట్టి ఈ జట్టుల సంఖ్య హెచ్చు, తగ్గు లగుచుండును.

సైన్యములోగల వివిధ విభాగములోనివారు అన్యోన్యముగా కలిసిమెలసి ఒక జట్టుగా పనిచేయవలసి యుండును. సైన్యములో ఈ క్రింద చూపబడిన విభాగము లుండును.

1. ఆర్మడ్ కోర్ (టాంకుల్ని నడిపే సైన్యము)
2. ఆర్టిలరి (తోపుల్ని నడిపే సైన్యము)
3. ఇంజనీర్లు, సిగ్నల్స్ (వైర్‌లెస్ మరియు టెలిఫోన్)
4. ఇన్‌ఫెంట్రి (పదాతిదళము)
5. సప్లైకోర్ (ఆయుధసామగ్రిని అందజేసే సైన్యము)
6. మెడికల్ కోర్ (డాక్టర్లు, నర్సులు)
7. ఆర్డినెన్స్ కోర్
8. ఎలక్ట్రికల్ మరియు ఇంజనీర్లు
9. పశుపోషణ విభాగము
10 మిల్ట్రీఫార్మ్ విభాగము
11. ఎడ్యుకేషన్ కోర్
12. ప్రొవెస్ట్ కోర్ (సైనిక పోలీసు విభాగము)
13. సైనికుల్ని భర్తీ చేసుకొనే విభాగము
14. శిక్షణ కేంద్ర విభాగము
15. టెరిటోరియల్ ఆర్మి
16. డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ మొదలగునవి.

దేశ చరిత్ర ఆధారముగా పదాతిదళము వివిధ రెజిమెంట్లుగా విభజింపబడి యున్నవి. వాటిని ఈ క్రింద చూపబడిన పేర్లతో పిలుతురు.

1. బ్రిగెడ్ ఆఫ్‌గాడర్స్ 2. పెరా 3. పంజాబ్ రెజిమెంటు 4. మద్రాసు 5. గ్రెనిడియర్స్ 6. మరాఠ 7. లైట్ఇన్‌ఫెంట్రి రాజపూత్ రైఫిల్స్ 8. రాజపూత్ రెజిమెంటు 9. జాట్ 10. సిఖ్ 11. సిఖ్‌లైట్ ఇన్‌ఫెంట్రి 12. డొగ్రారెజిమెంటు 13. గఢ్వాల్ రైఫిల్స్ 14. కుమావు 15. అస్సామ్ 16. బిహార్ 17. మహర్ 18. జమ్మూకాశ్మీర్ రైఫిల్స్ 19, లడాఖ్ స్కౌట్స్ 20. గౌర్ఖా రైఫిల్స్.

ఈ పైన చూపబడిన రెజిమెంటు సైనిక పటాలము వారు మన దేశ సరిహద్దులలో పెట్టని కోటవలె నుండి, మన దేశరక్షణ బాధ్యతను వహించుచున్నారు.

ప ద వ ం ఛ


మన జవానులకు జోహార్లు

[జవానుల కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన వివిధ సౌకర్యాల వివరాలు]

— సమాచార, పౌరసంబంధ, యాంత్రికశాఖ ప్రచురణ —



రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిని స్పెషల్ కమీషనర్ తోడ్కొని వస్తున్నదృశ్యం



ఆడిటోరియం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేయబడిన రంగవల్లి

రాజధానిలో ఉగాది వేడుకలు




కొత్త ఢిల్లీలోని సమాచార అధికారి, శ్రీమతి సరస్వతీబాయి గిరిని పుష్పమాలాలంకృతురాలను చేస్తున్నదృశ్యం



రాష్ట్రపతితో ముచ్చటిస్తోన్న కేంద్రమంత్రి డా. కె. ఎల్. రావు



ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు, మార్చి 7వ తేదీన కచ్చేరి చేసిన శ్రీమతి సుబ్బలక్ష్మిని సన్మానించారు.




సాంకేతిక విద్యాశాఖ మంత్రి శ్రీ ఎ. మదన్ మోహన్ 7వ తేదీన సంగీత నృత్యోత్సవాలకు అధ్యక్షత వహించిన శ్రీ చిత్తూరు సుబ్రహ్మణ్యంపిళ్ళైను సన్మానించారు.

సంగీత, నృత్యోత్సవాలు

మార్చి 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాదు రవీంద్ర భారతిలో సంగీత, నృత్య కళాశాలల ఆధ్వర్యాన సంగీత, నృత్యోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన కొన్ని దృశ్యాలు.



శ్రీ ఈమని శంకరశాస్త్రి మార్చి 14వ తేదీన వీణకచ్చేరిచేశారు.



శ్రీ టి. ఆర్. మహాలింగం మార్చి 12న ఫ్లూటుకచ్చేరి చేశారు.



కుమారి రత్నపాప మార్చి 13న నృత్యప్రదర్శన ఇచ్చారు.

నియంతల జాతకం

సోమసుందర్

రాలుతూండే నిమేష బిందువులు
ఇంకుతోంది తప్తకాల సైకతం
పరిస్రుతమవుతూన్న వీరుల రుధిరం
పుడమి పెదవులకు తీరుస్తోంది దాహం ...

సైతానువంటిదైతే సమయం
నల్లనితెర ' తాను ' తమిస్రం
వీరులతలరాలిన చవిటినేలపీఠంలో
పునరపి జననం సాయుధవీరసహస్రం !

జల్లెడ బెజ్జాల వంటివి చుక్కలు
గగనచాలనీని అదేపనిగా తిప్పుతూకాలం
వెలుతురునుంచి ఇరుల పొట్టును
వేర్పరచాలనేదే సదాప్రయత్నం.

తలోముక్కా కొరుక్కున్న జామపండు పుడమి
కాకెంగిలి చేయబడనిది—
పిసరంతైనా మిగులలేదుజాగా
నరుని కంటిని తప్పించుకున్న
చెదచీమలు ఎర్రనివీ తెల్లనివీ
పండునేదొల్లించుకు పోదామని ప్రయత్నం

నియంతలకు అహంత
కకుబంతను వణికించే అంధకారం
అరిభయంకర సామ్రాజ్య శక్తిగా
నరోత్తముడు కాంతిగిరీంద్రమై విజృంభిస్తే
పురోగమించే మహోధ్వం నిండా
మందారాలూ పారిజాతాలూ అతని స్వప్నాలు!
చిట్టచివరికి కుప్పగా కూలి
ముద్దకట్టిన ఇరులు : నియంతల శవాలు...

అసహ్యమంతా ఆ నియంత పేరులోనేఉంది
బ్రతికేదీ బట్టకట్టేదీ వాడా ? పట్టిది
జయంతి తే సుప్రజా ! అంటూ చరిత్ర
బోసిబుగ్గలతో ఆశీర్వదిస్తూనే వుంది మళ్ళీ !

నియంతలెప్పటివాళ్ళయినా
        ఎలాంటివాళ్ళయినా చివరికి

జుగుప్సావహంగా అసహ్యంగా
        విరిగిన కొండలా చచ్చిపడక తప్పదు

యాహ్యాఖానో టిక్కాఖానో ఎవడైనా
        పురుగులుపట్టి వాళ్ళ శవాలమీద

బాంగ్లాజనసంకల్ప వృక్షం
        సప్తకోటి అరుణోషస్సులు విరియకపోతే ఒప్పద



ఆంధ్రకేసరి ప్రకాశంపంతులుగారు

—కొన్ని మధుర స్మృతులు

—ఐ. వి. రమణయ్య

క్రీ. శ. 1904 సం॥ నుండి క్రీ. శ. 1927వ సం॥ వరకు భారత రాజకీయ చరిత్రలో గొప్ప సంచలనము కలిగినదని చెప్పవచ్చును. ఆ సంచలనము దేశవ్యాప్తముగా ప్రజాహృదయములలో స్వాతంత్ర్యాగ్నిని ప్రజ్వలింపజేసినది. అట్టి తరుణముననే భారత దేశ యేకైక రాజకీయ పరిషత్తుగ వ్యవహరింపబడిన భారత జాతీయ కాంగ్రెస్ స్థాపింపబడెను. ఆది అనతి కాలములోనే మహావృక్షమై స్వాతంత్ర్య జ్యోతిని భారతీయ ప్రజాహృదయములలో మహోజ్వలముగ నుద్దీపింప జేసినది. ఈ ఉద్యమమును విజయవంతముగ కొనసాగించిన దేశ నాయకులలో మహా మహిమాన్వితులు త్యాగమూర్తులు, విద్వత్కవి పండితులు, పారిశ్రామిక వేత్తలు గలరు. అట్టివారిలో లోకమాన్య బాలగంగాధర తిలక్, కేల్కార్, మహాదేవ గోవింద రానడే, లాలా లజపతి రాయ్, దాదాభాయి నౌరోజీ, జంషడ్జీటాటా, పండిత మదనమోహన మాలవ్యా, స్వామి శ్రద్ధానంద, మోతీలాల్ నెహ్రూ, బాబు రాజేంద్రప్రసాద్, అరవింద ఘోష్, బిపిన్ చంద్రపాల్, అనిబెసెంటు, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయి పటేల్, శ్రీ రాజగోపాలచారి, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణ, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, టంగుటూరి ప్రకాశం పంతులు గారు ప్రథమ శ్రేణికి చెందినవారు. జవహరు లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోసు, చిత్తరంజన్ దాసు, సరోజిని నాయుడు, లాల్ బహద్దుర్ శాస్త్రి, కొండా వెంకటప్పయ్య పంతులు, కామరాజ నాడారు మొదలుగా గల ప్రముఖులీ యుద్యమమును కొనసాగించి, నేటి సంపూర్ణ ప్రజా స్వాతంత్ర్య ప్రతిపత్తిని రూపొందించిరి.

అప్పటికి అనగా 1918 సం॥ నుండి 1921 సం॥లలో ఈ స్వాతంత్ర్య పోరాటమునకు సంబంధించిన యనేక సముద్రేకపూరితములగు సభలు, ఊరేగింపులు నిషేధాజ్ఞోల్లంఘనములు, దేశమందంతటను ముఖ్యముగ ప్రముఖ జిల్లాలు, పట్టణ ప్రాంతములలో ప్రఖ్యాత నాయకులయాధ్వర్యమున దిగ్విజయముగ కొనసాగింపబడినవి. అందు ప్రప్రథమముగ క్రీ. శ. 1921 సం॥లో మహాత్మాగాంధీగారు తమ ప్రియ శిష్యబృందముతో బళ్ళారి జిల్లాయందు పర్యటించి స్వాతంత్ర్యజ్యోతిని ఆ పుర ప్రజా హృదయములలో వెలిగించిరి. అప్పుడు బళ్ళారి పట్టణము, జిల్లా ఉమ్మడి మద్రాసు రాష్ట్రములో ప్రముఖస్థానము నలంకరించి యుండెను. భౌగోళికముగను, చరిత్రాత్మకముగను నది ఆంధ్రమండలముగ పేరొందిన రాయలసీమకు కేంద్రపట్టణమై విలసిల్లి యుండెను.

ప్రకృతి రామణీయకత కాలవాలమైన బళ్ళారి సుందరసీమను అప్పటి బ్రిటిషు పరిపాలకులు మిలిటరీ కేంద్రముగను, ఆరోగ్య కేంద్రముగను పరిగణించిరి. ఈ మిలిటరీ కేంద్రమున కనుబంధముగ దీనికి సుమారు 50 మైళ్ళ దూరమునను ప్రస్తుత హాస్పేట పట్టణము (తుంగభద్రా డామ్)నకు దక్షిణముగ సుమారు 10 మైళ్ళ దూరమున 20 మైళ్ళ పొడవు 10 మైళ్ళ వెడల్పుగల పర్వత శ్రేణి, నయనానంద కరములగు లోయలతో హృద్యముముగ నున్నది. నానావిధ పరిమళ రసభరిత ఫల పుష్ప తరు ఛాయలతో నిండి, వివిధమైన యరణ్యప్రదేశములు, సుందర సరోవరములతో కూడిన ఉపవనములు, పచ్చిక మైదానములు, పర్వతపు లోయలలోని సస్యక్షేత్రములు, అందలి ఆకుమళ్ళు, పండ్ల తోటలు, వాని నాశ్రయించి నిస్సంకోచముగ సంచరించుచు, తమ మనోహర దేహ కాంతులతో తటిల్లతలవలె యనిపించు సాహస గమన శరీర లాఘవమును ప్రదర్శించు ననేక వన్యమృగములు స్వేచ్ఛా నాట్యవినోద భంగిమలతో నేత్రానంద మొనరించు విహంగములు "ఘట్" రైలు మార్గమున ప్రయాణించు ప్రయాణీకులకు నేత్రపర్వము గావించుచుండును. ఈ పర్వత శ్రేణి ప్రాంతముననే 'రామనదుర్గము' అను పీఠభూమి అత్యంత రమణీయమైన ప్రదేశము. ఈ దుర్గము ఆంగ్లేయుల కాలమున వారి వేసవి ఆరోగ్య విశ్రాంతి కేంద్రముగ నుపయోగింప బడెడిది. ఈ ప్రాంతము ప్రస్తుతము హాస్పేట తాలుకా 'సొండూరు' మండలమునకు చెంది యున్నది. ఈ విశ్రాంతి కేంద్రము సుమారు 5 వేల యడుగుల ఎత్తున సుమారు 15 వేల చదరపు గజముల పీఠభూమిని అలంకరించి యున్నది. ఈ ప్రదేశమున సైనిక ఆస్పత్రి 5, 6 బంగళాలు, బారకాసులు, ప్రభుత్వ విశ్రాంతి మందిరము, కార్యాలయము, కవాతు మైదానములు, ఆట స్థలములు కలవు. విశాలములై తీర్చి దిద్దినట్లుండు బాటలు కొండ చరియలలోని పంద

తోటలతో నేటికిని నేత్రానందముకలిగించెడి సుందర ప్రదేశమది. కాని సరియైన పోషణ లేక శిథిలావస్థలో నున్నది. క్రీ. శ. 1914 సం. ఒక జర్మను ఇంజనీరు ఈ ప్రాంతమున నివసించు చుండెను. అతడు గొట్టముల ద్వారా వాయుయంత్ర సహాయముతో (wind-Mill) 5,000 జనాభాకు సరిపోవు మంచి నీటిని పర్వత పైభాగమునకు సరఫరా చేయు సదుపాయమును కల్పించెను. ఈ ప్రదేశ ప్రశాంత వాతావరణము ప్రకృతి సౌందర్యము మద్రాసు రాష్ట్రమునగల నీలగిరి, కొడై కెనాల్ లకు ఏమాత్రము తీసిపోదు. ఇచ్చటి ఖనిజ సంపత్తి గురించి ప్రథమ శ్రేణికి చెందిన రాయల సీమ దేశనాయకులు, స్వాతంత్ర్య యోధులు, విద్యాసరస్వతులు, అయిన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారనేక చారిత్రిక పరిశోధనలు జరిపి, అపార ఖనిజ సంపత్తిగల విజయ నగర రాజన్యుల భూభాగము నిశ్శంశయముగ యాంధ్రులదేయని యుద్ఘాటించిరి. దాని ననేక దృష్టాంతములతో నిరూపించిరి. ఈ పర్వత శ్రేణులలో లభ్యమైన ఉక్కు, ఇనుము, రాగి బంగారము మొదలగు ప్రశస్తమైన లోహద్రవ్యసంపత్తి యానాటి విజయనగర సామ్రాజ్య వైభవమున కెంతయో తోడ్పడినదని వారు యనేక మారులు ప్రకటించిరి. ఇట్టి యమూల్యమగు భూభాగమును పోగొట్టు కొనుట యాంధ్రుల దౌర్భాగ్యమని యుద్ఘోషించిరి. ఇట్టి అమూల్యఐశ్వర్యమును ఆంధ్రరాష్ట్రస్థాపకులు పోగొట్టుకొనిన విధానమును విమర్శించుచు, రాయలసీమ ఆర్థిక వైజ్ఞానిక వృద్ధిని గురించి నేను 1947 నుండి 1951 సం॥లలో యనేక పర్యాయములు ప్రముఖాంగ్ల పత్రిక 'హిందూ' లోను, తెలుగు వార పత్రిక త్రిలింగలోను వ్రాసి యుంటిని. ప్రశస్తమైన విశ్రాంతి కేంద్రమును మనోహరమగు నిట్టి ప్రదేశము నెట్టి త్యాగములకయిన వెనుకాడక ఆంధ్రరాష్ట్రమున జేర్చి పునరుద్ధరింప వలసినదనియు, ప్రముఖ మిలటరీ సైనిక శిక్షణాకేంద్రముగను, వైజ్ఞానిక పరిశోధనాలయముగను మార్చిన యెంతో బాగుండునని వ్రాసి యుంటిని. అప్పుడు నాకు కీ. శే॥ కళాప్రపూర్ణ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రి, సుప్రసిద్ధ న్యాయవాదులు S.P. కొండపిద్వారా మద్రాసులో శ్రీ. టంగుటూరి గారి పరిచయ భాగ్యము కలిగినది. వారు నా ప్రతిపాదననెంతో ప్రశంసించిరి.

క్రీ. శ 1918 సం॥న మొదటి ప్రపంచ యుద్ధానంతరము బళ్ళారిలోని మిలిటరీ కేంద్రములో సుమారు 500 మంది బ్రిటీషు సైన్యము, 2,000 మంది పంజాబీ, రాజస్థాన్ సైనికుల పటాలము, వారి ఆఫీసర్లు విడిసియుండిరి. వారందరు పట్టణ కళాశాల యువకుల తోడను పౌరులతోడను స్నేహ భావమున వర్తిల్లుచు వారిని వ్యాయామ క్రీడా పోటీలలో పాల్గొను నట్లు ప్రోత్సహించు చుండిరి. ముఖ్యముగ పట్టణములోని పౌరబృందమునకు చెందిన 18 మంది ఫుట్ బాల్, హాకీ, క్రికెట్టు జట్టుల వారిలో మిక్కిలి స్నేహ పూర్వముగ మెలగుచు క్రీడాపోటీలలో పాల్గొనుచు ప్రముఖ విద్యాలయములలోని జట్లను గూడప్రోత్సహించుచువచ్చిరి. బళ్ళారి పట్టణ వుత్తమ పౌరులు ఉన్నత కళాశాల విద్యార్థులచేనిర్వహింప బడిన వ్యాయామ క్రీడాపోటీలు మద్రాసు రాష్ట్రములోను ఇతర జిల్లాలలోను పౌరుల ప్రశంసలనందుకొన్నవి. ఈ విధముగా హిందూ రాజ్య రమాధురంధరులగు విజయనగర రాజన్యుల ఆంధ్ర సాహిత్య వైభవము మరల బళ్ళారి పట్టణమునగల పౌరుల జీవితముల ప్రతిబింబించి నట్లు యనిపించెను. అప్పటి నాటక కళాకోవిదులలో ధర్మవరం కృష్ణమా చార్యుల గారిచే రచింపబడి ప్రదర్శించిన చిత్రనళీయ, భక్త ప్రహ్లాద, పాదుకా పట్టాభిషేకం, సారంగధర నాటకములు సమస్త ఆంధ్ర ప్రజాహృదయములను చూరగొనినవి. వీరి సమకాలికులు శ్రీకోలాచలం శ్రీనివాసరావు గారు రచించిన మోహినీరుక్మాంగద, విజయనగర పతనము మరపురానివే. శ్రీ సుబ్రహ్మణ్యముశాస్త్రిగారి లవకుశ, డి. గోపాలాచారిగారి రామదాసు చరిత్ర మొదలగు ప్రదర్శనములు రాజధాని యందలి అన్ని జిల్లా కేంద్రములలో భారీ యెత్తున ప్రదర్శింప బడి ప్రజాదరణను పొందినవి. ముఖ్యముగ ప్రముఖ నాటక కళా కోవిదులు, న్యాయవాదులు అగు కీ. శే. బళ్ళారి రాఘవాచార్యులు గారి ప్రదర్శనల కొరకు వినూత్నమైన మెరుగు పెట్టిరి. అప్పటి వారి ప్రహ్లాద లోని 'హిరణ్యకశిప', రుక్మాంగద లోని 'రుక్మాంగద' విజయనగర పతనములోని 'పఠాన్ రుస్తుం' పాత్రలు సజీవములై నేటికిని ప్రశంసింప బడుచున్నవి. వారి యాంగ్లేయ 'షేక్స్పియర్' నాటకము లోని ముఖ్య పాత్రలు అనగా ఒథెల్లో లోని ఒథెల్లో మర్చంట్ ఆఫ్ వెనీసు లోని మార్క్. ఆంటోనీ నతి యద్భుతముగ నటించి ప్రపంచ ఖ్యాతి నార్జించిరి. శ్రీ రాఘవాచారి గారు బళ్ళారి పురములో సుప్రసిద్ధ న్యాయమూర్తులు రంగస్థల మార్తాండులు. గంభీర మూర్తి, విశాల విస్ఫారిత నయనములు, పొడవైన నాశిక, ఉంగరముల తిరిగిన క్రాపింగు జుట్టు, గంభీర వాక్కులు, ఆయన పాత్రలకు మరింత మెరుగు బెట్టినవి. శ్రీకృష్ణమాచార్యుల యనుంగు మేనల్లుడై ఆయనచే "రాఘవా" యని పిలువ బడు చుండెను. రాఘవా చార్యులు గారు నాటక రంగములోనే గాక అతిథిసత్కారములలోను దీన జనోద్ధరణ యందును మిక్కిలి యాశక్తి కలిగి యుండిరి. స్వాతంత్ర్యోద్యమమందు పాల్గొనుట యేగాక ఉద్రేక పూరితములగు సభలు, ఉపన్యాసములు నిర్వహించుచు, యువక బృందములకు శ్రీ పట్టాభి సీతారామయ్య, దుగ్గిరాల, ప్రకాశం పంతులు, రాజ గోపాలాచారి మొదలగు స్వాతంత్ర్య యోధులను, గాంధీజీ యను చరులును నగు మహనీయులతో పరిచయ భాగ్యము కలుగ జేయుచుండెను. అట్టిసమయమున నేనొకసారి ఆంధ్ర సాహిత్య మిత్రమండలి పౌరసభవారు యేర్పాటు చేసిన వక్తృత్వపు పోటీలలో పాల్గొని ఆంగ్లమున, ఆంధ్రమున "నేను నా దేశమును ఏల ప్రేమింతును"? అను విషయముపై ఉపన్యసించి యుంటిని. బహుమతి ప్రదాతలగు శ్రీకోలాచలం శ్రీనివాసరావు గారిచే నాకు ప్రథమ బహుమతి బహూకరింపబడెను. వారి యభినందనలను ప్రత్యక్షముగ నందుకొను యవకాశము నాకప్పుడే కలిగెను. 1922 సం॥న ఒకప్పుడు అచ్చటి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిగ నున్న సమయమున మా పాఠశాల వార్షికోత్సవము జరిగినది. అప్పుడు నేనుషేక్స్పియర్ రచించిన ఐదవ హెన్రీ నాటకములో రాజపుత్రుని పాత్రను చక్కగా పోషించి యుంటిని. మా ఉత్సవమున కధ్యక్షత వహించిన శ్రీరాఘవాచార్యులుగారు నన్ను మిక్కిలి ప్రసంశించిరి. నావయస్సు 17 సంవత్సరములు మాత్రమే. ఈ సందర్భమున శ్రీ రాఘవాచార్యులు గారు నన్ను యెక్కువగ అభినందించి వారిని తరచుగా కలుసుకొని మాటాడ వలసినదని యాదేశించిరి.

1926 సం॥ నేను మద్రాసు క్రైస్తవకళాశాల ఆంధ్ర సారస్వత సంఘవార్షికోత్సవ సందర్భమున శ్రీ రాఘవాచార్యులను అధ్యక్షులుగ ఆహ్వానించితిని.

వారుతమ ప్రసంగమున మన యువకులు ప్రస్తుతము మనదేశములో అనేక రంగములలో విజృంభించుచున్న స్వాతంత్ర్య జాతీయోద్యమమును ముఖ్యముగ గమనించి ముమ్ముందు అత్యంత ధైర్య సాహసములతో చేతులు కలిపి ప్రగతిని సాధించిన దెంతయో సంతోషదాయకమనియు పేర్కొనిరి.

ఇట్టి ప్రగతిని దృష్టిలోనుంచి లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారుకూడ 1914 మొదటి ప్రపంచయుద్ధ ప్రారంభంలో అనేక వేలమంది భారతీయ యువకులను ఉత్తేజపరచి సైనికరంగంలో చేరునట్లు చేసిరనితెలిపి, ఇట్టి వీరభారత స్వాతంత్రరాజ్య వైభవమును ప్రతిబింబించు నిరంతర వ్యాయామ ప్రియ సుస్నిగ్ధ దృఢబాహుబల పరాక్రమసింహుడు విజయనగర ఆంధ్ర సామ్రాజ్య ధురంధరులైన శ్రీకృష్ణదేవరాయల దివ్యమూర్తిని గురించి మను చరిత్రలోని ఈ క్రింది పద్యమును చదివి వినిపించిరి.

వ్యాయామస్థిరసంధి బంధ కటకాధ్యక్షాము గక్షోణి భృ
త్కాయ గ్రావభిదావిధా భిదురదోః ఖడ్గాగ్ర యుగ్రాచల
ద్వ్యాయః కీర్తిభర ప్రపంచ వరపంచారామ రామానుజీ
గేయామేయ జయాంక పంకజ దృగంగీకారధీరాకృతీ

హిందూరాజ్య రమాధురంధర భుజాహీంద్రామణీ కంచుక
త్కంధర స్వచ్ఛయశోగుళుచ్ఛ యవనక్షోణీధరస్థాపనా
మందీభూత కృపాకటాక్ష యనక్షాహ్మద్యత్కళింగాంగనా
బందీగ్రాహ విగాహితోత్తర కకుప్పాటీసమాటీకనా।

అనిచదివి ఆనందోత్సాహములతో ఉప్పొంగు వేలాది విద్యార్థి యువకుల కరతాళ హర్షధ్వానములతో ప్రతిధ్వనించుచుండగ తమ ఉపన్యాసమును ముగించిరి. ఆ తరువాత శ్రీరాఘవాచార్యులుగారు నన్ను చెన్నపురి ఆంధ్రసభలో 'హెన్రీఫోర్తు' పాత్రను ప్రదర్శింప వలసినదిగా ప్రోత్సాహించి, స్వాతంత్ర్యోద్యమమందు ప్రముఖ పాత్ర వహించిన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారితో పరిచయ భాగ్యమును కలుగజేసిరి. ప్రఖ్యాత నాటకరచయిత షేక్స్పియరు రచనలలో "నాలుగవ హెన్రీ," 'ఐదవ హెన్రీ' చారిత్రాత్మక జంట నాటకములు. వానినుండి రెండు రసవత్తర ఘట్టములను నేను ప్రదర్శించి పంతులు గారి ప్రశంసకు పాత్రుడనైతిని. అప్పుడే శ్రీ రాఘవాచార్యులు గారు వ్యాయామ క్రీడా పోటీలలోను, ఆంధ్ర, ఆంగ్ల, సాహిత్య ప్రదర్శనల యందు పాల్గొనుటలో నాకు గల యీ శక్తిని పంతులు గారికి తెలియజేసిరి. అంతేగాక మదరాసు విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలలో హాకీ, ఫుట్‌బాల్, పోటీలలో నైపుణ్యము కనబఱచిన నాతోబాటు మరి యిద్దరు ఆంధ్రసోదర ఆటగాళ్ళు శ్రీ పార్థసారధి, కనకాద్రిరావులను పరిచయము జేసిరి. అంతకు పూర్వమే ఈ యాంధ్రయువక విద్యార్థుల వ్యాయామ క్రీడా నైపుణ్యమును ప్రశంసించుచు అప్పటి యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ మాసపత్రికలో మొదటిసారిగా ఆంగ్లో-ఇండియన్-మళయాళీ క్రీడాకారుల రికార్డును యధిగమించినట్లు నుదహరింపబడెను. అప్పుడు పంతులుగారు నన్ను యభినందించుచు "ఒరేయి! నేను కూడ ఒకప్పుడు నా విద్యార్థిదశలో వ్యాయామ క్రీడా నాటక పోటీలలో ప్రముఖ పాత్రవహించితిని" అని ప్రేమ పూర్వకముగ నాభుజములను తట్టుచు పూర్వ స్మృతులను నెమరు వేసికొనుచు, నన్ను దేశసేవ చేయవలసినదని ప్రభుత్వోద్యోగము శిరసావహింపవలదని ప్రేమపూర్వకముగా నాదేశించిరి. (సశేషం)

భరత బంగాళ సంక్రాంతి పౌషలక్ష్మి

సు. సత్యనారాయణ శాస్త్రి

బంగాళా దేశమ్ము పంచబంగాళమై
రాక్షస యహ్యఖా క్రాంతమైన
బంగళా సంస్కృతి వైభవ స్మృతి వీర
ముష్కర దావాగ్ని బూదియైన
బంగళా జన ఘోష క్రేంకృ ప్రతిధ్వని గళ
కాహళీ ముఖరితా కాశమైన
బంగళా దేశ సంపద పాక్ విమత ఘోర
దౌష్ట్య ఝంఝూనిల ధ్వస్తమైన
నాడుదాసీన వైఖరి నట్టె చూడ
నఖిల భారత సైన్య విక్రాంతి నెఱపి
భరతేందిర వెలుగొందె భవ్య చరిత!
భారత బంగాళ సంక్రాంతి పౌషలక్ష్మి!

కాలవిత్తోత్తల గోకి కొన్నాడు ప్రెసిడెంటు
యాహియాఖాను వహ్వారె! యనుచు
కుక్క తోకను బట్టి గోదావరిని దాట
యత్నించె నిక్సన్ మహాశయుండు
చెరచుటకై వచ్చి చెడినాడు చైనా ని
యంత యాహ్యా సహాధ్యాయి 'మావొ'
గోడమీదను పిల్లి కూర్చున్నటుల కొంద
రందిరి నగుబాట్లు పందలగుచు
ఒక్క బంగాళా స్వాతంత్ర్య యుద్ధ మవని
నూపి యాడించి నిగ్గుల నూర్చి తేర్చి
భారతీయ విక్రాంతికి వన్నె గూర్చె!
భరత బంగాళ సంక్రాంతి పౌషలక్ష్మి!

"కృషితో నాస్తి దుర్భిక్షం"

—ఆర్. ఆర్. రావు

"రాజకీయ స్వాతంత్ర్యం వస్తే చాలదు, ఆర్థిక స్వాతంత్ర్యం రావాలి." అని అన్నారు మనదేశం విదేశ పాలననుండి విమోచన పొందినపుడు, ఇరువయి అయిదేండ్లకుముందు అనేక మహామహులు.

ఆ మాట అక్షరాలా నిజం. స్వరాజ్యం వస్తే, ఏమవుతుంది? అదేమన్నా కడుపు నింపుతుందా? దాన్ని తిని బ్రతకగలమా? భౌతికంగా ఆలోచిస్తే మనిషికి కావలసింది పట్టెడన్నం. అది దొరికిన నాడే, అంటే కడుపు నిండిన నాడే మనం స్వేచ్ఛా వాయువులను హృదయంనిండా పీల్చుకొని నిశ్చింతగా బ్రతుకగలం.

అందువల్లనే మనం స్వాతంత్ర్యంరాగానే మనది ఏ రాజ్య కూటమికీ రాజకీయ మతానికీచెందిన దేశం కాదన్నాము. ఆర్థిక పురోభివృద్ధియే మన లక్ష్యం అనుకుని, అది సాధించేందుకు అన్ని "ఇజా"లలోని మంచినీ గ్రహించాం. తత్ఫలితంగా, మనదేశంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు వెలిసి, అభివృద్ధిచెంది, దేశాభ్యున్నతికి రెండు రాజమార్గా లయినాయి.

ఇతర దేశాలతో పోల్చిచూస్తే, వ్యవసాయరంగంలో మనం వెనుకబడి వున్నమాట నిజం. కానీ పాతిక సంవత్సరాల క్రితం వున్న రైతుకూ ఈనాటి రైతుకూ పోలికలేదు. ఆనాటి మన కృషీవలుడు, అన్నదాత ఎండకు ఎండి వానకు తడిసి, తాతల నాటి కొయ్య నాగలితో ముసలి ఎద్దులతో కండలు కరిగించుకునే వాడు. శ్రమకు లోపంలేదు. కాని పంట, పడినశ్రమకు తగినట్టు ఉండేదికాదు. పొలం సరిగా దున్నబడేదికాదు, చల్లిన విత్తులలో సగం చచ్చుపీ, పుచ్చుపీ పోగా మిగిలిన వాటిలో పిట్టలు తినగా పెరిగి పెద్దవిఅయి కంకివేసేవి చాలా తక్కువ. పెరిగి కోతకు సిద్ధంగావున్న చేను ఇంటికి వచ్చేలోపల ఎన్ని ఇబ్బందులో! ఒకటా, రెండా! చీడపడి పోయేది కొంత, మిడతలదండు నాశనం చేసేది మరికొంత. ఇలా పోయింది పోగా ఇంటికొచ్చిన ధాన్యాన్ని చూచి రైతు ఎంతో నిరాశ నిస్పృహ, నిరుత్సాహం పొందేవాడు. వీటికి తోడు ప్రకృతి విజృంభించితే ఇహ చెప్పనక్కరలేదు. వర్షం హెచ్చుగా పడితే వరదల బాధ. అసలు లేకుండావుంటే అనావృష్టి. వాన కావలసినంత కురిసిన ఏడాది రైతుకు పండగ.

ఈ విధంగా మనరైతు భూమాతనూ, ప్రకృతినీ నమ్ముకుని మోసపోవటం ఎన్నాళ్లని? మరి మార్గం లేదా? మనవారు ఈ సమస్యయొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించారు. మన రాజకీయ, వైజ్ఞానిక నాయకులు, దీనిని సాధించటం తమ ముఖ్య కర్తవ్యంగా గ్రహించి ఈ సమస్యను ముందు వెనుకలను కూలంకషంగా చర్చించారు. రైతుయొక్క విజయం ఒక్క భూమిమీదనే ఆధారపడి లేదు. ఎటువంటి విపత్తునయిగా ఎదుర్కొనే శక్తిని రైతుకు ఇవ్వగలిగిననాడే, మనకు ఆహారకొరత తీరుతుంది. నాగలిని బలంగా నొక్కుతూ ఎడ్లను ఎంతకొట్టినా భూమిలో శక్తి లేనినాడు ప్రయోజనం ఏమీవుండదు. ఎక్కువ భూమిని సాగులోకితెచ్చి, సారవంతంచేసి, మంచి విత్తులు వాడటం ఒక ఎత్తు, ఆ పంటకు నీటి సదుపాయం సమకూర్చటం ఒక ఎత్తు. వరదలను నిరోధించటం మరొక ముఖ్య కార్యక్రమం. ఇందువల్ల వ్యవసాయరంగంలో ప్రగతి సాధించటం, పారిశ్రామిక, వైజ్ఞానిక రంగాలపై ఆధారపడి వుందని మనం గ్రహించాము. ఫలితమే మన పంచవర్ష ప్రణాళికలు.

నీటి వసతుల మూలంగా సారవంతమైన భూమిలో ప్రజలకు కావలసిన ఆహార ధాన్యాలను పండించవచ్చు. నదులు ఎక్కువగా వుండి, ఆ నీటిని భూమిసాగుకు, విద్యుదుత్పాదనకు ఉపయోగించే దేశం చాలా అదృష్టవంతమైనదని చెప్పక తప్పదు.

"అన్ని గ్రామాలకూ నీటి వసతులు కల్పించే విషయమై నొక్కి వక్కాణింప వలసిన పనిలేదు. ఈ పునాదిపైనే వ్యవసాయాభివృద్ధి ఆధారపడి వున్నది. ఇది లేనిపక్షంలో వ్యవసాయం జూదంలా వుండిపోతుంది" అన్నారు గాంధీజీ 1946లో.

ప్రకృతి మనకు ఇచ్చిన వరాలలో ముఖ్యమైనది జీవన ప్రదానం చేసే నీరు. మనదేశం, పెద్ద, చిన్న అనేక జీవనదులతో విరాజిల్లుతోంది. స్వాతంత్ర్యం వచ్చేటప్పటికి సాగునీటి వసతులు అంతగాలేవు. సాగుచేయబడుతున్న భూమిలో మూడువంతులు వర్షపాతంపై ఆధారపడి వుండేది. వర్షం వస్తే పండగ. లేకపోతే ఆ భూమి దండగ. కనుక నదీజలాలను దేశాభివృద్ధికి వినియోగించే విషయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. గట్లు తెంచుకుని, పండెపు గుర్రాలలాగా, పంట పొలాలను ధ్వంసం చేస్తూ అతి భయంకరంగా మారే నదుల ప్రవాహపు వేగాన్ని తగ్గించి, ప్రక్క కాల్వలలోకి ప్రవాహాన్ని మళ్ళించి పొలాల్ని సస్యశ్యామలం చేసే ప్రయత్నాలే నదీలోయ ప్రాజెక్టులు. వీటికి ప్రణాళికలో అధికంగానూ, తర్వాత వాటిలో తగినంతగానూ ప్రాముఖ్యత ఇస్తూ వచ్చారు.

వీటిలో చాలావరకు సాగు నీటికి, వరదలను నిరోధించటానికి, విద్యుదుత్పాదనకు రూపొందించ బడ్డాయి. వ్యవసాయ రంగంలో కూడా గొట్టపు బావులనుండి, మామూలు బావులనుండి నీటిని తోడ టానికి విద్యుచ్ఛక్తి ఉపయోగ పడుతూంది. మనము నిర్మిం చిన అనేక ప్రాజెక్టులలో ఎన్నదగినవి, భాక్రా నంగల్, రిహాండ్, హీరాకుడ్, నాగార్జున సాగర్ మొదలైనవి. ఇవి సాగునీటికి, వరదలను అరికట్టటానికి, విద్యుదుత్పాదనకు. ఈ విధంగా బహూళార్థ సాధకంగా రూపొందించబడ్డాయి. నవభారత శక్తికి, ఐక్యతకూ ప్రతీకలుగా నేడీ ప్రాజెక్టులు నిలచివున్నాయి. అంతేగాక మనము చేపట్టిన చెరువులు, బావులు, గొట్టపు బావులు, లిఫ్టు ఇరిగేషన్ తదితర పనుల వంటి చిన్నతరహా సేద్యపు నీటి పథకాల ద్వారా దాదాపు 20 మిలియన్ల హెక్టార్ల పంట భూమికి కొత్తగా నీటి వసతులు కల్పించ బడినాయి. ఇటువంటి పథకాల వలన దాదాపు 37 మి. హెక్టారుల వరకూ సాగు నీటి వసతులు విస్తృత పరచ వచ్చు అని అంచనా వేయబడినది.

పెద్ద పెద్ద నదులు వుండటం మన అదృష్టం. అయినా, ఒక్కొక్కప్పుడవి శాపాలుగా పరిణమిస్తాయి. ప్రతి ఏడాది, ఇదివరలో, వరదలవల్ల పంట, ప్రాణ, ఆస్తినష్టం సుమారు రు. 100 కోట్లు వరకూ వుండేది. స్వాతంత్ర్యానికి పూర్వం వరద లను నిరోధించటానికి ఏమీ చర్యలు తీసుకోలేదు. కానీ మన ప్రణాళికల్లో వరద నిరోధక ప్రయత్నం అతి ముఖ్యభాగంగా రూపొం దించబడింది. గట్లు వేయటం, ఎత్తు పెంచటం, కాలువలు నిర్మిం చటం లాంటి పనులవల్ల దాదాపు 6 మి. హె. ల భూమికి రక్షణ కల్పించబడింది. అంతేకాదు, వరదలను శాశ్వతంగా అరికట్టటానికి గాను మన నదులపై చిన్నా పెద్దా డాములు నిర్మించి, కృత్రిమ తటాకాలు ఏర్పాటు చేసి ప్రవాహవేగాన్ని తగ్గించి వేశాము. ఈ నిలువ నీటిని సేద్యానికి వాడుతున్నాము. ఈ విధంగా ప్రకృతిలో ముఖ్య భాగమైన నదులను మచ్చిక చేసుకోటం, వ్యవసాయ రంగంలో సాధించదలుచుకున్న ప్రగతికి నాంది అయింది.

ఇంజనీరింగ్ పరిశ్రమలు

రెండవ వైపునుండి మన ఇంజనీరింగు పరిశ్రమలు రైతు పురోభివృద్ధికి దోహదం చేశాయి. మరనాగళ్ళు ఈ నాటి రైతుల వద్ద సర్వ సాధారణంగా చూస్తున్నాము. పొలం దున్నుకునేందుకు ట్రాక్టర్లు, విద్యుచ్ఛక్తి నాగళ్ళు, విత్తులు లోతుగా నాటేందుకూ, కలుపు తీసేందుకూ, నూర్పిడికీ, తూర్పార పట్టేందుకూ, గడ్డికోసేం దుకు ఒకటేమిటి ప్రతి చిన్న పనికి కూడా తగిన సాధనాలు రూపొం దించి సామాన్యరైతుకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ట్రాక్టర్ల ఉత్పత్తిని మూడు రెట్లు, విద్యుత్ నాగళ్ళ ఉత్పత్తిని ఇరవయి అయిదు రెట్లు పెంచటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వేరొక దిక్కు నుండి మంచి విత్తనాలను, హెచ్చు పంట నిచ్చే విత్తనాలను రైతులకు అందిస్తున్నాము. మనము స్థాపించిన అనేక వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వివిధ ఆహార పదార్థాల పరిశోధనా సంస్థలు ఈ సందర్భంగా చేసిన కృషి ఎంతో ప్రశంస నీయం. ఒక నాటి పంటకన్న ఈ రోజు ఎన్నో రెట్లు హెచ్చుగా దిగుబడి వుంది. అంటే అదంతా మన వ్యావసాయిక వైజ్ఞానికుల చలువయే. ఏ రైతుని మాట్లాడించినా టి.ఎన్.–1, ఐ.ఆర్.–8, పద్మ, జయ, హంస, మణేలా, పొట్టిగోధుమ, గాంగా సఫేద్, సి.ఎస్.పి.–1 అనే అంటాడు ఈ రోజుల్లో. రైతులోకం ఎంతో తెలివి మీరింది. శాస్త్రజ్ఞులు అన్ని విత్తనాలూ హెచ్చు పంటను ఇస్తాయని చెప్తుంటే అత్యధిక దిగుబడి వుండే రకాన్నే ఎన్నుకుంటున్నాడు ఈ నాటి రైతు. పంట ఎక్కువగా పండితే పన్నులు వేస్తారని, మన రైతులలో చాలా మంది ఎంత పండిందో చెప్పటలేదు. ఒక విధంగా వ్యవసాయరంగంలో సాధించిన విప్లవానికి ఇది తార్కాణం.

మన దేశంలో ఎరువుల క్రిమి నాశకాల ఉపయోగం ప్రచారంలోకి వచ్చింది. స్వతంత్రం తర్వాతనే వాటికి రోజు రోజుకీ పెరిగి పోతున్న గిరాకీ తట్టుకోటానికి ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో అనేక కర్మాగారాలను స్థాపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా వున్న ప్రచారం, వ్యాపార సరళిలో ప్రవేటు సంస్థలు చేసిన ప్రచారం, ప్రభావం కనిపిస్తుంది మన రైతుల మీద. ఎరువు వాడని రైతు లేడంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు: అందువల్ల, నత్రజని ఎరువులు ఉత్పత్తి నాలుగున్నర రెట్లు అంటే 2.5 మి. టన్నులకు, భాస్వరపు ఎరువుల ఉత్పత్తి నాలుగు రెట్లకు కాస్టిక్ సోడా, సోడాయాష్, సల్ఫ్యూరిక్ ఆసిడ్, మొదలగు మూడు రసాయనిక పదార్థాల ఉత్పత్తిని పెంచటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అంతేకాదు ఒక వేళ ఏ రైతన్నా ఇంకా ఎడ్లను వాడుతూనే వున్నాడనుకుందాం. అవి అతనిలాగే మంచి బలంగా వుంటాయి. ఈ నాడు పశు సంపద అభివృద్ధి పరచడంలో మన ప్రభుత్వం చూపిన శ్రద్ధే ఇందుకు కారణం. దేశంలో పటిష్టమైన ఆవు, గేదె, దున్న, ఎద్దులను సంపాదించటంలో మనం ఎంతో విజయం సాధించాం. ముఱ్ఱా, థర్పార్కర్, ఒంగోల్, కంగాయమ్, అమృత మహల్, దేవణీ, మొదలైన మంచిజాతి పశువులసంఖ్య పెంచుతూ బలహీన ప్రాణులను తొలగించడం వల్ల, మన ఎడ్లు మంచి బలంగా వుంటున్నాయి. ఆధునిక యంత్ర పరికరాలు ఇంకా అందుబాటులోకి రాని ప్రాంతం వారు, ఈ ఎడ్ల సాయంతో ఇంకా ఇంకా భూమిని సాగులోకి తెస్తున్నారు.

ఆ విధంగా ఈ విప్లవం మనం సాధించామంటే దాని వెనుక అనేక మంది సహకారం, అనేక ఏండ్ల కృషివుంది. ఇది ఏ ఒక్కరివల్ల, ఏ ఒక్క రంగం వల్ల సాధించబడలేదు. అన్ని రంగాలు,–వ్యవసాయ, వైజ్ఞానిక, పారిశ్రామిక రంగాల సాముదాయిక కృషి ఫలమే ఈ విప్లవం. అన్నిటికన్నా ముఖ్యమైనది మన ఆత్మ విశ్వాసం. స్వయం సమృద్ధిని ఆహార రంగంలో సాధించాలన్న దృఢ సంకల్పం ఈ నాడు సుమారు 105 మి. టన్నుల ఆహార ధాన్యాలను పండించటంవల్ల, ఇంక ముందు రాత్రి భోజనానికి పరాయి దేశాల మీద ఆధారపడవలసిన అవసరంలేదు. అందు కనే PL 480 సదుపాయం మురిగిపోయినా ఫరవా లేదంటున్నాము. "కృషితో నాస్తి దుర్భిక్షం".

[తరువాయి 19వ పేజీలో]

చాటువులు

శ్రీ ఎస్వీ రామారావు

తెలుగులో సాహిత్య విమర్శనము ఆధునిక యుగమునందు అవతరించిన వాఙ్మయ ప్రక్రియ. ప్రాచీన యుగమునందు విమర్శనా సాహిత్యము మృగ్యము. ఐనను ప్రత్యేకములైన విమర్శ గ్రంథములు లేకపోయినంత మాత్రమున నాడు విమర్శనమనేది లేదని భావించుట పాడికాదు. సాహిత్యము ననుసరించి విమర్శయు వెలువడుచుండును. ప్రాచీనాంధ్ర సాహిత్యమునకు తొమ్మిది శతాబ్దముల విశిష్ట చరిత్ర గలదు. ఇతిహాస కావ్యములు, పురాణములు, ప్రబంధములు, ద్విపదలు, క్షేత్రమహాత్యములు, ద్వ్యర్థికావ్యములు. యక్షగానములు, కీర్తనలు, వచనములు మున్నగు విలక్షణ ప్రక్రియలతో ఆంధ్రవాఙ్మయము విలసిల్లుచున్నది. ఇంతటి వైవిధ్యముతో కూడిన, విస్తృతమైన సాహిత్యమున్నప్పుడు విమర్శయును ఏదో యొక రూపమున ఉండకపోదు. కాని నాడు గ్రంథముద్రణ సౌకర్యము కొరవడుటవలన గ్రంథపఠనము అంత విరివిగా కొనసాగలేదు. గురుముఖమున మాత్రమే సాహిత్యము వ్యాప్తియందుండెను. అరుదుగా నున్న తాళపత్రగ్రంథములు ఏ కొందరు సహృదయులకో లభించినపుడు ఆ కావ్యములలోని రమణీయార్థములను విశేషములను వారు ముచ్చటించుకొని యుందురు. వారి చర్చలు అక్షరబద్ధములై గ్రంథరూపమున లభింపక పోయినంతమాత్రమున నాటి పఠితలకు విమర్శనదృష్టి కొరవడినదని తలంచుట ఉచితము కాదు. రాజాస్థానములలో సాహిత్యగోష్ఠులు విరివిగా జరుగుచుండినట్లు నాటి చరిత్రయే సాక్ష్యమొసంగు చున్నది.

ప్రాచీనాంధ్ర ప్రభువులు సలిపిన సాహితీ జైత్రయాత్రలలో విమర్శక యోధులెందరో పాల్గొనిరి. వారి విమర్శలేవియు అక్షరబద్ధములు కాకపోయినను నాటి సాహిత్య విమర్శ స్వభావము నవగాహన చేసికొనుటకు కొన్ని లిఖితపూర్వకమైన సాక్ష్యములు లభించుచున్నవి. కావ్యావతారికలు, చాటు పద్యములు ప్రాచీన కవుల విమర్శ దృష్టి నెరుగుటకు బాగుగా ఉపకరించుచున్నవి. చాటుపద్యములలో ద్యోతకమగుచున్న సాహిత్య విమర్శ స్వభావము నరయుట ప్రస్తుతము.

చాటువనగా ఇంపైనదని అర్థము. చాటుపద్యమనగా రమణీయ పద్యము. కవులు సందర్భవశమున ఆశువుగా చెప్పిన పద్యములే చాటువులుగా ప్రసిద్ధములైనవి. వీనిలో కొన్నింటికి కర్తలెవరో తెలియదు. కర్తపేరు తెలియకున్నను అవి ప్రచారమునం దుండుట చేతనే వాని ప్రాశస్త్యము నిరూపితమగు చున్నది. ఆంధ్రమున చాటువులు కోకొల్లలు. ప్రాచీనాంధ్ర కవులు రాజాస్థానములను దర్శించినపుడును, విద్వద్గోష్ఠులలో పాల్గొనినపుడును, ఇంకను ఇతర సందర్భములయందును నుడివిన పద్యములు సాహిత్య విమర్శకు నెలవులై యున్నవి.

ఆంధ్ర వాఙ్మయమున శ్రీనాథుని చాటువులు జగత్ప్రసిద్ధములు. ప్రౌఢదేవరాయల ఆస్థానమునందు ప్రముఖుడైన ముమ్మ కవిని దర్శించిన సందర్భమున నుడివిన పద్యములో (సంపావిరూపాక్ష బహుజటాజూటికారగ్వధ ప్రసవ సౌరభ్యములకు) అతడు స్వీయ కవితాగుణముల నుగ్గడించెను. దేశికవితారీతికి చెందిన పదకవితలపై నాటి పండితులకు గల నిరాదరణము సహజమే అయిన ఈ చాటువు చాటుచున్నది.

ముదివిటులు విధవలంజెలు పదకవితలు మారుబాస బాపనసరస్
చదువని పండిత వర్యులు కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్

సంస్కృతాంధ్రముల యందు సమముగా కవనము చెప్పుమని శ్రీకృష్ణదేవరాయలడిగిన సమయమున అల్లసానిపెద్దన్న ఆశువుగా వచించిన "పూతమెరుంగులుం........." అను ఉత్పలమాలికా పద్యమునందు కవిత్వ లక్షణములు పేర్కొనబడినవి. కైతపూత మెరుంగులతోఆడంబరముగా నుండక లలితమై, హృదయాహ్లాదకరము కావలయునని అందలి తాత్పర్యము. నాడు కవిత్వ ప్రేరకములైన వానిని తెలుసుకొనుటకు పెద్దనచే రచితమైన ఈ చాటువు సాధనముగా నున్నది.

నిరుపహతిస్థలంబు రమణీ ప్రియ దూతిక దెచ్చి యిచ్చుక
ప్పుర విడె మాత్మ కింపయిన భోజన ముయ్యెల మంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరికిన గాక యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే?

ఇందలి ఒప్పుతప్పులయు రసజ్ఞులు నాటి విమర్శకులే యని చెప్పవచ్చును.

తెలుగు దేశమున మిగుల ప్రచారమునందున్న తెనాలిరామకృష్ణుని చాటువులలో అతని సూక్ష్మ పరిశీలనాదృష్టి, విమర్శక హృదయము ద్యోతకములగుచున్నవి. మనుచరిత్రలోని 'అమవసనిసి' ప్రయోగము నాక్షేపించుచు అతడిట్లు పలికెను.

ఎమితిని సెపితివి కపితము ? భ్రమపడి వెరిపుచ్చకాయ వడిదినిసెపితో
యుమెతక కయతిని సెపితివో ! యమవసనిసి యనెడిమాట యులసని
పెదనా !

పై ప్రయోగము లఘువులైన హ్రస్వాక్షరములచే నిండియున్న దను హేళన ధ్వనించునట్లుగా అట్టి అక్షరములతోనే ఈ పద్యము కూర్చబడినది. ఐనను రామకృష్ణునికి పెద్దనపట్ల పెద్ద గౌరవము కలదని ఈ క్రింది చాటువు నిరూపించుచున్నది.

కవియల్లసాని పెద్దన ! కవితిక్కన సోమయాజి గణుతింపంగా
గవినేను రామకృష్ణుడ ! కవియను నామంబు నీటి కాకికి లేదే ?

మనుచరిత్ర, పారిజాతాపహరణము, వసుచరిత్రలలో నాయికల శోకము వర్ణింపబడిన పద్యములు ప్రసిద్ధములై యున్నవి. వరూధిని 'కలస్వనంబుతో', సత్యభామ 'బాలపల్లవ గ్రాస కషాయకంఠ కలకంఠ వధూకల కాకలీధ్వనితో', గిరిక 'కిన్నర వధూ రాజత్కరాంభోజ కాంభోజీ మేళ విపంచికారవ సుధాపూరంబు తోరంబుగా' ఏడ్చిరి. ఈ ముప్వురి శోకములు విని రామకృష్ణుడు చమత్కార పూర్వకముగా ఇట్లు పేర్కొనెను.

అల్లసానివాడల్లనల్లనయేడ్చె
ముక్కుతిమ్మన ముద్దు ముద్దుగా నేడ్చె
భట్టుమూర్తి బావురుమని ఏడ్చె.

ప్రాచీన కవులు సమకాలీన కవులను ప్రశంసించుచు చెప్పిన చాటువులు కూడ పెక్కు కలవు. భట్టుమూర్తి ముక్కుతిమ్మన కవితనిట్లు ప్రశంసించెను.

మాకొలది జానపదులకె—నీకవనపు ఠీవి యబ్బునే కూప నట
ద్భేకములకు గగనధునీ—శీకరముల చెమ్మనంది సింగయ తిమ్మా ?

ఇందు 'గగన' అనుచోట 'నాక' అని కృష్ణరాయలు సవరించె నని ప్రతీతి. రాయలుకూడ 'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల'లోని అతులిత మాధురీ మహిమ' ను కొనియాడెను. పదునేడవ శతాబ్దమునకు చెందిన కవి మిత్రులు ఏనుగు లక్ష్మణ కవి, కూచిమంచి తిమ్మకవి—తర్వాతి శతాబ్దములోని అడిదము సూర కవి, కొట్టా బాలకవి ఒకరినొకరు మెచ్చుకొనుచు చెప్పిన చాటువులు విశేష ప్రచారమునందున్నవి. తన కాలమున గంటము పట్టిన ప్రతివాడును కవిత్వము వ్రాయుచుండుటను గర్హించుచు సూరకవి ఇట్లు వాపోయెను.

దేవునాన మున్ను దేశాని కొకకవి—యిప్పుడూరనూర నింటనింట
నేవురార్గు రేడ్గు రెనమండ్రు తొమ్మండ్రు—పదుగురేసి కవులు
పద్మనాభ !

నాడు కవులమధ్య కుల, మతవైషమ్యము లేర్పడినట్లును కొన్ని చాటువులు వెల్లడించుచున్నవి. రామకృష్ణుడు భట్టుమూర్తి ని 'కాపుగవిత్వపు గూతలు బాపన కవివరుని చెవికి ప్రమదం బిడునే' అనియు, 'క్షుద్ర ప్రజ్ఞలు విప్రపత్కవి వచస్స్ఫూర్తి న్విడంబించునే' అనియు ఆక్షేపించెను. అర్వాచీనులైన అడిదము సూరకవి, రేకపల్లి సోమనాథకవి, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి చాటువులలోను నియోగి వైదిక మతభేదములు గోచరించుచున్నవి.

ఈ విధముగా చాటు పద్యములు ప్రాచీనాంధ్ర కవుల పరిశీలనా దృష్టిని వెల్లడించుచు నాటి విమర్శ లక్షణము నెరుంగుటకు ముఖ్య సాధనములై యున్నవి.

[17 వ పేజీ నుండి]

కృషితో నాస్తి దుర్భిక్షం

ఒకప్పుడు వ్యవసాయం చేయటం పరువు తక్కువ పని. హీన వృత్తి · మరి ఈ నాడో ! తిరువనంతపుర వాస్తవ్యులు శ్రీ పి. కరుణాకర మీనన్, ఇన్‌కం టాక్సు ఆఫీసరుగా రిటయిరయి, తన స్వంత డాబా టాపుమీద I.R. 8 పండిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ గ్రామస్థుడు శ్రీ అమూల్య కుమార్ గోస్వామి, ఇసుక మైదానం నుండి 5 ఎకరాలు సాగుకు తెచ్చి, I.R. 8ను నాటారు. ఆ నేలలో ఎకరానికి 15 క్వింటాళ్ల పంట వచ్చింది. తోటి రైతు చూర్నకటి అనే పరిని ఎకరాకు 5 క్వింటాలులే పండించారు. ఒరిస్సాలోని గోపాల్‌పూర్ నివాసి శ్రీ నీలమణి నాయక్ ఎకరానికి 4777 కి.గ్రా. తయ్‌ఛుంగ్ నేటివ్—1 పండించారు. పెట్టుబడి రూ. 508/— లాభం రూ.3 362/— తూర్పుగోదావరి జిల్లా,పామఱ్ఱు గ్రామస్థులు శ్రీ చిట్టూరి భాస్కరరావు ఒక ఎకరానికి 3,000 కి.గ్రా ల I.R. 8 పండించారు. అదే గ్రామంలో శ్రీ టి. రాములు అనే ఆయన ఎకరానికి 3225 కి.గ్రా. పండించారు. అదే పొలంలో సాధారణ రకం పంట 1200 కి. గ్రా. పండుతూ వుండేది. ఇలా వ్రాసుకుంటూపోతే ఎన్ని వందల ఉదాహరణలయినా చూపించవచ్చు. ఇవి కట్టు కథలూ, గాలి వార్తలూ కావు. ప్రత్యక్షంగా స్వయంగా వెళ్ళిచూచి, నిజమే అని నిర్ధారణ చేయబడిన వాస్తవాలు. ఊహాగానాలు, ప్రచార నిమిత్తం తయారుచేయబడిన కథలేమో అనిపించే యథార్థాలు.

కుటుంబ సంక్షేమం

—డాక్టర్ కె. కనకదుర్గాంబ

"జీవితంలోని సుఖాలను, చక్కని జీవన సరళిని తమ బిడ్డలకు ప్రసాదించవలెనని కోరుకోని తల్లిదండ్రులు లోకంలో ఎవరైనా ఉంటారా ? సుఖంగా హాయిగా పెరిగే కుటుంబంలో పుట్టగూడదని ఏ బిడ్డ అయినా అనుకుంటుందా ?" అని కుటుంబ నియంత్రణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఒకసారి మన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రశ్నించారు. అది నిజంగా అడగవలసిన ప్రశ్నే. అయితే ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడంగూడ చాలా సులభమే. జీవితంలో సుఖాలు కావాలని, తమ బిడ్డలకు చక్కని జీవన సరళి ప్రసాదించాలని కోరుకోని తల్లిదండ్రులు లోకంలో ఎవరూ ఉండరు. చదువుకున్నవారు కానివ్వండి, చదువురానివారు కానివ్వండి, ధనవంతులు కానివ్వండి, దరిద్రులు కానివ్వండి ప్రతి వొకరు తమ కుటుంబం సుఖాలతో చల్లగా ఉండాలనుకుంటారు ; తమ బిడ్డల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని బంగారు కలలు కంటారు. ఇది ఈ లోకపు నైజం ; ఇది అనాదిగా వస్తున్న మానవ స్వభావం ; ఇది అనంతంగా ఉండే మానవ ప్రకృతి.

కీలక అంగం

మన దేశంలో, మన సామాజిక వ్యవస్థలో కుటుంబం ఒక ముఖ్యమైన, కీలకమైన అంగం ; వేదకాలం నుంచి ఈ భావన మన దేశంలో బలంగా ఉన్నది. సమాజానికి, జాతికి కుటుంబం ఒక పీఠిక వంటిదన్న అభిప్రాయం. సమాజ శ్రేయస్సు కుటుంబ సంక్షేమం ద్వారానే సాధ్యమవుతుందన్న భావం ఇందులో ఇమిడి ఉన్నాయి ; 'వసుధైక కుటుంబం' అన్నది భారతీయ సంస్కృతి తన ఆశయంగా పెట్టుకున్న పవిత్ర ఆదర్శం ; ఆనందంతో కళ కళలాడే చల్లని, చక్కని కుటుంబానికి మనవాళ్లు ఎంతటి విలువ ఇచ్చినారో ఈ ఆదర్శంవల్ల వెల్లడవుతున్నది. అందువల్ల, 'కుటుంబ సంక్షేమం' అన్నమాట ఇవాళటిది కాదు. కుటుంబ సంక్షేమం కొరకు వెనుకటి కాలం నుంచే ఎంతో పరితపిస్తున్నాం ; ఇన్నాళ్లనుంచి అదొక అందమైన ఎండమావు వలె మిగిలిపోతున్నది.

నందనవనం

ఎందుకంటే, నిన్నటి కుటుంబానికి నియతి లేదు; అదొక అవధిలేని అరణ్యం అయితే, ఈనాటి సంగతివేరు. ఈనాటి ఆధునిక కుటుంబం, ఎంచుకొని పెంచుకొనే సుందర నందనవనం కోరికలు ఉండడంవేరు, అవి ఫలించడం వేరు. కోరికలు ఎన్నైనా ఉండవచ్చు. అవి ఫలించడానికి దృఢ దీక్ష, కృషి, కొంత త్యాగం కూడ ఉండాలి. జీవితంలో సుఖాలు కావాలని, చక్కని జీవన సరళిని తమ బిడ్డలకు ప్రసాదించవలెనని, తమ బిడ్డల భవిష్యత్తు చాలా బాగా ఉండాలని తల్లిదండ్రులందరు కోరుకుంటారు. అందులో సందేహం లేదు. కేవలం అనుకున్నంత మాత్రాననే ఈ కోరిక నెరవేరదు గదా ! ఒక పథకం ప్రకారం ఇందుకు గట్టి ప్రయత్నం అవసరమవుతుంది; తమ బిడ్డల భవిష్యత్తు కొరకు తల్లిదండ్రుల త్యాగం, దృఢదీక్ష, కృషి సైతం అవసరమవుతాయి. ఇవి గనుక తల్లిదండ్రుల వద్ద ఉంటే ఈరోజు కుటుంబ సంక్షేమం ఎంతో సులభంగా సాధ్యమవుతుంది.

సులభసాధ్యం

శక్తిని మించి పెరిగిపోయిన కుటుంబంలో సమస్యలు పెద్ద పెద్ద విషసర్పాలవలె భయంకరంగా కన్పిస్తుంటే, ఎడతెగని ఏటేటా కాన్పులతో ఇల్లాలు చిక్కి, శల్యమైపోయి మంచమెక్కి బాధపడుతుంటే, ఆకలి, అనారోగ్యంతో ఇంటినిండా లెక్కలేనంత మంది పిల్లలు అన్నమో రామచంద్రా అని రోదిస్తుంటే, చిక్కులతో కృంగిపోయి కన్నీళ్ళతో 'కర్మ'ను నిందించుకోవలసిన అవసరం ఈ రోజు లేదు. విజ్ఞాన శాస్త్ర రంగంలో మానవుడు ఎన్నో విజయాలను సాధించాడు; తన భవిష్యత్తుకు తానే స్వయంగా రూపకల్పన చేసుకోవడానికి అవసరమైన అవకాశాలను విజ్ఞానశాస్త్రం మనకు ప్రసాదించింది. కర్మను నిందించుకుంటూ తన జీవితాన్ని, తన కుటుంబాన్ని చిక్కులపాలు చేయకుండా విజ్ఞాన శాస్త్రం ప్రసాదించిన వరాలలో జీవితాన్ని వెన్నెల వాడగా చేసుకోవచ్చు. విజ్ఞాన శాస్త్రం ప్రసాదించిన వరాలతో కుటుంబ నియంత్రణ సౌకర్యాలు చాలా ముఖ్యమైనవి. ఆధునికమైన కుటుంబనియంత్రణ సౌకర్యాలతో మానవుడు తనకు నచ్చిన రీతిలో, తన శక్తికితగినట్టుగా తన కుటుంబాన్ని రూపొందించుకోవచ్చు, తద్వారా కుటుంబ సంక్షేమాన్ని సులభంగా సాధించుకోవచ్చు.

సమస్యల సర్పాలు

ఒక్క మాటలో చెప్పాలంటె తల్లిదండ్రులు, బిడ్డలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండి భవిష్యత్తును గురించి బాధపడ

పోడవమే కుటుంబ సంక్షేమం. తల్లీ పిల్లా సంతోషంగా ఉండడమే కుటుంబ సంక్షేమం. కాని, ఈ రోజు ఎన్నో కుటుంబాలలో తల్లి దుర్భర పరిస్థితులు ఏర్పడ్తూ ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నది. ఇందుకు ముఖ్యకారణాలు — ఏటేటా కాన్పులు, మితిలేని సంతానం, ఇందువల్ల ఏర్పడే ఆర్థికబాధలూ, అనారోగ్యం, మానసిక క్లిష్టసమస్యలూ. ఇక కుటుంబంలో ప్రశాంతి ఎక్కడుంటుంది ? కుటుంబానికి సంక్షేమం ఏ విధంగా చేకూరుతుంది? స్త్రీలు పూజింపబడేచోట భగవంతుడు ఉంటాడని ఒక సంస్కృత సూక్తి. కాని, మనదేశంలోని స్త్రీల పరిస్థితి మనకు బాగా తెలుసు. మాతృమూర్తిగా, భార్యగా, వంటమనిషిగా, ఇల్లు ఊడ్చేదానిగా, దాసిగా అన్నివిధాలా స్త్రీలే బాధలను భరించవలసిన పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నవి : ఈ పరిస్థితులలో, ఒక కుటుంబంలోని స్త్రీ తన కుటుంబ సంక్షేమానికి ఏమైనా దోహదం చేయగలుగుతుందా ? ఏమీ చేయలేదనే చెప్పాలి.

సులువైన మార్గం

క్లిష్టమైన ఈ పరిస్థితి నుంచి స్త్రీని కాపాడి, కుటుంబ సంక్షేమాన్ని సుసాధ్యం చేయడానికి కుటుంబనియంత్రణ ఒక్కటే చాలా సులువైన, చక్కని మార్గమని సూత్రప్రాయంగా అందరూ గుర్తిస్తున్నారు. ఈ నాటి కుటుంబనియంత్రణ సాధనాలు పద్ధతులు దంపతుల ఆరోగ్యానికి గాని, వారి సాంసారిక జీవితానికిగాని ఏ మాత్రం హానికలిగించవని ప్రపంచమంతటా చేసిన పరిశోధనల వల్ల, ఎన్నో లక్షలమంది దంపతుల అనుభవం వలన స్పష్టమవుతున్నది. కుటుంబనియంత్రయణ విధానాలను, తాత్కాలికమైనవి, శాశ్వతమైనవి. ఉపయోగించి ఎందరో దంపతులు తమకున్న వనరులతోనే చక్కగా జీవితం గడుపుతూ కుటుంబ సంక్షేమాన్ని పదిలం చేసుకున్నారు.

దేశమే ఒక కుటుంబం

కుటుంబనియంత్రణ అవసరాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తించి భారత ప్రభుత్వం దేశమంతటా పెద్దయెత్తున కుటుంబనియంత్రణ కార్యక్రమాన్ని ఒక పెద్ద ఉద్యమంగా అమలు పరుస్తున్నది. కుటుంబనియంత్రణ కార్యక్రమ విజయం మీదనే మన ఆర్థికాభ్యుదయం, మన దేశ శ్రేయస్సు ఆధారపడి ఉన్నవి. నిజానికి మన దేశమే ఒక పెద్ద కుటుంబం. వ్యక్తిగత కుటుంబాలు ఆనందానికి, సుఖశాంతులకు ఆరామాలయితే మొత్తం దేశమే అభివృద్ధి చెందుతుంది. ఐశ్వర్యంతో అలరార గలుగుతుంది. సుఖప్రదమైన పరిమితకుటుంబాలను, తద్వారా సంపదలతో సమృద్ధమయిన దేశాన్ని రూపొందించుకోవడమే మన ఆశయంగా పురోగమించాలి.

పదికోట్ల దంపతుల బాధ్యత

ఈ నాడు మనదేశంలో దాదాపు 10 కోట్ల మంది దంపతులున్నారు. వీరంతా 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్నవారు. మనదేశంలో జరుగుతున్న ఎన్నికలలో పాల్గొంటూ మన ప్రజాస్వామిక వ్యవస్థను రూపొందించడంలో, దేశ శ్రేయస్సుకు బాటలు వేయడంలో ఈ దంపతులందరు ఎంతో ప్రధానమైన కీలకపాత్ర వహిస్తున్నారు. ఈ పది కోట్ల మంది దంపతులే సంతానోత్పత్తి దశలో ఉన్నారని, మన జనాభా పెరుగుదలకు కారణమవుతున్నారని ప్రత్యేకంగా చెప్పాలి. దేశ శ్రేయస్సుకోసం, క్షేమం కోసం ఎన్నికలలో తమ అమూల్యమైన హక్కును వినియోగించుకొంటున్న ఈ పది కోట్ల మంది దంపతులు మొదట తమ తమ కుటుంబాల సంక్షేమాన్ని గూడా దృష్టిలో ఉంచుకోవాలి; తమ తమ కుటుంబాల సంక్షేమం కొరకు ఈ పది కోట్ల మంది దంపతులు వెంటనే కుటుంబ నియంత్రణ విధానాలను పాటిస్తే అందువల్ల దేశాభ్యుదయం గూడ సర్వతోముఖంగా సాధ్యమవుతుంది; ఇది ఈనాడు అందరి- ప్రత్యేకించి ఈ పది కోట్ల మంది దంపతుల జాతీయ కర్తవ్యం కుటుంబ సంక్షేమమే జాతీయ సంక్షేమం.

చిన్న కుటుంబమే చింతలులేని కుటుంబం

వాగ్గేయకారుడు

వరకవి శివరామదాసు

— పణతుల నరసింహయ్య

ఈ మధ్య నొక సారి రేడియోలో "కృష్ణాహరే బాలకృష్ణా హరే, ముద్దు కృష్ణాహరే యని పాడుదమా" అనే పాట వినిపించింది. ఆపాట చాలా బాగుంది. ఎంత బాగుందంటే మాటలలోచెప్ప లేము. విన్న తర్వాత పొందిన అనుభూతి వివరింప వీలు లేనిది. అది ఎవరి పాటో ఏమో అన్న సంగతి తెలుసుకొందామని కొన్ని పుస్తకాలు తిరగవేశాను. కానీ ఎందులోను కనిపించలేదు. ఇలా ఉండగా మాయింట్లో పుస్తకాలు సర్దుతుండగా ఒక పాతపుస్తకం దొరికింది. అందులో ఈ కీర్తన ఉంది. అది స్థల మహాత్యాలను తెలిపే పుస్తకం. వ్రాతది లెండి. అందులో ప్రాచీనుల కీర్తనలు దాదాపు అరవై దాకా ఉన్నాయి. ఈ 'కృష్ణాహరే' అన్న కీర్తన కొలకలూరు వారిదట. ఈ కొలకలూరు వారెవరో, ఏప్రాంతీయులో తెలియదు. ఆ పుస్తకంలో మహిమలూరు, యద్దనపూడి, తరిగొండ, శివగంగ, తాళ్ళపాక, కబీర్, రామదాసు మొదలగు వారి రచనలున్నాయి. అందులో వరకవి శివరామదాసుగారి కీర్తన కూడా ఒకటి ఉంది. ఇది ప్రసిద్ధమైనది. శివరామదాసుగారు కొన్ని వందల కీర్తనలు వ్రాశారట. ప్రస్తుతం చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో వీరిరచనలు కొన్ని మౌఖిక ప్రచారములో ఉన్నాయి. వీరి కీర్తనలన్నీ అముద్రితంగానే ఉండిపోయాయి. నేను గ్రహించినంత వరకు ఈ వాగ్గేయ కారుని జీవితేతివృత్తం సంగ్రహంగా ఇది.

ఇతని పేరు శివరామయ్య. ఇంటిపేరు యల్లా పంతులవారు. జన్మతః కాకినాడ వాస్తవ్యుడు. దాదాపు అతనికి పది సంవత్సరాల వయస్సులో చిత్తూరు ప్రాంతం వచ్చాడు. ఎందుకు వచ్చాడో తెలియదు. ఇతనికి ఆ చిరుత ప్రాయంలోనే సంగీత సాహిత్యాలలో అభినివేశం బాగా ఉండేది. చిత్తూరు జిల్లాలో పలు ప్రాంతాలు తిరిగి అతనికి వచ్చిన పాటలు పద్యాలువినిపించేవాడు. నేటికాలంలోలాగా నాడు సినిమాలు మొదలైన వినోద కార్యక్రమాలు లేవు కాబట్టి ఇతన్నికూర్చోబెట్టుకొని గ్రామ ప్రజలంతా పాటలు పాడించి విని తన్మయులయ్యేవారు. అలా యితనికి కొంతపేరు వచ్చింది. ఇలా ఉంటూ ఉండిన వాడు చిత్తూరుకు ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న ఉత్తర బ్రాహ్మణపల్లె అన్న గ్రామంలో నివాసం ఏర్పరచుకొన్నాడు. ఆ గ్రామస్థులంతా అతనికి ఆ ఊళ్ళో ఒక ఇల్లు కట్టించి యిచ్చారు. ఒక కళావిదుణ్ణి ఆ కాలంలో ఆ విధంగా ఆదరించే వారని వినడం ఆశ్చర్యంగా ఉంది కదూ. ఆ ఇంటికి నేటికీ భజన యిల్లు అన్న పేరు వ్యవహారంలో ఉన్నది. ఆ యింటిలో ఆ భక్తుడు నిత్యమూ భక్తితో భజన చేస్తూ కాలం గడిపేవాడు. తాను తరిస్తూ తన సహచరులను గూడ తరింపజేసేవాడు. ఇలా ఉన్నవాడు చిత్తూరునకు సమీపములో గల బంగారు పాళెం జమీందారును దర్శించి వారికి, తనకు సంగీత సాహిత్యాల్లో గల ప్రజ్ఞా ప్రాభవాన్ని చూపించాడు. అందుకు సంతోషించిన రాజాగారు, అతనికి "పుణ్యసముద్రం" అన్న గ్రామ ప్రాంతంలో కొంత భూమిని మాన్యంగా యిచ్చారు. దానితో అతడు జీవించేవాడు.

ఇతనికి గూడూరు ప్రాంతాలలో కొంత మంది మిత్రులుండేవారు. వారాప్రాంతానికితణ్ణి ఆహ్వానించేవారు. ఇలా ఉండగా ఒక సారి యీ శివరామ దాసు గూడూరు చేరుకొని అచట పాండు రంగ మందిరంలో చేరి నిత్యమూ భజనతో కాలం గడిపేవాడు.

ఆయన చరమ దశ అక్కడే గడిచింది. ఈ పరమ భక్తాగ్రణి దాదాపు అరవై సంవత్సరాలు జీవయాత్ర సాగించి 1950 ప్రాంతంలో గూడూరులోనే భగవానుని చేరుకొన్నాడు. "నటవిట గాయకోత్తముల పంక్తిని జేర్పక యుండిన కాలమది" ఆ మూఢాచారం ఇతన్ని ఎంతగానో క్రుంగదీసింది.

ఇతడు తాను రచించిన భజన కీర్తనలను ముద్రించాడని మొన్న ఒకరిద్వారా విన్నాను. మనకు లభ్యపడటం లేదు. "శ్రీరామ నామం" అన్న ఒక చిన్న పుస్తకం మాత్రం లభించింది. రామ నామము యొక్క మహిమను దెలిపే గ్రంథమిది. కీర్తనలు కావు. ఇది ఈయన గూడూరులో నుండినపుడు ముద్రించినది. ఇందులో రామనామముతోపాటు గోవింద రామనామము గూడ వున్నది. ఆ పుస్తకము మొదటి పేజీలో "ఇయ్యది శ్రీసింహపుర మండలస్థ గూడూరు గ్రామ పాండురంగ మందిర నివాసియగు శ్రీమద్వరకవి యల్లా పంతుల శివరామదాసు గారిచే రచింపబడింది" అని యున్నది. ఈ చిన్న పొత్తము 1943 లో భగవాన్ ప్రెస్, నెల్లూరులో ముద్రింపబడింది.

శ్రీ రామనామ మహిమ యెట్టిదో భక్తాగ్రణియిలాచెప్తాడు,

వెలుగును వెలిగింపజేసిన వెలుగు మూలము రామనామము
అచలమై ఆద్యంతరహితత నలరుచున్నది రామనామము
వేదములకు పుట్టుగృహమై వెలయుచున్నది
కర్త కర్మ క్రియల కెల్లను కారణంబగు
అన్నిటను తానేదికాకను అలరుచున్నది
పరకవి శివరామదాసుల వాక్సుధారస

శ్రీ గోవింద రామనామము మానస పూజాస్తోత్రమట. ఇది త్రిశ్రగతి ఏకతాళనములో రచింపబడింది. ఈ విషయము లీ గ్రంథంలో నున్నవి. ఇతడు భగవంతుణ్ణి కోరిందేమిటంటే :

మర్త్యలోకమందు గోవిందారామ
మరిజన్మ అవవలదు గోవిందా
సత్యంబు ధర్మంబు గోవిందారామ
స్వామి ప్రతిష్ఠించు గోవిందా" అని గ్రంథంచివర
"శివరామదాసుడను గోవిందారామ
శ్రీహరికి సేవకుడ గోవిందా
వైకుంఠ పతిపేర గోవిందారామ
వ్రాసి యర్పించితిని గోవిందా
పాదాధిక శతంబు (125) గోవిందారామ
పదముగా బాడవలె గోవిందా"

అని అంటాడు ఈయన పద్య రచన కూడ చేయసమర్థుడు. మచ్చుకు:

క॥ గోవిందనామ కీర్తన
గావించు మహాత్ములెల్ల గౌరవవృత్తిన్
జీవించి పెద్దకాలము
శ్రీవిష్ణు పురంబునందు జేరుదు రెలమిన్.

ఇక ఇతని కీర్తనములు నాకు లభించిన వాటిలో కొన్నింటిని మీకు పరిచయం చేస్తాను. ఇది పరమేశ్వర స్తుతి చూడండి.

లింగా వృషభతురంగా కరుణాపాంగా శరభాలింగా
గంగాల హరికేలా సంగా హెచ్చరికా!
మోహానిర్మోహా హంస స్సోహం సందోహా
కాకార్భట దనుజ దళన దర్పా హెచ్చరికా!
ఎంచి నెనరుంచి మది నెంచి తమిమించి దయయుంచి
మించి ఆపద ద్రుంచుము మిహిరా హెచ్చరికా!
శూరావిధి మారా సుకుమారా గుణ ధీరా
వీరాధి వీరా నిధి ధీరా హెచ్చరికా!

విధునా శతవదనా రిపుమదనా సుమసదనా
సదనంబగు తపణాంపుర రదనా హెచ్చరికా!
ధామా శివరామా దాసా కామమను ప్రేమా
ఏ మారక నను బ్రోవర ధీరా హెచ్చరికా!

ఈ పాట చిత్తూరునకు సమీపమునగల శివణం పల్లె గ్రామ మందలి భవునిగూర్చి చెప్పినది. ఆయన పేరు భైరవేశ్వరుడు. ఈ శివలింగమునకు నేటికిని పూజాది కార్యములు వీరశైవులు నిర్వహింతురు. ఈ శవణంపల్లె ఒకప్పుడు అసెంబ్లీ నియోజక వర్గముగ నుండినది. ఇక జోలపాట ఒకటి వినండి.

జో శ్రీ మహాలక్ష్మి జో కీర్తి లక్ష్మీ
రావె మా యింటికీ రమణి పవళింపా జోజో

విజ్ఞానమనెడు సౌధాంతరంబులనూ
సుజ్ఞానముగ జ్యోతి సూటిగా పట్టీ
శాంతమనియెడి ఉట్టి నేర్పుగా కట్టీ
సద్గుణైశ్వర్యములు చేర్లుగా కట్టీ జోజో
హంసతూలిక పాన్పు అందముగ పరచి
హింసకు మశకాదులకు దోమతెర వేసి
హంసోహమనెడు ఆత్మారాము గూడి
సంశయమ్ములు తొలగి నిదురించ వమ్మా. జోజో

నారీమణు లొసంగు నారింజ కమలా
తీయమామిడి పనస తేనరటి పండ్లూ
సరస రుచిరాన్న ఫలహారమ్ము లెలమీ
తిరుణి భుజయించి శయన గృహము చేరా జోజో

కోమలాంగిరొ మంచి కోమల మైన
తమలపాకులు చిత్ర తమముగను కటీ
ప్రేమరట్టించు పరిమళ సువాసనలు
గలయట్టి క్రముక చూర్ణపు విడియమిచ్చి జోజో

వనిత భూసురపురీశ్వరుని సోదరివై
వరలక్ష్మి మా యింట వేల్పువైనావూ
ఘనముగా భక్తులను కాపాడినావూ
ఘనత శివరామదాసును బ్రోచుచుండూ జోజో.

ఇపు డింకొక్కటి వినండి. ఇది సరస్వతీ స్తుతి. ఆమెను కదలనివ్వక అడ్డగిస్తూ —

ఎక్కడికేగెదవమ్మ చక్కని సరస్వతమ్మ
చక్కనీ గీర్వాణీ శారదా అలి నీలవేణి

స్థిరముగా జిహ్వాగ్రమందూ
నెలకొని వసియించు మమ్మా
నైమిశా వాసులూ పిలువా
నారీ శిరోమణిరో
కోరినా వరమూ లిచ్చీ ఆదరించు వేగ వచ్చీ
ధారుణీ శివరామ దాసుడను నేను
కోరితీ దాశరథి కథాసారము ముమ్మారు గ్రోలా !"

అని అంటాడు.

మన ఆంధ్రదేశంలో శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం జరుపుకోవడం అనూచానంగా ఉన్న ఆచారం. వ్రతం ముగిసిన తరువాత లక్ష్మీదేవిని అత్తవారింటికి సాగనంపుతారు. అపుడు పాడే యీ పాట నిత్యజీవిత విషయాలనెన్నింటినో తెలియజేస్తుంది. గమనించండి.

"వరమోక్షలక్ష్మి నీవు వెళ్ళిరావమ్మా
మా అన్నపూర్ణదేవి మగిడి రావమ్మా
పోయినా రాపునా పొందికతో యుంటే
పురుషునీ చేతిలో పువ్వువలె నుంటే
గురు సన్నిధానమున గురుతుగా నుంటే
పరమభక్తుల యెడ ప్రీతిగానుంటే
పెద్దలయెడ నీవు ఒద్దికతోయుంటే
అత్తమామల యెడల అణకువతో యుంటే
బావమరదుల యెడల భయముతోనుంటే
చిన్నకొడుకుల యెడల వెన్నవలెయుంటే
శత్రుమిత్రుల యెడల సమవర్తి నుంటే
ఆడుబిడ్డల యెడల విశ్వాసముంటే
అన్యజనముల యెడల అతిచతురతుంటే
సఖిజనాదుల యెడల సొంపుతోనుంటే"

మంచిదమ్మా, భయపడకు అని చెప్తాడు. ఇలాఉంటే నీ కెన్నో వస్తువులు కొనిస్తాను తల్లీ ! అంటూ యింకా యేమంటాడో చూడండి.

"పొందికతో యుంటే పోను అపయశమూ
పువ్వువలె నీ వుంటె పుణ్యంబు గలుగూ
గురుతుగను నీ వుంటె గుణవతివి యగుదు
అణకువతో నీ వుంటె ఐశ్వర్యమబ్బు .!"

జాగ్రత్తగా వెళ్ళవమ్మా మంచిదానివి కదూ ! అని

"మళ్ళీ పున్నానికి వచ్చి మా తల్లి తో డ్తెచ్చేను.
మనసున దిగులుపడకు మరేమి వ్యసనపడకు
శ్రీ లక్ష్మి శోకింపకు శివరామదాసుని మరవకు
వరమోక్షలక్ష్మి నీవు వెళ్ళిరావమ్మా !"

ఈ పాట వింటూంటే శాకుంతలం నాలుగో అంకం మన కళ్ళ యెదుటకు వచ్చి నిలుస్తుంది.

చివరగా శివ రామదాసుగారి లాలిపాట నొక దానిని ఉదహరించి వ్యాసం ముగిస్తాను.

లాలి పండరిరంగ లాలి శ్రీరంగా
లాలి భవభయ భంగ భక్తాంతరంగా ॥లాలి॥
పాల వారిధిలోన పవళించి నావూ
పరమ భక్తులనెల్ల పాలించినావు
లోక లోకములందు లీనమైనావూ
లోలాక్షినీ కూడి నిదురించవయ్యా ! ॥లాలి॥
శృంగార వదనతో సేవించి మిమ్మూ
సొంపుగను శ్రుతిగీతములు పాడగానూ
రంభోర్వశులు నాట్యములు చేయగానూ
తుంబురూ నారదులు వీణ మ్రోయగనూ ॥లాలి॥
నైమిశారణ్య నివాస సర్వేశా
నారాయణాంభజే హే పరమహంసా
కారణా గురువర్య కరుణావతంసా
ధారుణీ శివరామ దాసావతంసా ॥లాలి॥

ఇంకనూ కొన్ని పాట లీయనవి ఉన్నాయి. కొన్నిటిలో ఈయన పేరులేదు, కాబట్టి యీయనవగునా కాదా అన్న సందేహం ఉంది.

ఈతని రచలను సేకరించి ప్రచురించవలసిన పనికి సంగీత నాటక అకాడమీవారు, ప్రసారము చేయవలసిన కార్యానికి 'ఆకాశవాణి' వారు పూనుకోవచ్చు. అట్టి సకల జనోపయోగమైన కార్యానికి త్వరలో 'నాంది' పలుకుతారని ఆశిద్దాం.

★

పల్లె పడతి

ఇల్లిందల సరస్వతీ దేవి

మనకు నగరాలు తక్కువ, గ్రామాలు ఎక్కువ. నగరాలు ఎంత త్వరితగతిన అభివృద్ధి చెందుతున్నాయో గ్రామాలు అంత వేగంగా ముందుకు రాలేక పోతున్నాయి. అందుకే పల్లెపడతి చూపులన్నీ నగరంపైన ఉంటాయి. సిమెంటు రోడ్లు—వీధి వీధికీ దీపాలూ—రాజవీధుల్లో మెర్క్యురీ దీపాలూ, పది అంతస్తుల మేడలూ—సినిమాథియేటర్లూ, పెద్ద పెద్ద దుకాణాలూ—వీధికి నాలుగు హోటళ్లు—రకరకాల మోటార్లూ—జనసందోహాన్ని విధీవిరామం లేకుండా త్రిప్పే బస్సులు—దినుసుదినుసు సామాన్లూ, రంగురంగుల బట్టలూ తలుచుకుని గుటకలు మ్రింగుతుంది.

“గ్రామాలలో ఏముంది? ఊరంతా బురద, వీధులంతా చీకటి. చూద్దామన్నా రెండంతస్తుల మేడ కనబడదు. ఆ ఉన్న ఒక్క అంగడిలో కావలసిన సరుకు ఒక్కటీ ఉండదు. ఎప్పుడు చూసినా—ఎక్కడ చూసినా వ్యవసాయదారులూ, పాలేర్లూ కనబడతారు. ఎవరినోట విన్నా వ్యవసాయాన్ని గురించే తప్ప మరొకమాట లేదు. ఈ పల్లెసీమలో ఉండే సరదాలూ సంబరాలూ ఏం తీర్తాయి! గొడ్లకు మేతవేసి నీళ్లుపెట్టటమూ, రెండు పూటలూ వంటచేసి ఇంట్లో అందరికీ అన్నీ అమర్చటంతో విసుగుపుడుతుంది. ఈ గ్రామాన్ని వదలి హాయిగా పట్నంలో కాపురం పెడితే ప్రతిరోజూ ఏదో ఒక వినోదకార్యక్రమం చూడవచ్చు, సినిమాలకూ నాటకాలకూ వెళ్లవచ్చు” అనుకుంటూ నిట్టూరుస్తుంది.

నగరాలలో పట్టణాలలో అన్నివస్తువులూ వాకిట్లోకి అమ్మకానికి వస్తాయి. ఇంటిపనులు చెయ్యటానికి నౌకర్లు దొరుకుతారు. ఇల్లాలికి చేటపట్టనవసరం లేకుండా పని సులువైపోతుంది. డబ్బు ఖర్చుచేస్తే పట్టణాలలో ఏదికావాలంటే అది నిమిషాలమీద లభిస్తుంది. కొండమీది కోతయినా దిగివస్తుంది. ఈవిధంగా సాగిపోతూ ఉంటాయి గ్రామస్త్రీల ఊహలు.

పల్లెసీమలలో పురుషులు చేతిలో డబ్బు మెదిలినప్పుడల్లా ఏదో నెపంమీద పట్టణాలకూ నగరాలకు వెళ్లి హోటళ్లలో దిగి ఆనందిస్తూ ఉంటారు. ధనికులు పట్టణాలలో భవనాలు నిర్మించుకుని తరుచుగా రాకపోకలు సాగించటానికి వసతులు ఏర్పరచుకుంటారు. పిల్లలు చదువుల నిమిత్తం అక్కడ కాపరం పెడతారు. కాని పురుషుల మాదిరిగా తరుచుగా స్త్రీలు సంసారాలను వదలి పెట్టివెళ్లలేరు. అయితే మనసు మాత్రం నగరాలలో విహరిస్తూనే ఉంటుంది. కట్టులో-బొట్టులో వేషభాషల్లో నగరవాసినిని పల్లెపడతి అనుకరించటానికి ప్రయత్నిస్తూ ఉంటుంది.

పల్లెపడతికీ నగరవాసినికీ నాగరికతలో ఉన్న వ్యత్యాసం మొదటిచూపులోనే తెలిసిపోతుంది. నాగరికతాస్వరూపం పల్లెలలో ఒకవిధంగాను పట్టణాలలో ఒకవిధంగాను గోచరిస్తుంది. పల్లెలలో ఒక స్థాయిలోనూ పట్టణాలలో ఒక స్థాయిలోనూ పెరుగుతూ ఉంటుంది. మన దేశంలో సంస్కృతీబీజాలు, విజ్ఞులయిన ఋషి పుంగవుల ఆశ్రమాలలో పెరిగి పెద్దదయింది. ఆ పల్లెలలో ఆ ఛాయలు నెలవు చేసుకున్నాయి.

పల్లెపడతి నాగరికతలో, యుగయుగాలుగా తరతరాలుగా జాతిలో జీర్ణించిన ఆచార వ్యవహారాలు ఎన్నో అంతర్లీనమై ఉన్నాయి. ఆమె నిత్యజీవితంలో నిండైన హృదయం తళుక్ తళుక్ మంటూ మెరుస్తుందొకసారి. పాదరసంలా మిలమిల మెరుస్తూ పరుగులు తీస్తుందొకసారి. తేనెసోనలు కురిపిస్తుందొకసారి. అమృతాన్ని చిందిస్తుందొకసారి. ఆప్యాయతనూ, ఆపేక్షనూ ఒలికిస్తుందొకసారి.

పల్లెసీమలో ఏవేళ అతిథి అభ్యాగతులు వచ్చినా దాహం తీరే చల్లటి మంచి తీర్థమూ, ఆకలితీరే భోజనమూ మనసు సేదదేరే చల్లటి పలకరింపూ, హృదయం కరిగిపోయే ఆదరణా లభిస్తాయి. ఒక పర్యాయం వీటిని అనుభవించినవారు జన్మలో మరువలేరు.

పల్లీయులకు శరీరాలు వేరు, నివాసాలు వేరు. కాని ప్రాణం ఒక్కటే. ఏయింట శుభకార్యం నిశ్చయమయినా అక్కడికి స్త్రీలంతా చేరుకుని పనిపాటల్లో పాల్గొంటారు. బాలెంత స్నానానికి ఊరివారంతా బిందెడు నీళ్లూ, వేపాకూ పసుపు ముద్ద వంతున తెచ్చి ఇస్తారు. ఏయింట ఎవరికి జబ్బు చేసినా ఇరుగు పొరుగంతా వెళ్లి ఉపచారాలు చెయ్యటానికి సిద్ధపడతారు. ఒకరికి కష్టం వస్తే అందరికీ వచ్చినట్టుగానే భావిస్తారు. ఒకరి సుఖసంతోషాలు అందరూ పంచుకుంటారు. ఏయింటి పసిబిడ్డలూ, ఆడబిడ్డలూ కోడళ్లూ అల్లుళ్లూ అయినా అందరికీ సమానమే. వారిపట్ల ప్రేమాభిమానాలూ గౌరవమర్యాదలూ ఆపేక్ష అంతఃకరణలూ అందరికీ సమానం.

దయాదాక్షిణ్యాలకూ ఆదరణకూ, స్వచ్ఛమూ సరళమూ అయిన ఆపేక్షాంతఃకరణలకూ పల్లెసీమ పుట్టినిల్లు.

పల్లెలలో ఒకరినొకరు పేరుపెట్టి పిలుచుకోరు. వరుసలుపెట్టి పిలుచుకుంటారు. దానిలోని మాధుర్యము అనిర్వచనీయమైనది. అది ఎవరినైనా మనసును మార్చివేయగలిగిన అనుబంధాన్ని సృష్టించగలదు. పుట్టింటికి వచ్చిన ఆడబడుచు తాతయ్యా అంటూ వృద్ధులకు ఒంగి నమస్కరించి ఆశీస్సులు పొందుతుంది. పెద్దనాన్న, బాబాయి అంటూ పిల్లలు ... అన్నయ్యా అంటూ సోదర ప్రేమతో పలకరిస్తుంది. పిన్నీ, అత్తయ్యా, ఒదినా, బామ్మా అంటూ సమీపించి అత్తింటి సుఖాలను ముసి ముసి నవ్వుల దొంతర్లలో దొర్లిస్తుంది. మౌనంగా కళ్లు నాల్చి టూకీగా అత్తింటి కష్టాలు సూచిస్తుంది "అమ్మయ్య మళ్ళీ వచ్చి నావాళ్లల్లో పడ్డాను" అనుకుంటూ పూర్వపు ఉత్సాహాన్ని రెండు రోజులలో పుంజుకుంటుంది.

గ్రామాలలో స్త్రీలు నీ, పురుషులుగానీ ఒకరి నొకరు కలుసుకుని కష్టసుఖాలు చెప్పుకోకపోతే ఒక్కనాటికే అలమటించి పోతారు.

స్త్రీలలో సహనమూ, హృదయవైశాల్యమూ, దయాదాక్షిణ్యమూ, దీక్ష, పట్టుదలా అభివృద్ధికావటానికీ అవి లోకకళ్యాణము కొరకు వినియోగింపబడటానికీ నోములూ వ్రతాలూ ఆచరణలోకి వచ్చాయి. అవి ఏఋతువుకు తగినట్లు ఆఋతువుల్లో ఆచరింపగలిగినవి వ్యష్టిగాను సమష్టిగాను కూడా ఆచరించే వ్రతాలు. పసుపు కుంకుమలూ, పుష్పాలూ, ఫలాలూ చందన తాంబూలాలతో స్త్రీలు పరస్పరమూ గౌరవించుకుని తమ సౌఖ్యమే కాకుండా లోకకళ్యాణాన్ని కూడా కాంక్షిస్తారు. పెద్ద ముత్తైదువలకు నమస్కరించి ఆశీర్వచనాలు పొందుతారు. ఇటువంటి సదాచారాలతో పల్లెసీమ కళకళలాడుతూ ఉంటుంది.

పల్లీయుల నాగరికతకు అక్కడి సంపదలూ అక్కడి ప్రకృతీ, అక్కడి ఆచారాలూ అక్కడి వాతావరణము ప్రాణం పోస్తూ ఉంటాయి. వీటి ఛాయలు మాత్రమే నగరాలలో అక్కడక్కడ మనకు గోచరిస్తాయి వెలిసిపోయిన ముఖాలతో.

నగరాల కృత్రిమ నాగరికత

నగరవాసుల నాగరికత పల్లీయుల నాగరికతకు భిన్నంగా ఉంటుంది. అక్కడి ఆచారాలూ పద్ధతులూ మనుష్యుల స్వభావ పరిస్థితులమీద ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఎదటివాడిని పలకరించటానికి మర్యాదమార్గాలు అడ్డంవస్తాయి. ఇద్దరికి తెలిసిన మరొక వ్యక్తి పరిచయము చెయ్యాలి. పరిచయము కలుగకముందు ఎదటివారిని గురించి ఏమీ పట్టించుకోరు. పొరుగున ఉన్న ఇంట్లో ఏ ఆపద వచ్చినా వెళ్లి పలకరించటానికి కూడా తీరిక ఉండదు. ఎవరింట్లో ఏమయిపోతున్నా సరే తనపనిగతేమిటో తను చూసుకోవాలి. రేపును గురించి ఆలోచించుకోవాలి. అతిథి అభ్యాగతుల మాటలలా ఉంచి తనవాళ్ళెవరయినా ముందు చెప్పకుండా వస్తే భోజనసౌకర్యం కల్పించటం కష్టం. ఎవరయినా వస్తే కడుపునిండా భోజనం పెట్టి సుఖనిద్రకు అనువుగా పడక అమర్చలేరు. మనిషిని చూడగానే భోజనానికి ఉండిపోతాడేమో, పడుకోవటానికి వస్తాడేమో అన్న గుబులు కడుపులో గడబిడ చేస్తుంది. అందుకే వచ్చినవాళ్ళ ఆప్యాయంగా పలకరించ లేక పైపై పూతలు పూసి మాట్లాడుతారు మాటల్లో చేష్టలలో కృత్రిమం కొట్టవచ్చినట్టుంటుంది.

అవును, నగరవాసికి ఎలావస్తుంది ఆ ఆప్యాయత! చేతినిండా డబ్బులేదు. పైగా మనుష్యులు వస్తే అతిథిమర్యాదలు చేసి షడ్రసోపేతమయిన భోజనము అమర్చటానికి ఆహార పదార్థాలు పుష్కలంగా లేవు. వాళ్లను కూర్చోపెట్టటానికయినా తగినంత గృహవసతి లేదు. ఇరుగుపొరుగులను గురించీ వాళ్ల కష్టసుఖాలను గురించీ విచారించటానికి విరిగి తీరిక లేదు. వాళ్లను గురించి ఆలోచించే వ్యవధిలేదు మనసులోని దయాదాక్షిణ్యాలను ఆపేక్ష అనురాగాలను బైటికి చూపించటానికి పరిస్థితులు అనుకూలించవు. అనుకనే నగరవాసుల జీవన విధానము ఎవరికి వారే అన్నట్లుగా ఉంటుంది.


వీటన్నిటిని బాగా ఆలోచించి చూస్తే పల్లెపడతి నగరాలను స్వర్గసీమలుగా భావించుకోదు. నగరజీవితాన్ని గురించి పగటికలయు కనదు.

ఆంధ్రరాష్ట్రావతరణానంతరము వెలిసిన పంచాయతీ రాజ్యంలో పల్లెసీమలు వెనుకటి పల్లెలుగా ఉన్నయా? అప్పిచ్చేవాడూ వైద్యుడూ ఎప్పుడూ పారే ఏరూ లేనికుగ్రామాలు సహకార సంస్థలతో బావులతో విద్యుద్దీపాలతో విద్యాలయాలతో ఆరోగ్యకేంద్రాలతో స్త్రీశిశుసంక్షేమ సంఘాలతో ఆదర్శవంతమయిన గ్రామాలుగా ఒక్కొక్కటే మారిపోతున్నాయి. ప్రజలకు కావలసిన విద్యాలయాలూ, వైద్యాలయాలూ, దేవాలయాలూ, గ్రంథాలయాలూ నెలకొల్పబడుతున్నాయి. గ్రామాభ్యుదయానికి కావలసిన పథకాలూ ప్రణాళికలూ రచింపబడి అమలు జరుగుతున్నాయి. మహిళామండలుల ద్వారా స్త్రీజనాభ్యుదయకరమైన కార్యక్రమాలు సాగుతున్నాయి స్త్రీలకుఇంటాబయటా సౌకర్యాలు కల్పించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి యువతీ యువకులలో నగరవాసులను మించాలన్న ఉత్సాహంపురివిప్పుకుంటున్నది. గ్రామాలలో స్వచ్ఛమయిన స్నేహమూ ఆప్యాయతా దయాదాక్షిణ్యాలతోపాటు కక్షలూ కార్పణ్యాలూకూడా ఉంటాయి. మనసులోని పగ తాచుపాములా బుస్సుబుస్సు మంటూ పైకి లేస్తూ ఉంటుంది. న్యాయంకోసం ఎక్కడోఉన్న కోర్టుకు పోవటమెందుకని తప్పు చేసిన వాళ్లను తామే శిక్షించటానికి బలవంతులు ప్రయత్నిస్తూ ఉంటారు. నిరపరాధులను అనవసరంగా శిక్షించటానికి అధికారాన్ని ఉపయోగిస్తారు. వీటితో కక్షలు కార్పణ్యాలు ఏర్పడి శతృత్వము ప్రబలుతూఉంటుంది. యువతరంవారు గ్రామాభ్యుదయాన్ని దృష్టియందుంచుకుని కృషిచెయ్యటానికి శక్తికొద్దీ ప్రయత్నించి కృతకృత్యులయితే ఆదర్శ గ్రామాలు విరివిరిగా నిర్మింపబడతాయి కక్షలూ కార్పణ్యాలూ అంతరిస్తాయి.

ఈ పరిస్థితులలో పల్లెపడతికి బాధ్యతలు అధికమవుతాయి. తమస్థితులను మెరుగుపరచుకోవటానికి స్త్రీలు తమంతట తాము ప్రణాళికలు వేసుకుని కృషిచేయవలసి ఉంటుంది. తమసంసారాలతో పాటు గ్రామాభ్యుదయాన్ని కూడా కాంక్షించి కృషిచేయాలి. పలుకులో, పలకరింపులో పల్లెపడతి ఆప్యాయతను కోల్పోకూడదు. మాటలోని మాధుర్యాన్ని జారవిడుచుకోకూడదు అవ్యక్తంగా అర్థంలేకుండా నగరవాసినిని అనుకరించటానికి ప్రయత్నించకూడదు. గృహిణిగా, మాతగా, గ్రామాభ్యుదయ కాంక్షిణిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ, గౌరవాన్ని యాచించకుండా సంపాదించుకోవాలి పదిమందిలో. ★

సంక్షిప్త జీవిత చరిత్రలు :

మన మంత్రులు



శ్రీ పి. వి. నరసింహారావు

ముఖ్య మంత్రి

సాధారణ పరిపాలనశాఖ, సర్వీసులు, శాంతిభద్రతలు, లెజిస్లేచర్ వ్యవహారాలు, కాలేజీ విద్య, రెసిడెన్షియల్ స్కూల్స్, ఆధునిక భారతీయ భాషల అభివృద్ధి, అధికార భాష, వాణిజ్య పన్నులు, భూమిశిస్తు, నిర్వాసితుల ఆస్తులు, రిజిస్ట్రేషన్, స్టాంపులు, అతియత్, జాగీర్ పరిపాలన, ఋణ పరిష్కార సంఘం, సమాచార పౌరసంబంధాలశాఖ.

శ్రీ పి. వి. నరసింహారావుగారు కరీంనగర్ జిల్లాలో 1921 జూన్ 28వ జన్మించారు. నాగపూరు విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి బి. ఎస్. సి., ఎల్. ఎల్. బి., పట్టాలు పొందారు. హిందీలో వీరు సాహిత్య రత్న పాసయ్యారు. వెనకటి హైదరాబాదు రాష్ట్రంలో వీరు వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి ప్రధాన కార్యదర్శి అయ్యారు. మొదటి సాధారణ ఎన్నికల తర్వాత పూర్వ హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ డా. బూర్గుల రామకృష్ణారావుగారి వద్ద వీరు జూనియరు లాయరుగా ప్రాక్టీసు చేశారు.

1956లో వీరు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి ఉపాధ్యక్షులయ్యారు. అఖిల భారత ఖాదీబోర్డు, ఉస్మానియా విశ్వవిద్యాలయం సిండికేటు, హైదరాబాదు ఖాదీబోర్డులలో కూడా వీరు పదవులను నిర్వహించారు.

1957, 1962, 1967 సాధారణ ఎన్నికల్లో వీరు కరీంనగర్ జిల్లా మంథెన నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. 1962 లో సంజీవరెడ్డి గారు ముఖ్యమంత్రిగాగల మంత్రి వర్గంలో మొదటి సారిగా వీరు మంత్రి పదవిని అలంకరించి న్యాయ, సమాచార శాఖలను చేపట్టారు. 1964 లో బ్రహ్మానందరెడ్డిగారి నాయకత్వంలో మంత్రి మండలి ఏర్పడినప్పుడు న్యాయ, దేవాదాయ శాఖల మంత్రిగా వ్యవహరించారు.

1967 ఎన్నికల తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో ఒక ఏడాదిపాటు ఆరోగ్య, వైద్యశాఖల మంత్రిగా వున్నారు. ఆ తరువాత విద్యాశాఖను చేపట్టారు. శ్రీ నరసింహారావుగారు మంచి వక్త, చక్కటి భాషావేత్త, పేరుపొందిన రచయితకూడా. స్పానిష్ భాష అధ్యయనం చేశారు. శాసనసభలో ఎంతటి క్లిష్టమైన శాసనాన్నయినా ఎంతో సమర్థతతోనూ, స్థిరచిత్తంతోనూ అతి సునాయాసంగా ప్రవేశపెట్టగల దక్షులు.

ఇటీవలి సాధారణ ఎన్నికల్లో శ్రీ నరసింహారావుగారు మంథెని నియోజక వర్గనుంచి 32 వేల వోట్లకు పైగా మెజారిటీతో ఎన్నికయ్యారు.

ఒక భాషనుంచి మరో భాషలోకి చాలా చక్కగా, ప్రతిభావంతంగా, సునాయాసంగా అనువాదం చేయగల దిట్ట ఆయన. తెలుగులో కవితలల్లుతారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన వేయిపడగలు నవలను 'సహస్రఫణ్' పేరున నరసింహారావుగారు హిందీలోకి అనువదించారు. ఈ అనువాదానికి హిందీయేతర రచయితలు చేసిన హిందీ అనువాదానికి కేంద్ర ప్రభుత్వం యిచ్చే ఉత్తమ బహుమతి లభించింది. శ్రీ హరినారాయణ ఆప్టే రచించిన పాన్‌లక్షత్ కోన్‌ఘాటో అనే మరాటీ నవలను కూడా వీరు అబల అనే పేరుతో తెనుగులోనికి అనువదించారు.

శ్రీ నరసింహారావుగారు ప్రసిద్ధ విద్యావేత్త. సాంస్కృతిక కార్యక్రమాలలోకూడా వీరు ప్రముఖపాత్ర వహిస్తుంటారు. సంస్కృత భాషమీద వీరికి అమితమైన గౌరవం. కొంతకాలం సంస్కృతం అభ్యసించారు కూడా. భారతీయ విద్యాభవన్‌వారి ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి 1965లో స్థాపించబడి నప్పటినుంచి వీరు ఉపాధ్యక్షులు. రాష్ట్రంలో అధికార భాషగా తెలుగును ప్రవేశపెట్టటానికి వీరు ఆధ్వర్యం వహించారు. అనేక చట్టాలను అంగీకరింపజేయడంలో వీరు ప్రముఖపాత్ర వహించారు.

మృదుభాషి, నిఖార్సయిన పెద్దమనిషి, సంస్కారవంతుడు అయిన శ్రీ నరసింహారావు గారు వర్తమాన సమస్యలను ఎంతో విజ్ఞతతో కూడిన దృక్పథంతో పరిశీలించి తన ప్రత్యర్థులను చిత్తు చేయగల దిట్ట.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డిగారు రాజీనామా చేయడంవల్ల శ్రీ పి.వి. నరసింహారావు గారు శాసన సభా కాంగ్రెసుపార్టీకి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. 1971 సెప్టెంబరు 30 న ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు.

తిరిగి వీరు 1972 మార్చి 17 న శాసన సభా కాంగ్రెసు పార్టీ నాయకులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడారు.

శ్రీ బి. వి. సుబ్బారెడ్డి

ఉప ముఖ్యమంత్రి

శ్రీ బొల్లవరపు వెంకటసుబ్బారెడ్డి గారు 1903 జులై 1వ తేదీన కర్నూలు జిల్లా, కోయిలకుంట్లలో జన్మించారు. మచిలీపట్నంలోని నోబుల్ కాలేజి నుంచి 1926 లో పట్టభద్రులైన అనంతరం మద్రాసు విశ్వవిద్యాలయంలో న్యాయ



ప్లానింగ్, అర్థగణాంకశాఖ, భవనాలు, రోడ్లు, రహదారులు, పబ్లిక్ గార్డెన్స్, పి. డబ్ల్యు. డి. వర్క్‌షాపులు, రైల్వేలు, టెలిగ్రాఫ్ విషయాలు.

శాస్త్రం అభ్యసించి 1931 లో న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్నారు. నంద్యాలలో ప్రాక్టీసు ప్రారంభించి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.


1938 లో కర్నూలుజిల్లా బోర్డు అధ్యక్ష పదవికి కాంగ్రెసు అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనేక సంవత్సరాలపాటు జిల్లాబోర్డు అధ్యక్షులుగా వుండి పరిపాలనా విషయాల్లో ఎంతో అనుభవాన్ని సంపాదించుకున్నారు. గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహం పిలుపు అందుకుని శ్రీ సుబ్బారెడ్డిగారు 1941 లో జైలుకి వెళ్ళారు. ఆరు నెలలు కఠిన జైలుశిక్ష అనుభవించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ సందర్భములో మరోసారి అరెస్టు అయి 1945 వరకు వెల్లూరు, తంజావూరు జైళ్లలో వున్నారు. 1932 నుంచి శ్రీ సుబ్బారెడ్డిగారు కాంగ్రెసువాదిగా వుంటూ 1955 లోకాంగ్రెసు పార్టీకి రాజీనామా యిచ్చి 1955 లోనే ఆంధ్రరాష్ట్ర శాసన సభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. తిరిగి కాంగ్రెసులో చేరవలసిందిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని ఆహ్వానం మేరకు వీరు 1960 లో తిరిగి చేరారు. 1962 లో కోయిలకుంట్లనుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967 లో రాష్ట్ర అసెంబ్లీకి తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర శాసనసభ స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

భారతీయ పార్లమెంటరీ బృందం సభ్యులుగా 1965 లో శ్రీ సుబ్బారెడ్డిగారు సోవియట్‌రష్యాను సందర్శించారు. 1968 లో నాసా బహామాస్‌దీవిలో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశానికి హాజరయ్యారు. 1970 ఏప్రెల్‌లో లండన్‌లో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సుకు హాజరయ్యారు. జపాన్‌తో సహా అనేక దేశాలను సందర్శించారు.

శాసనసభకు ఒక దశాబ్దంపాటుగా స్పీకర్‌గా పనిచేసి పార్లమెంటరీ సత్సంప్రదాయాలను ఎన్నిటినో ప్రతిష్ఠించి శాసనసభ

చర్చలను ఎంతో హుందాగా నిష్పక్షపాతంగా నిర్వర్తించారు. శాసనసభ స్పీకరుగా వున్నప్పుడు ప్రభుత్వ విధానాలను వివిధశాఖల పనులను చాలా సన్నిహితంగా పరిశీలించే అవకాశం వీరికి కలిగింది. శాసనసభలోని అన్నివర్గాలవారి గౌరవాన్ని వీరు చూరగొన్నారు. 1971 సెప్టెంబరులో ఏర్పడిన శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా చేరారు. సాధారణ ఎన్నికల తర్వాతకూడా వీరు ఉపముఖ్యమంత్రిగా నియమితులైనారు.

శ్రీ కాకాని వెంకటరత్నం



వ్యవసాయం, ఆహారోత్పత్తి, పశుపోషణ, సమీకృత పాలప్రాజెక్టు, పాడి క్షేత్రాల అభివృద్ధి.

శ్రీ కాకాని వెంకటరత్నం గారు కృష్ణా జిల్లా, గన్నవరం తాలూకా, ఆకునూరులో 1900వ సంవత్సరం ఆగస్టు 3వ తేదీన జన్మించారు. 1924లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సమావేశానికి హాజరవడంతో వీరి రాజకీయ జీవితానికి అంకురార్పణ జరిగింది. 1930లో ఉప్పు సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నప్పుడు రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. 1937–40 మధ్యకాలంలో వీరు పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీకి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. మునగాల, లింగగిరి పరగణాలలో జమీందారీ రైతుల ఆందోళనలో ప్రముఖ పాత్ర వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను వీరు మూడేండ్లు డిటెన్షన్‌లో వున్నారు.


ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ 1946లో వీరిని పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీ ప్రత్యేకాధికారిగా నియమించింది. తర్వాత పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులయ్యారు. 1953–58 కాలంలో కూడా శ్రీ వెంకటరత్నంగారు జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరించారు.

1949లో కృష్ణా జిల్లా బోర్డుకు అధ్యక్షులయ్యారు. వీరు ఆ పదవిలో వున్నప్పుడు జిల్లాలో అనేక విద్యాసంస్థల్ని నెలకొల్పడానికి కారకులయ్యారు. 1953లో ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1955, 1962లలో వీరు ఉయ్యూరు అసెంబ్లీ నియోజక వర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1962–66లో చెరకు ఫలహా మండలి ప్రధాన కార్యదర్శిగా వున్నారు. విజయవాడలోని సహకార కేంద్ర బ్యాంకుకు 1965-66లో డైరెక్టరుగా కూడా వ్యవహరించారు.

1966 సెప్టెంబరులో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి సంబంధించిన ఎన్నికల సంఘం సభ్యులయ్యారు. 1967 ఏప్రిల్ 2వ తేదీన ఏ.పి.సి.సి. అధ్యక్షులయ్యారు. 1968 మేలో గన్నవరం నియోజక వర్గానికి జరిగిన ఉప ఎన్నికలో శాసనసభకు వీరు ఎన్నికయ్యారు. గడచిన మంత్రి వర్గంలో వీరు వ్యవసాయ శాఖ మంత్రిగా వున్నారు. 1972 సాధారణ ఎన్నికలలో శ్రీ కాకాని ఉయ్యూరు నియోజకవర్గంనుంచి శాసనసభకు ఎన్నికయ్యారు.

శ్రీ టి. హయగ్రీవాచారి

శ్రీ టి. హయగ్రీవాచారిగారు 1917 నవంబరు 25వ వరంగల్ జిల్లా, ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. విద్యార్థి దశనుంచే వీరు స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర వహించారు. వరంగల్ కళాశాల విద్యార్థిసంఘానికి ప్రెసిడెంటుగా పనిచేశారు. 1938లో వీరు రాజకీయాలలో ప్రవేశించారు. వరంగల్‌నుంచి వీరు మొట్టమొదటి సత్యాగ్రహి.



పంచాయతీరాజ్.

1952 లో వీరు వరంగల్ పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1950 నుంచి తొమ్మిదేళ్లపాటు జిల్లాబోర్డుకు ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. గ్రంథాలయోద్యమంతో కూడా వీరికి సన్నిహిత సంబంధం వుంది. వరంగల్ జిల్లాలో అనేక గ్రంథాలయాలను నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా తెలంగాణా ప్రాంత కాంగ్రెసు కమిటీకి వీరు కార్యదర్శిగా, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి, అఖిలభారత కాంగ్రెసు కమిటీకి ప్రతినిధిగా వ్యవహరించారు.

1969 లో వీరు తెలంగాణా ప్రజాసమితికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

మొట్ట మొదటిసారిగా వీరు 1957 లో ధర్మసాగర్ నియోజక వర్గంనుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. తిరిగి 1962 సాధారణ ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. తెలంగాణా ప్రాంతీయ సంఘానికి అధ్యక్షులయ్యారు.

ఇటీవలి ఎన్నికల్లో ఘనపూర్ నియోజకవర్గం నుంచి శాసనసభకు మళ్లీ ఎన్నుకోబడ్డారు.

శ్రీ మహమ్మద్ ఇబ్రహీం అలీ అన్సారీ



వైద్య,ఆరోగ్యశాఖ, వక్ఫులు, సాలార్ జంగ్ మ్యూజియం.

శ్రీ మహమ్మద్ ఇబ్రహీం అలీ అన్సారీ గారు 1917 జూన్ 10 వ తేదీన మహబూబునగర్‌లో జన్మించారు. మొదట్లో హైదరాబాదు లోని సెంట్ జార్జ్ గ్రామరు స్కూల్లో, ఆ తర్వాత అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో విద్య నభ్యసించారు. బొంబాయి టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎ.ఎమ్.ఐ.టి లో డిప్లమా పొందిన అనంతరం 1939లో నిజాం ప్రభుత్వంలో అటవీ శాఖలో ఉద్యోగంలో చేరారు. 1946లో వీరు ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

ఆ తరువాత రెండేళ్లకు కాంగ్రెసు సంస్థలో చేరి మహబూబు నగర్ జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. 1951లో పురపాలక సంఘానికి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆరేళ్ల తర్వాత మహబూబునగర్ పట్టణ పురపాలక సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1955లో మహబూబునగర్ సహకార కేంద్ర బ్యాంకు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1960లో మహబూబునగర్ స్థానిక స్వపరిపాలనా సంస్థల నియోజక వర్గం నుంచి ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అయిదేళ్ల పాటు సెనేటు సభ్యులుగా ఎన్నుకొన బడ్డారు. రెండేళ్ల తర్వాత జిల్లా ముస్లిం వక్ఫుబోర్డు అధ్యక్షులుగా నామినేటు చేయబడ్డారు. 1965లో మహబూబునగర్ మార్కెటు కమిటీకి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1967, 1972 సాధారణ ఎన్నికల్లో వీరు మహబూబునగర్ నియోజక వర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గంలోనూ, శ్రీ పి.వి. నరసింహారావు మంత్రి వర్గంలోనూ, వీరు ఆరోగ్య, వైద్య శాఖల మంత్రిగా పనిచేశారు.

శ్రీ జె. వెంగళరావు

శ్రీ జలగం వెంగళ రావుగారు 1921లో జన్మించారు. విద్యార్థి దశలో, జాతీయ నాయకుల పిలుపు నందుకొని జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మాజీ హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీ, రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమం ఆరంభించినపుడు వారు యీ ఉద్యమంలో ముందు నిలిచారు.



పరిశ్రమలు.

హైదరాబాదు రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో లీనమైన తర్వాత వీరు 1948లో మధిర తాలూకా కాంగ్రెసు అధ్యక్షు లయ్యారు. తర్వాత ఖమ్మం జిల్లా కాంగ్రెసు అధ్యక్షులయ్యారు. తర్వాత ఖమ్మం జిల్లా పరిషత్తు ప్రథమ అధ్యక్షులుగా పని చేశారు.

ఆయన అధ్యక్షతలో ఖమ్మం జిల్లా పరిషత్తు బాగా అభివృద్ధి చెందింది. ఆయన ఖమ్మం జిల్లా వెంసూరు నియోజక వర్గం నుండి లోగడ శాసన సభకు ఎన్నికైనారు. 1972లో కూడా అదే నియోజక వర్గం నుండి ఎన్నికైనారు.

రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వెంగళ రావుగారిని 1962 డిసెంబరులో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చేంబరు ఆఫ్ పంచాయతీ రాజ్ అధ్యక్షులుగా నామినేట్ చేసింది. వారు 1968 ఫిబ్రవరి వరకు ఆ పదవిని నిర్వహించారు. 1969 జూలైలో ఆయన హోంశాఖ మంత్రిగా చేశారు.

నక్సలైట్ల దౌర్జన్యకాండను ధైర్యంతో చాక చక్యంతో అణచి వేశారు. ఆ ఆందోళన కాలంలో అతినేర్పుతో శాంతి భద్రతలను కాపాడారు.

శ్రీ అనగాని భగవంతరావు



ఆర్థిక, పునరావాస శాఖలు.

శ్రీ అనగాని భగవంతరావు గారు 1923 జూలై 1వ తేదీన గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకాలోని అనగాని వారి పాలెంలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. గుంటూరు లోని ఏ.సి. కాలేజీలోనూ, నాగపూర్ విశ్వ విద్యాలయ కళాశాలలోనూ ఉన్నత విద్యాభ్యాసం చేశారు. నాగపూర్ విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఎల్.ఎల్.బి., పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత 1951లో రేపల్లెలో న్యాయవాదవృత్తి ప్రారంభించారు. 1954లో ప్రజాహిత జీవితంలో ప్రవేశించారు. 1955–62 సంవత్సరాల మధ్య శాసన సభ్యులుగా వున్నారు.


శ్రీ భగవంతరావు గారు 1957 డిసెంబరు మొదలు 1960 జనవరి వరకు పరిశ్రమలు, ధర్మాదాయ శాఖల మంత్రిగా పని చేశారు. 1967, 1972 సాధారణ ఎన్నికలలో కూచిన పూడి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనారు. 1956–57లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంఘం అధ్యక్షులుగా వున్నారు.

1964 జూన్ నుండి 1966 నవంబరు వరకు ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి అధ్యక్షులుగా పని చేశారు. శ్రీ బ్రహ్మానంద రెడ్డి మంత్రి వర్గంలో చేనేత పరిశ్రమ, సహకార పంచదార ఫ్యాక్టరీ శాఖల మంత్రిగా పని చేశారు. ఎన్నికలకు ముందు శ్రీ పి. వి. నరసింహారావు మంత్రి వర్గంలో వీరు ఆర్థికశాఖ నిర్వహించారు.

శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు

శ్రీ వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు గారు శ్రీకాకుళం జిల్లా, బొబ్బిలి తాలూకాలోని పినపర్తి గ్రామంలో 1922 ఆగస్టు 16వ తేదీన జన్మించారు. మద్రాసు లోని గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎల్. సి. ఇ. కోర్సు అభ్యసించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. తరువాత ఒక సంవత్సరంపాటు చదువు మాని వేశారు. పిమ్మట 1964లో ఎల్.సి. ఇ. కోర్సు పూర్తి చేశారు.


హోం, పోలీసు, ఆయుధాల చట్టం, ప్యాస్ పోర్టులు, సినిమటోగ్రఫీ, ఎన్నికలు, జైళ్లు.



శ్రీ కృష్ణమూర్తి నాయుడు గారు అయిదు సంవత్సరాలకు పైగా జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యులుగా వున్నారు. 1956లో వీరు సోషలిస్టు పార్టీలో చేరి మూడేళ్ల తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేశారు. సోషలిస్టు పార్టీ టిక్కెట్టుమీద బొబ్బిలి నియోజక వర్గం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 1962 సాధారణ ఎన్నికలలో బొబ్బిలి తాలూకా బలిజ పేట శాసన సభా నియోజక వర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1968లో శాసన మండలి సభ్యులైనారు.

శ్రీ నాయుడు గారు 1962లో శ్రీకాకుళం జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులుగా పని చేశారు. మరుసటి సంవత్సరం అధ్యక్షులైనారు. 1964లో ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యత్వం పొందారు. మూడు సంవత్సరాల తర్వాత ఎ. ఐ. సి. సి. సభ్యులుగా ఎన్నికైనారు. 1968 నుండి ఎ. పి. సి. సి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1967లో రాష్ట్ర హౌసింగ్ బోర్డు సభ్యులయ్యారు. 1969లో శ్రీ బ్రహ్మానంద రెడ్డి మంత్రి వర్గంలో ఎక్సైజు, విద్యుచ్ఛక్తి శాఖల మంత్రిగా పని చేశారు. కొంత కాలంపాటు ఆంధ్ర ప్రదేశ్ చెరకు ఉత్పత్తిదార్ల సంఘం ఉపాధ్యక్షులుగా పని చేశారు. 1971 సెప్టెంబరులో శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో విద్యుచ్ఛక్తి శాఖా మంత్రిగా పనిచేశారు.

శ్రీ ఎం. మాణిక్ రావు



మున్సిపల్ పరిపాలన, టౌన్ ప్లానింగ్, వాణిజ్యం, ఎగుమతుల ప్రోత్సాహం, సిటీ వాటర్ వర్క్సు, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, రేవులు.

శ్రీ ఎం. మాణిక్‌రావుగారు 1931 సెప్టెంబరు 5వ తేదీన గుల్బర్గా జిల్లా, మాల్ఖేడ్ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. వీరు మొదటి నుండీ యువజనుల కార్యక్రమాలలో ఉత్సాహంతో పాల్గొన్నారు. గ్రామ స్థాయిలోను, తాలూకా స్థాయిలోను యువక సమితులను ఏర్పాటుచేశారు. హైదరాబాదులోని వివేకవర్ధనీ ఉన్నత పాఠశాలలో విద్య నభ్యసించారు. విద్యార్థి నాయకులుగా పనిచేశారు. 1946–47 సంవత్సరంలో పాఠశాలల బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని, చదువుకు స్వస్తి చెప్పి రెండుసార్లు అరెస్టు అయ్యారు.

శ్రీ మాణిక్‌రావుగారు 1959లో తాండూరు పంచాయతీ సమితికి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. 1962లో హైదరాబాదు జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులైనారు. 1959లో హైదరాబాదు జిల్లా స్థానిక సంస్థల నియోజక వర్గం నుండి శాసన మండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. తాండూరు శాసన సభ నియోజక వర్గం నుండి జరిగిన ఉప ఎన్నికలో శాసన సభకు ఎన్నికైనారు.

శ్రీ మాణిక్‌రావుగారు రాష్ట్ర గనుల కార్పొరేషన్ డైరెక్టరుగా కూడా వ్యవహరించారు. చేతి పరిశ్రమల మండలి, మార్కెటింగ్ సంఘం, సహకార సంఘాలు, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే వివిధ వ్యవస్థలతో వీరికి సన్నిహిత సంబంధం ఉంది. అనేక సాంస్కృతిక, క్రీడా సంస్థలతో కూడా సంబంధం ఉంది. వీరు కెనడా, అమెరికా, జపాను, యూరప్ దేశాల్లో పర్యటించారు.

ఎన్నికలకు ముందు 1971 సెప్టెంబరులో శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో మునిసిపల్ పరిపాలన శాఖ మంత్రిగా చేరారు.


1972 ఎన్నికల్లో తాండూరు నియోజక వర్గంనుంచి ఏకగ్రీవంగా శాసన సభకు ఎన్నికయ్యారు.

శ్రీ బత్తిన సుబ్బారావు

శ్రీ బత్తిన సుబ్బా రావు గారు తూర్పు గోదావరి జిల్లా, కడియం నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికయిన హరిజన శాసన సభ్యులు. వీరు హరిజనుల సంక్షేమానికి, ఇతర బలహీన వర్గాల అభ్యుదయానికి నిరాడంబరంగా చాలా కృషి చేశారు.

విద్యార్థి దశనుంచే వీరు సాంఘిక కార్యక్రమాల్లో ఆసక్తితో పాల్గొంటుండేవారు. షెడ్యూల్డు కులాల వారి ప్రగతికి గత రెండు దశాబ్దాలుగా వీరు ఎనలేని సేవ చేస్తున్నారు.

సంఘంలోని బలహీన వర్గాల వారి స్థితి గతులను, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి సహకారోద్యమాన్ని శ్రీ సుబ్బారావు గారు శక్తి వంతమైన సాధనంగా తీసుకున్నారు. రాజమండ్రి



సహకారం.

కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగా వున్నప్పుడు హరిజనులకు ఉపాధి సౌకర్యాల్ని కల్పించే వ్యవసాయ కూలీల సహకార సంఘాలు అనేకం ప్రారంభించారు.

హరిజనులకు, వెనుకబడిన కులాల వారికి ఇళ్ల స్థలాన్ని, బంజర్లను పంపిణీ చేసే కార్యక్రమంలో వీరు ప్రముఖ పాత్ర వహించారు.

రాష్ట్ర శాసన సభకు వీరు మొట్టమొదటి సారిగా 1955లో బూరుగు పూడి ద్విసభ్య నియోజక వర్గం నుంచి ఎన్నికయ్యారు. 1962లో కూడా తిరిగి వీరు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. 1967, 1972 ఎన్నికల్లో కడియం రిజర్వుడు సీటు నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు.

శ్రీ సుబ్బారావుగారు ప్రభుత్వం నియమించిన భూమి విలువ ఆదాయానికి సంబంధించిన సంఘంలోనూ, రైతులకు సంబంధించిన సంఘంలోనూ సభ్యులు.

ఎన్నికలకు ముందు శ్రీ పి. వి. నరసింహారావు గారి మంత్రి వర్గంలో సహకారశాఖ మంత్రిగా వున్నారు.

శ్రీ సి హెచ్. ఎస్. ఆర్. వి. పి. మూర్తిరాజు

శ్రీ చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజుగారు పశ్చిమగోదావరి జిల్లాలోని చిన నిండ్రకొలను గ్రామంలో 1919 డిసెంబరు 16న జన్మించారు. తణుకులో విద్యాభ్యాసం కావించారు. మూర్తిరాజుగారు కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్యపోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. జిల్లాబోర్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వీరు మొదటిసారిగా 1952 లో తాడేపల్లి నియోజకవర్గంనుంచి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. 1952 నుంచి కూడా వీరు శాసనసభ్యులుగా వుంటున్నారు. 1967 లో ఉంగుటూరు నియోజక వర్గంనుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. ఇటీవలి సాధారణ ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీలేకుండా ఎన్నికయారు.


శ్రీమూర్తిరాజుగారు కార్యశీలి అనడానికి ఆ ప్రాంతంలో అనేక విద్యా సంస్థలు ఆయన నెలకొల్పడమే తార్కాణం. ఆ విధంగా ఆయన నెలకొల్పిన విద్యాసంస్థలు అరవై వరకు వున్నాయి.

శ్రీ చింతలపాటి బాపిరాజు ధర్మసంస్థను స్థాపించి దానికి అధ్యక్షులై బీదప్రజల స్థితిగతులను మెరుగుపరచేందుకు అనేక కార్యక్రమాలను ఆ సంస్థద్వారా చేపట్టారు.

గాంధీ శతజయంతి సంవత్సరంలో మూర్తిరాజుగారు గాంధేయ వాదిగా మహాత్మాగాంధీ బోధనలను ప్రచారంచేస్తూ 50 రోజుల పాటు 600 మైళ్ళ దూరం పాదయాత్ర చేశారు. సర్వోదయ ఉద్యమంతో వీరికి సన్నిహిత సంబంధం వున్నది.

భీమవరంలోని రామకృష్ణ ప్రకృతి ఆశ్రమం నెలకొల్పబడినప్పటి నుంచి వీరు అధ్యక్షులుగా వుంటున్నారు. మూర్తిరాజుగారి కృషి వల్లనే అఖిలభారత ప్రకృతి చికిత్సా కళాశాల భీమవరంలో నెలకొల్ప బడింది. ఇక్కడ ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన విద్యార్థులే కాక దేశంలోని అన్ని ప్రాంతాలవారు విద్య నభ్యసిస్తున్నారు.

గణపవరం పంచాయతీ సమితికి వీరు మొట్టమొదటి అధ్యక్షులు. 1968 నుంచి వీరు భారత్ సేవక్ సమాజ్ రాష్ట్ర విభాగానికి అధ్యక్షులుగా వుంటున్నారు.



దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు, ఇండియన్ మెడిసిన్.

సంయుక్త సహకార వ్యవసాయ సంఘాలను వీరు మొట్టమొదటగా నెలకొల్పారు. బీద రైతులకు సహాయకారిగా వుండేందుకై కొల్లేరు భూముల్లో వీరు సహకార వ్యవసాయ పద్ధతిని

ప్రవేశ పెట్టారు. కొంతకాలంపాటు నారాయణపురం సహకార మార్కెటింగ్ సంఘానికి అధ్యక్షులుగా వున్నారు. గ్రంథాలయోద్యమంలో వీరు అమితమైన ఆసక్తిని చూపించారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘానికి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సాహిత్య అకాడమీలో కూడా వీరు సభ్యులు. వీరు కొన్ని గ్రంథాలు కూడా రాశారు. నాటిలో కొల్లేరు, వినోభాభావే ఉన్యాసాలు అన్న గ్రంథాలు ప్రత్యేకించి పేర్కొన దగ్గవి.

హరిజనులకు, బడుగువర్గాల ప్రజానీకానికి శ్రీమూర్తిరాజుగారు చేసిన సేవ అమోఘమైనది. ఎన్నికల ముందు శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో మార్కెటింగ్ శాఖా మంత్రిగా పనిచేశారు.

శ్రీ పి. బసిరెడ్డి



మధ్య తరహా నీటి పారుదల, వరదల నివారణ, డ్రైనేజి, న్యాయశాఖ, కోర్టులు.

శ్రీ పెంచికల బసిరెడ్డిగారు కడపజిల్లాలో సుప్రసిద్ధులైన క్రిమినల్ న్యాయవాది. వీరు కడపజిల్లా పులివెందల తాలూకాలోని కొత్తపల్లి గ్రామంలో 1907 జనవరి 1వ తేదీన జన్మించారు. వీరు ఉత్తమండలాల కాలేజీనుంచి పట్టభద్రులై మద్రాసు విశ్వవిద్యాలయంనుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రులైనారు. శ్రీ బసిరెడ్డిగారు 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1946 నుంచి మూడుసార్లు జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా ఎన్నికైనారు. ప్రొవిజనల్ పార్లమెంటు సభ్యులుగా పనిచేశారు. 1957 లో పులివెందల నియోజకవర్గంనుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. 1972 ఎన్నికల్లో కూడా వీరు అదే నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికైనారు.

శ్రీ బసిరెడ్డిగారు రెండు పర్యాయాలు జిల్లాపరిషత్తు అధ్యక్షులుగా పనిచేశారు. రాయలసీమ మహాసభకు అధ్యక్షులుగా ఆయన చేసిన కృషి ఫలితంగా ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి సంఘాన్ని నియమించింది.

శ్రీ బసిరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థకు అధ్యక్షులుగా రెండుసార్లు నియమింపబడినారు. ఈ పదవీకాలంలో పారిశ్రామికాభివృద్ధి విషయాలలో అనేక సమిష్టి సంస్థల ఏర్పాటుకు కృషి చేశారు. 1960 నుంచి 63 వరకు కేంద్ర ప్రభుత్వ రంగంలో వున్న భారత హెవీ ప్లేట్స్ అండు వెసెల్స్ సంస్థకు అధ్యక్షులుగా పని చేశారు.

1971 సెప్టెంబరులో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో మధ్యతరహా నీటిపారుదలశాఖ మంత్రిగా చేరారు.

శ్రీ రాజా సాగి సూర్యనారాయణ రాజు

శ్రీ సాగి సూర్యనారాయణ రాజుగారు విశాఖపట్టణంజిల్లా నర్సీపట్నం తాలూకా తంగేడు గ్రామంలో 1903 నవంబరు 1వ తేదీన జన్మించారు. వీరు విజయనగరంలోని మహారాజా కాలేజీలో చదివారు. గాంధీజీ పిలుపు అందుకొని చదువుకు స్వస్తి చెప్పారు. శ్రీ రాజా గారు 1952 లో జరిగిన ప్రథమ సాధారణ ఎన్నికలలో పాయకరావుపేట నియోజకవర్గం నుండి మద్రాసు శాసన సభకు ఎన్నికైనారు. 1955 మధ్యంతర ఎన్నికలలో ఆంధ్ర శాసనసభకు నర్సీపట్నం, పాయకరావుపేట ద్విసభ్య నియోజక వర్గం నుంచి తిరిగి ఎన్నికైనారు. 1967 లోను, ఇటీవలి ఎన్నికలలోనూ వీరు అదే నియోజక వర్గంనుండి ఎన్నికయ్యారు.

అటవీశాఖ.



శ్రీ రాజుగారు వివిధ హోదాలలో జిల్లా కాంగ్రెసు, రాష్ట్ర కాంగ్రెసు కమిటీలలో పనిచేశారు. విశాఖ పట్నం జిల్లా


పరిషత్తు ప్రథమ అధ్యక్షులు. ఏటికొప్పాక చక్కెర ఫ్యాక్టరీ అధ్యక్షులుగా పని చేశారు. తిరుమలై తిరుపతి ట్రస్టుబోర్డు సభ్యులుగా పనిచేశారు. వీరు 1963–67 కాలంలో ఎ. ఐ. సి. సి. సభ్యులుగా వున్నారు. 1967 కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ ఛీఫ్ విప్‌గా వ్యవహరించారు. తరువాత శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గంలో అటవీశాఖ మంత్రిగా పని చేశారు.

శ్రీ యల్. లక్ష్మణదాసు

శ్రీ లుకలాపు లక్ష్మణదాసుగారు 1918 జూన్ నెలలో శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం తాలూకా, కొమనపర్యపల్లి గ్రామంలో జన్మించారు. 1940లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. విద్యార్థుల ఉద్యమాలలో మొదటినుంచీ వీరికి ఆసక్తి వుండేది. ఆంధ్రవిద్యార్థి సమాఖ్యకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.


జిల్లా కాంగ్రెసు కమిటీకి నాలుగేళ్లపాటు అధ్యక్షులుగాను, ఎనిమిదేళ్లపాటు కార్యదర్శిగాను వున్నారు. 1952 లో ప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ తర్వాత ఎ. పి. సి. సి. కి ప్రధాన కార్యదర్శి అయ్యారు.

1952 నుంచి 1967 వరకు రాష్ట్ర శాసన సభలో పాతపట్నం నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ సభ్యులుగా వున్నారు. 1972 ఎన్నికల్లో పొందూరు నియోజకవర్గంనుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. పద్దెనిమిదేళ్లపాటు ఎ. ఐ. సి. సి. సభ్యులుగా వున్నారు. శాసనసభకు సంబంధించిన అనేక సంఘాలలో పని చేశారు.



గృహ నిర్మాణం, గృహవసతి.

శ్రీ పి. నరసారెడ్డి



భారీ నీటి పారుదల శాఖ.

శ్రీ పి. నరసారెడిగారు ఆదిలాబాదు జిల్లా నిర్మల్‌లో 1931 సెప్టెంబరు 9వ తేదీన జన్మించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బి. ఎ. ఎల్. ఎల్. బి. పట్టా పొందారు. శ్రీరెడ్డిగారు హైదరాబాదులో రెండు సంవత్సరాలపాటు ప్రాక్టీసుచేశారు. 1947లో ఆయన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసులో చేరారు. నిజాము పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన కళాశాలల బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నారు. విద్యార్థి ఉద్యమంలో ఆయన చాలా ఆసక్తితో పాల్గొన్నారు.

రాజకీయ, సాంఘిక, సాహిత్య సంస్థలతో సన్నిహిత సంబంధం ఉన్న ఫలితంగా శ్రీ నరసారెడ్డిగారు వివిధ సందర్భాలలో అనేక సంస్థ లలో వివిధ పదవులను నిర్వహించారు.

నిర్మల్ తాలూకా భారత్ సేవక్ సమాజ్ కన్వీనరుగా వ్యవ హరించారు. 1952-58 సంవత్సరాలలో నిర్మల్ పట్టణ కాంగ్రెసు సంఘం కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత మూడు సంవత్సరాలపాటు అధ్యక్షులుగా వ్యవహరించారు. గ్రంథాలయాల ఏర్పాటులో ప్రముఖ పాత్ర వహించి నిర్మల్ ఉర్దు గ్రంథాలయం కార్యదర్శిగా ఉన్నారు.

రాష్ట్రంలో పంచాయతి రాజ్ వ్యవస్థ ఏర్పాటు కావడంతో శ్రీ నరసారెడ్డిగారు 1959 డిసెంబరులో ఆదిలాబాదు జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆ పదవిలో ఉన్నప్పుడు వెనుక బడిన జిల్లా అభివృద్ధికి అనేక కార్య క్రమాలను అమలు జరిపారు. సహకార రంగంలో ఆసక్తి ఉన్న కారణంగా ఆయన 1967 నుండి 1970 వరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ అధ్యక్షులుగా వ్యవహరించారు.

1967లో ఆదిలాబాదు జిల్లా నిర్మల్ నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికైనారు. 1970 మార్చిలో ఎ. పి. సి. సి. అధ్యక్షులైనారు. ఇటీవలి ఎన్నికలలో నిర్మల్ నియోజకవర్గం నుండి పోటీ లేకుండా ఎన్నికైనారు.

శ్రీ టి. అంజయ్య

శ్రీ టి. అంజయ్యగారు 1929లో జన్మించారు. వీరు బీద కుటుంబానికి చెందిన వారు. 1942లో చదువుకు స్వస్తి చెప్పి "క్విట్ ఇండియా" ఉద్యమంలో పాల్గొన్నారు.


శ్రీ అంజయ్యగారు హైదరాబాదు కార్మిక నాయకులలో ప్రముఖులు. స్వయం కృషితో పైకి వచ్చారు. 1943లో కార్మిక రంగంలో ప్రవేశించారు. సనత్ నగర్‌లో కార్మిక సంఘాల ఉద్యమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత రాష్ట్ర ఐ. ఎన్. టి. యు. సి. అధ్యక్షులైనారు. ఏడు సంవత్సరాల పాటు యీ పదవిలో ఉన్నారు. ఆయన కొంత కాలంపాటు తెలంగాణా ప్రజా సమితిలో సభ్యులుగా ఉన్నారు. ప్రజా సమితి, భారత జాతీయ కాంగ్రెసులో చేరిన ఫలితంగా శ్రీ అంజయ్యగారు కాంగ్రెసులో చేరారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు అడ్‌హాక్ సంఘం ఉపాధ్యక్షులు గాను, తెలంగాణా ప్రాంతీయ కాంగ్రెసు సంఘం అధ్యక్షులు గాను ఆయన ఉన్నారు. యునెస్కో పథకం క్రింద ఆయన జపాన్‌లో పర్యటించారు.

శ్రీ అంజయ్యగారు 1957లో నిజామాబాదు జిల్లా ఆర్మూరు నుండి శాసన సభకు ఎన్నికైనారు. అప్పటి నుండి శాసన సభ్యులు గానే ఉంటున్నారు. 1960లో కార్మికులు ఎక్కువగా నివసించే ముషీరాబాదు నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికైనారు. 1967లో కూడా అదే నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఇటీవలి ఎన్నికలలో కూడా అదే నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికైనారు.



కార్మిక శాఖ,
ఎంప్లాయిమెంట్.

శ్రీ మండలి వెంకట కృష్ణారావు



సాంఘిక సంక్షేమం,
మత్స్య పరిశ్రమలు.

శ్రీ ఎం. వి. కృష్ణారావు గారు 1927 లో జన్మించారు. వీరు కృష్ణా జిల్లాలోని ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. అవనిగడ్డలో ఉన్నతపాఠశాల చదువు పూర్తిచేసి, మచిలీపట్నంలో కళాశాల విద్య అభ్యసించారు. విద్యార్థిగా వున్నప్పుడే విద్యార్థుల సమస్యల పట్ల ఎక్కువ ఆసక్తి చూపేవారు. జాతీయ విద్యార్థి సంఘంలో చేరి 1942లో అవనిగడ్డ విభాగానికి అధ్యక్షులయ్యారు. 1945 లో కృష్ణాజిల్లా విద్యార్థి కాంగ్రెసుకు కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేశారు. 1944 లో దివితాలూకా కాంగ్రెసు సమితికి కార్యదర్శిగా వ్యవహరించారు.

1948 లో క్రొత్తఢిల్లీలో జరిగిన ఆసియా విద్యార్థి సమావేశానికి మద్రాసురాష్ట్ర ప్రతినిధిగా హాజరయ్యారు. 1948–52 మధ్యకాలంలో జిల్లా యువజన కాంగ్రెసుకు అధ్యక్షులుగా వున్నారు. 1952 నుంచి నాలుగేళ్లపాటు జిల్లా కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా పని చేశారు. 1954 నుంచి అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా వుంటున్నారు.

1956–58 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. 1971 లో ఆంధ్ర ప్రదేశ్ అడ్‌హాక్ కమిటీకి ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థలోనూ, మత్స్య పరిశ్రమాభివృద్ధికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహామండలిలోనూ సభ్యులుగా పని చేశారు.

దివి సీమ సాంస్కృతిక, సాంఘిక సేవా సంస్థకు వీరు వ్యవస్థాపక అధ్యక్షులు. 1969 లో గాంధీ క్షేత్రాన్ని నెలకొల్పారు.

కృష్ణాజిల్లా పరిషత్తుకు 1963–69 మధ్యకాలంలో వైస్ ఛైర్మనుగా వ్యవహరించారు. అవనిగడ్డ పంచాయతీ సమితి

అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడారు. వీరు 1957 సాధారణ ఎన్నికల్లో మచిలీపట్నం నియోజక వర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంనుంచి రాష్ట్ర శాసన సభకు పోటీలేకుండా ఎన్నికయ్యారు.

శ్రీమతి బి. జయప్రదా దేవి



విద్యుచ్ఛక్తి, స్టేషనరీ, ప్రింటింగ్, మహిళా సంక్షేమం, శిశు సంక్షేమం.

శ్రీమతి భవనం జయప్రదా దేవిగారు 1930 జూలై 1వ తేదీన గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా బ్రాహ్మణ కోడూరులో జన్మించారు. ఆమె తమ స్వగ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. గుంటూరులో ఉన్నత విద్య అభ్యసించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఉన్నత కుటుంబానికి చెందిన వారు. ఆమె తమ విద్యార్థి దశ నుండి కాంగ్రెసు వ్యవస్థతో సంబంధం కలిగి ఉన్నారు.

శ్రీమతి జయప్రదా దేవిగారు విద్యా వ్యాసంగంలో చాలా చురుకుగా వుండేవారు. 1950లో గుంటూరు లోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల నుండి అర్థిక శాస్త్రం ప్రత్యేక సబ్జెక్టుతో పట్టభద్రురాలైనారు. రెండు సంవత్సరాలపాటు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యాభ్యాసం కొనసాగించారు. 1956 సెప్టెంబరు నుండి 1958 మార్చి వరకు ఆమె ప్రభుత్వ ఉద్యోగం చేశారు. గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో లెక్చరర్‌గా కూడా పనిచేశారు.

1967 సాధారణ ఎన్నికలలో శ్రీమతి జయప్రదా దేవి గారు గుంటూరు జిల్లా వినుకొండ నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికైనారు. ఇటీవలి ఐదవ సాధారణ ఎన్నికలలో కూడా యిదే నియోజక వర్గం నుండి తిరిగి ఎన్నికైనారు.


శ్రీ కె. ప్రభాకరరెడ్డి

శ్రీ కె. ప్రభాకరరెడ్డిగారు 1938 ఆగస్టు 14వ తేదీన హైదరాబాదు జిల్లాలోని కొహెడ గ్రామంలో జన్మించారు. వీరు రైతు కుటుంబానికి చెందినవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎస్.సి పట్టా పొందారు. కళాశాలలో చదువుకొనే రోజులలో వీరు విద్యార్థి సంఘం కార్యకలాపాలలో ప్రధానపాత్ర వహించేవారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1958-59 లో వీరు భారతీయ విద్యార్థి జాతీయ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. యువజన సంక్షేమ కార్యకలాపాలలో వీరి పాత్ర శ్లాఘనీయమైనది. 1955 నుంచి మూడేళ్లపాటు ఆంధ్ర ప్రదేశ్ యువజన కాంగ్రెసుకు కార్యదర్శిగా పనిచేశారు. 1963 నుంచి హైదరాబాదు జిల్లా కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

1963 నుంచి 7 సంవత్సరాలపాటు హయాత్‌నగర్ పంచాయతీ సమితికి అధ్యక్షులుగా వున్నారు. వీరి హయాంలోనే హయాత్‌నగర బ్లాకు రాష్ట్రంలో ఉత్తమ బ్లాకుగా నిర్ణయించబడింది.

వీరికి సహకారోద్యమంతో కూడా సన్నిహిత సంబంధం వుంది. హైదరాబాదు వ్యవసాయ మార్కెటు కమిటీకి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. హైదరాబాదు స్థానిక పరిపాలనా సంస్థల నియోజక వర్గంనుంచి శాసనమండలికి వీరు ఎన్నుకోబడ్డారు.



రవాణా శాఖ.

శ్రీ చల్లా సుబ్బారాయుడు



పౌరసరఫరా, రేషనింగు.

శ్రీ చల్లా సుబ్బారాయుడు గారు అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకాలోని చల్లవారిపల్లి గ్రామంలో రైతు కుటుంబంలో 1914 నవంబరులో జన్మించారు. వీరు 1938లో రాజకీయాలలో ప్రవేశించారు. తాడిపత్రి హైస్కూలులో చదివిన తరువాత మద్రాసులోని పచ్చయప్ప కాలేజీలో చదివారు. 1932లో బొంబాయినుంచి అక్కౌంట్సులో ప్రభుత్వ డిప్లొమా, డి. కాం సంపాదించారు.


గాంధీజీ అడుగు జాడలలో నిర్మాణాత్మక కృషిలో పాల్గొని శ్రీ సుబ్బారాయుడుగారు అనంతపురం జిల్లాలో ఎనిమిదేళ్ళుగా ఖాదీ ప్రచారాన్ని కొనసాగించారు. తాడిపత్రిలో హరిజన హాస్టల్సు నడిపించే విషయంలో శ్రద్ధాసక్తులు చూపారు. వీరు 1938లో జిల్లా బోర్డు సభ్యులుగా పని చేశారు. అనంతపురం జిల్లా కాంగ్రెసు కమిటీలోనూ, ప్రదేశ్ కాంగ్రెసు కమిటీలోనూ సభ్యులుగా పని చేశారు. తుంగభద్ర హైలెవెల్ కాలువ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో శ్రీ సుబ్బారాయుడు గారు ప్రముఖ పాత్ర వహించారు.

శ్రీ సుబ్బారాయుడుగారు శ్రీ ప్రకాశం పంతులుగారు స్థాపించిన కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ టిక్కెట్టు పైన తాడిపత్రి నియోజక వర్గం నుంచి ప్రథమ సాధారణ ఎన్నికలలో శాసన సభకు ఎన్నికైనారు. 1955లో అదే నియోజక వర్గం నుంచి సమైక్య కాంగ్రెసు టిక్కెట్టుపైన శాసన సభకు ఎన్నికైనారు. 1967,1972 సాధారణ ఎన్నికలలో కూడా వీరు తాడిపత్రి నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసన సభకు ఎన్నికైనారు.

1971 సెప్టెంబరులో శ్రీ పి. వి.నరసింహారావు మంత్రి వర్గంలో పౌరసరఫరా మంత్రిగా చేరారు.

శ్రీ జి. రాజారామ్

శ్రీ జి. రాజారామ్‌గారు 1924 ఆగస్టు 27వ తేదీన నిజామాబాదు జిల్లా ఆర్మూర్ గ్రామంలో జన్మించారు. నిజామాబాదులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి కామర్సులో పట్టభద్రులైనారు. 1947లో హైదరాబాదు భారత దేశంలో విలీనం కావాలని జరిగిన ఉద్యమంలో ఆయన విద్యార్థి నాయకులుగా ప్రముఖపాత్ర వహించారు. పోలీసు చర్య తర్వాత కాంగ్రెసు నుండి విడిపోయి సోషలిస్టు పార్టీలో చేరారు. నిజామాబాదు జిల్లాలో సోషలిస్టు పార్టీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. షక్కర్‌నగర్ మజ్దూర్ సభ ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు.



చేనేత, సహకార జవుళి మిల్లులు, సహకార చక్కెర ఫ్యాక్టరీలు.


శ్రీ రాజా రామ్‌గారు 1957 నుండి శాసన సభ సభ్యులుగా ఉన్నారు. 1967లో నిజామాబాదు జిల్లా బాలకొండ నియోజక వర్గం నుండి పోటీ లేకుండా శాసన సభకు ఎన్నికైనారు. ఇటీవలి

ఎన్నికలలోకూడా వీరు అదే నియోజకవర్గంనుంచి శాసన సభకు ఎన్నికైనారు. తెలంగాణా ప్రజా సమితిలో సభ్యులుగా వుండి, తెలంగాణా ప్రజా సమితి భారత జాతీయ కాంగ్రెసులో విలీనం అయిన ఫలితంగా శ్రీ రాజారామ్‌గారు కాంగ్రెసులో చేరారు.

ఇటీవలి ఎన్నికల్లో వీరు అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

ఎన్నికలకు ముందు శ్రీ పి. వి. నరసింహారావు మంత్రి వర్గంలో అటవీశాఖా మంత్రిగా పనిచేశారు.

శ్రీ పి. మహేంద్రనాథ్



ఎక్సైజు.

శ్రీ మహేంద్రనాథ్ గారు మహబూబ్‌నగర్ జిల్లా, కొల్లాపూర్ తాలూకా, జొన్నల బొగుడ గ్రామంలో 1926 జూన్ 10వ తేదీన జన్మించారు. ఫస్ట్‌గ్రేడు ప్లీడర్ డిప్లొమా పొందిన అనంతరం హైదరాబాదులో న్యాయవాద వృత్తి చేపట్టారు. అనేక సంవత్సరాలపాటు వీరు హైదరాబాదు షెడ్యూలు కులాల సమావేశానికి కార్యదర్శిగా వ్యవహరించి సమాజంలోని బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేశారు.

జిల్లా కాంగ్రెసు కమిటీలో, హరిజన సేవక్ సంఘంలో సభ్యులుగా వున్నారు. ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగు అధ్యక్షులుగా వ్యవహరించారు. నాగర్ కర్నూలు లోని నేషనల్ హైస్కూలు తోనూ, గాంధీ స్మారక హరిజన వసతి గృహంతోనూ వీరికి సన్నిహిత సంబంధం వుంది.


1957లోనూ 1962లోనూ సాధారణ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్ కర్నూలు నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. 1967లో తిరిగి వీరు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు.

శ్రీ కె. గోపాలనాయుడు


శ్రీ కిలారి గోపాల నాయుడుగారు 1914 జూన్ 28వ తేదీన రైతు కుటుంబంలో జన్మించారు. వీరు చిత్తూరు జిల్లా సత్యవీడు తాలూకాలో వేలూరు గ్రామ నివాసి. రెండు దశాబ్దాలుగా రాజకీయాలలో చురుకుగా పాల్గొంటున్నారు.

శ్రీ గోపాలనాయుడుగారు 1959లో తమిళనాడు రాష్ట్ర చెంగల్పట్టు జిల్లాలోని ఉత్తుకోట బ్లాకు అభివృద్ధి మండలి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సత్యవీడు ఆంధ్ర ప్రదేశ్‌లో లీనమైన తరువాత వీరు 1961నుంచి 1967 వరకు రెండుసార్లు పిచ్చటూరు పంచాయతీ సమితి అధ్యక్షులుగా పని చేశారు. వీరు 1967, 1972లలో చిత్తూరు జిల్లా నగరి నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికైనారు. 1971 సెప్టెంబరులో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో రవాణాశాఖ మంత్రిగా పనిచేశారు.

చిన్నతరహా నీటిపారుదల.



శ్రీ భాట్టం శ్రీరామమూర్తి



ప్రాథమిక, సెకండరీ విద్య, అకాడమీలతో పాటు విజ్ఞానశాస్త్ర సంస్థలు, సాంస్కృతిక విషయాలు, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర.

శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారు 1926 మే నెలలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులయ్యారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టం పొందారు. మొదట వీరు కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో సభ్యులై అటుతర్వాత విశాఖపట్నంలో సోషలిస్టు పార్టీని నిర్వహించారు. రాష్ట్ర సోషలిస్టు పార్టీకి వీరు సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థకు కూడా సంయుక్త కార్యదర్శిగా వున్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి కూడా సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు.

వీరు పాత్రికేయులు, రచయిత కూడా. 1947 లో "జయభారతి" పత్రిక ఉప సంపాదకులుగా పత్రికా ప్రపంచంలో ప్రవేశించారు. విజయనగరం నియోజక వర్గానికి 1957–67 కాలంలో రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. ఇటీవలి ఎన్నికల్లో వీరు పరవాడ నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు.

విశాఖపట్నం నుంచి ప్రచురింపబడిన తెలుగు వారపత్రిక 'ప్రజారథం' కు వీరు సంపాదకులుగా వున్నారు. 'ఆంధ్రజనత' క్కూడా వీరు సంపాదకత్వం వహించారు.


శ్రీ కె. భీమ్‌రావు

శ్రీ కె. భీమ్‌రావుగారు ఆదిలాబాదు జిల్లా, ఆసిఫాబాదు తాలూకాలో వంకెడి గిరిజన సమితికి చెందిన బంబాన గ్రామంలో 1933 నవంబరు 19న జన్మించారు. బాల్యంలో వరంగల్లులో చదువుకొని, తరువాత ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 1950లో పట్టభద్రులయ్యారు.


వీరు వెనుక బడిన తరగతుల ప్రజలకు—ముఖ్యంగా గిరిజనోద్ధరణకు చేసిన సేవలు ప్రజల మన్ననలు పొందినవి. గిరిజన శ్రేయోభివృద్ధి కొరకు వీరు తాలూకా స్థాయిలో అనేక చర్చా గోష్ఠులు ఏర్పాటు చేశారు. 1965 నుంచి ఆదివాసి సేవా సమితిలో సభ్యులుగా వున్నారు. 1966 నుంచి 1968 వరకు ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో పర్యటనలు చేసి, గిరిజన సమస్యలను పరిశీలించిన తరువాత వాటికి సంబంధించిన సమగ్రమైన నివేదికను అఖిల భారత కాంగ్రెసు కమిటీకి సమర్పించారు. 1962 నుంచి రాష్ట్ర శాసన సభ సభ్యులుగా వున్నారు. 1972లో ఆసిఫాబాదు నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికైనారు.

1971 సెప్టెంబరులో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో గిరిజన సంక్షేమ మంత్రిగా పనిచేశారు.

గిరిజన సంక్షేమం.



డా. సి.హెచ్. దేవానందరావు



యాత్రా విషయాలు, రవీంద్ర భారతి, రాష్ట్రాన్ని సందర్శించే సాంస్కృతిక బృందాలు, ప్రభుత్వ గ్రంథాలయాలు

డా. సి.హెచ్. దేవానందరావుగారు 1932 ఆగస్టు 2వ తేదీన విజయవాడలో జన్మించారు. విద్యార్థి దశలోనే వీరు చాలా తెలివైన వారుగా పరిగణింప బడేనారు. మొదట్లో పాఠశాల అధ్యాపకులుగా జీవితం ప్రారంభించారు. ఆ తరువాత సికింద్రాబాదు ప్రధాన కార్యస్థానంగా క్రైస్తవ మతబోధక వృత్తిని చేపట్టారు. క్రైస్తవులు, తదితర అల్పసంఖ్యాక వర్గాల వారికై తన సేవలను పూర్తిగా అంకితం చేసి కృషి చేస్తున్నారు.

డా. దేవానందరావు గారు ప్రపంచమంతా పర్యటించారు. ఇటీవలే వీరు అమెరికా, కెనడా, ఇటలీ, ఇంగ్లండు, పశ్చిమ జర్మనీ, జపాన్, హాంకాంగ్, ఇస్రాయేల్ మొదలైన దేశాలను సందర్శించారు. డబ్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ క్రైస్తవ మహాసభలో ఆసియా దేశాల క్రైస్తవుల ఏకైక ప్రతినిధిగా పాల్గొని ప్రసంగించారు. అమెరికా పర్యటనలో వీరు హ్యూస్టన్‌లోని నాసా ఖగోళ పరిశోధన కేంద్రాన్ని ప్రత్యేక అతిథిగా సందర్శించారు.

డా. దేవానందరావు గారు హోమియోపతి వైద్యంలో డాక్టరేటు పొందారు.

క్రైస్తవ మతానికి, క్రైస్తవులకు వీరు చేసిన సేవలకు గుర్తింపుగా 1963లో కాలిఫోర్నియాలోని ప్రపంచ స్థాయి క్రైస్తవ మిషన్ వీరికి ఆధ్యాత్మిక విషయాలలో డాక్టరేటు డిగ్రీని యిచ్చింది. డా. దేవానందరావు గారు శాసన మండలి సభ్యులు.

1971 సెప్టెంబరులో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రి వర్గంలో యాత్రావిషయాల మంత్రిగా చేరారు. మంత్రి అయిన తర్వాత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు సందర్శించారు.

శ్రీ ఎ. మదన్ మోహన్

శ్రీ ఎ. మదనమోహన్‌గారు 1932 నవంబరు 16వ తేదీన వరంగల్లులో జన్మించారు. వీరు మెదక్ జిల్లా నివాసి. హైదరాబాదులో విద్యాభ్యాసం చేసి 1954లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పట్టభద్రులై యల్. యల్. బి. డిగ్రీ పుచ్చుకొన్నారు. శ్రీ మదనమోహన్ గారి విద్యార్థిదశ అమోఘంగా జరిగింది. అన్ని పరీక్షలలో అగ్ర స్థానాన్ని ఆక్రమించారు. ఇంటర్మీడియట్ పరీక్షలో ఉర్దూ భాషలోను, బి. ఎ. లో ఫిలాసఫీ సబ్జక్టులోను ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. లా డిగ్రీ పరీక్షలో అంతర్జాతీయ న్యాయ శాస్త్రంలో ప్ర ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైనారు.

శ్రీ మదనమోహన్‌గారు విద్యార్థి దశలో సాహిత్య కార్య కలాపాలలో విశేషంగా పాల్గొన్నారు. 1951–52లో వీరు నిజాంకాలేజీ ఉర్దూ యూనియన్ కార్య దర్శిగాను, 1952–53లో నిజామే అదబ్ అనే కాలేజీ పత్రికకు సంపాదకులుగాను పని చేశారు. 1954-55లో లా కాలేజి విద్యార్థుల సంఘానికి కార్యదర్శిగా ఎన్నికైనారు. 1956లో లక్నోలో జరిగిన అఖిల భారత యువజన కాంగ్రెసులో ఆంధ్ర ప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొన్నారు.

శ్రీ మదనమోహన్‌గారు, పోలీసు చర్యకు పూర్వం స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. లా డిగ్రీ పుచ్చుకొన్న తరువాత వారు జనగామ, వరంగల్లు, హైదరాబాదులలో న్యాయ వాద వృత్తి అవలంబించారు. 1959లో రాజకీయాలలో ప్రవేశించి వరంగల్లులో కాంగ్రెసు సోషలిస్టు ఫోరంను ఏర్పాటు చేశారు. వీరు, ఇటీవలనే అధికార కాంగ్రెసులో లీనమైన తెలంగాణా ప్రజాసమితి సంస్థాపక అధ్యక్షులు.


సాంకేతిక విద్య, గనులు, యువజన సేవలు.



శ్రీ వి. బి. రాజు గారి రాజీనామా వల్ల ఏర్పడిన ఖాళీలో శ్రీ మదన్‌మోహన్ గారు ప్రజాసమితి టిక్కెట్టుపైన 1970లో సిద్ధిపేట నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికైనారు. 1972 లో కూడా వీరు అదే నియోజక వర్గం నుంచి శాసన సభకు ఎన్నికైనారు.

1971 లో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో సాంకేతిక విద్య, యువజన సంక్షేమ శాఖల మంత్రిగా పని చేశారు.

శ్రీ యం. ఆర్. శ్యామ్‌రావు



ఆర్థశాఖ, పురాపత్ర సంచయనం, స్పోర్ట్స్ కౌన్సిల్, ఆటలు, స్టేడియం, చిన్న మొత్తముల పొదుపు.

శ్రీ ఎం. ఆర్. శ్యామ్‌రావుగారు 1947 లో రాజకీయాల్లో ప్రవేశించారు. వయస్సు నలభైనాలుగేండ్లు.

వీరు 1951 లో ఖైరతాబాదు నియోజక వర్గంనుంచి పుర పాలక సభ్యులుగా మొదటిసారిగా ఎన్నికయ్యారు. అప్పటినుంచి 1969లో హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ రద్దయ్యేవరకు వీరు యీ హోదాలోనే వున్నారు. 1964–65లో హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ మేయరుగా ఎన్నికయ్యారు.

అఖిలభారత మేయర్ల సమావేశానికి ప్రతినిధిగా ఎన్నికై, బెల్‌గ్రేడులో జరిగిన సమావేశానికి భారత దేశం తరఫున హాజరయ్యారు. 1958 నుంచి ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ సభ్యులుగావుంటున్నారు.

1953 నుంచి 1962 వరకు అది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. కార్మిక సహకార సంఘాల సమాఖ్య తాలూకు డైరెక్టర్ల బోర్డులో 1953 లో వీరు సభ్యులుగా వున్నారు.

1964 లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ సిండికేట్‌లో కూడా వీరు పనిచేశారు.

1969లో శాసన మండలి సభ్యులయ్యారు.

శ్రీ డి. మునిస్వామి

శ్రీ డి. మునిస్వామిగారు 1926 జూలై 1న కర్నూలుకు దగ్గర్లో పెద్దపాడు గ్రామంలో జన్మించారు. మొదట్లో కర్నూలులోను, ఆటు తర్వాత మద్రాసులోనూ విద్య నభ్యసించారు. మద్రాసు విశ్వవిద్యాలయంనుంచి పట్టభద్రులై, ఆంధ్ర విశ్వవిద్యాలయంనుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు.

విద్యార్థి దశలోనే వీరు విద్యార్థుల సమస్యల విషయంలో శ్రద్ధ కలిగివుండేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థి కాంగ్రెసుకు కార్యదర్శిగా వ్యవహరించారు.

1961లో అడ్వకేటుగా చేరి యిటీవలి వరకు న్యాయవాది వృత్తిలోనే వున్నారు.


కాంగ్రెసులోచేరి, కర్నూలు జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యులుగా సంస్థకు సేవచేశారు. నిర్మాణాత్మక కార్యక్రమాల విషయంలో వీరికిగల శ్రద్ధాసక్తులవల్ల వీరు 1970 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భారత సేవక్ సమాజ్ అధ్యక్ష పదవి అలంకరించారు.


ఇటీవలి ఎన్నికల్లో వీరు కోడుమూరు నియోజక వర్గంనుంచి పోటీలేకుండా శాసన సభకు ఎన్నికయ్యారు.

మార్కెటింగు, రాష్ట్ర గిడ్డంగి సంస్థ.









1972

శాసనసభ ఎన్నికలు

పోలింగ్ దృశ్యాలు





మహాభారతము

తెనుగంటుల లక్ష్మణశాస్త్రి

56

ఇంద్రద్యుమ్నాదుల కథ

పాండవులు మార్కండేయునితో 'మహాత్మా! నీకన్న పూర్వమెవరైన చిరంజీవులుండినారా?' అని యడుగగా నతడిట్లనెను:—"ఉన్నారు. ఇంద్రద్యుమ్న మహారాజు స్వర్గసుఖమనుభవించి క్షీణపుణ్యుడై దేవతలచేత తిరిగి భూలోకమునకు పంపబడి నా వద్దకువచ్చి 'నేనెవడనో నీకు తెలియునా?' అని నన్ను ప్రశ్నించెను. అప్పుడు నేను 'మేము ప్రతోపవాసాది కార్యక్రమములలో నిమగ్నులమై అన్నియు మరచియుందుము గనుక నీవెవడవో గురుతు తెలియజాలకున్నాను. హిమాలయమునందు 'ప్రావారకర్ణ' నామముతో నొక గుడ్లగూబ యున్నది. అది నాకన్న పూర్వమే జన్మించి యున్నది. అది నిన్ను గుర్తుపట్టవచ్చును. ఇక్కడ నుండి హిమవత్పర్వతము బాలదూరములో నున్నది. అక్కడికి పోవుదము' అని యంటిని. అప్పుడింద్రద్యుమ్నుడు అశ్వముగా మారి నన్ను తనపై నెక్కించుకొని గుడ్లగూబ యున్న చోటికి నేను మార్గముచూపగా తోడ్కొనిపోయెను. 'నన్ను నీవెరుగుదువా?' యని యింద్రద్యుమ్నుడు ఉలూకమునడిగెను. 'నేనెరుగను' అని గుడ్లగూబ యనెను. 'నీకన్న ముందు జన్మించినవారెవరైన నున్నారా?' అని ఆ రాజు అడిగెను. 'ఇంద్రద్యుమ్నము అను సరస్సు ఉన్నది. అక్కడ నాడీజంఘుడు అనునొక కొంగ యున్నది. అది నాకన్న పూర్వపుది. బహుశః అది నిన్నెరిగి యుండును' అని యా గుడ్లగూబ యనగా దానినిగూడ తనపై నెక్కించుకొని ముగ్గురము ఇంద్రద్యుమ్న సరస్సు కడకుపోయి 'ఇంద్రద్యుమ్న మహారాజును నీ వెరుగుదువా?' అని ఆ కొంగను ప్రశ్నించితిమి. 'నేనెరుగను నాకన్న పూర్వమునుండియే యీ సరస్సునందు 'అకూపారము' అను తాబేలున్నది. అది యీ తననెరిగి యుండును. దాని నడుగుడు.' అని నాడీజంఘుడనెను.

అంత నాడీజంఘుడు తాబేలును రమ్మని పిలిచెను. అది రాగా 'నీవీ యింద్రద్యుమ్ను నెరుగుదువా?' యని మేమడిగితిమి. 'ఎరుగకేమి?' అని కన్నీరునించి వణకుచు చేతులు జోడించి 'యీ రాజు ఇక్కడనే వేయి యూపస్తంభములను నాటి యజ్ఞములు చేసియుండెను. ఈ సరస్సు ఇతడు దానముచేసిన గోవుల రాక పోకలచే నేర్పడినది. ఇక్కడ నేను నివసించుచున్నాను.' అని యనెను.

ఆ తాబేలిట్లనుచుండగనే దేవలోకము నుండి రథము వచ్చెను. ఇంద్రద్యుమ్నునితో దేవదూతలు "నీవు కీర్తిమంతుడవైతివి. నిశ్చింతగా నీ రథమునందు స్వర్గమునకు రమ్ము. రాజా! మనుష్యుని పుణ్యకర్మల శబ్దము ఎంతవరకు స్వర్గలోకమును భూలోకమును వ్యాపించి యుండునో అంతదాక నతడు స్వర్గసుఖము ననుభవించును. ఇట్లే పాపకర్మల శబ్దముగూడ రెండులోకములలో వ్యాపించియుండు నంతవరకు ఆ మానవుడు నీచనరకములో పడి యుండును. కనుక సర్వదా మానవుడు మంచిపనులనే చేయుచుండవలెను. దానిచేత అనంత ఫలములు చేకూరును. పాపచింతలను వీడి సదా ధర్మమునే ఆచరించవలెను." అని యనిరి. అప్పుడారాజు దేవదూతలతో 'ఈ యిరువురు వృద్ధులను వారివారి స్థానములలో విడిచివచ్చుదాక నిక్కడనే యుండుడు' అని చెప్పి ధర్మరాజా! ఇంద్రద్యుమ్నుడు నన్ను, 'ప్రావారకర్ణు' డను గుడ్లగూబను మా స్థానములకుచేర్చి యా రథమునెక్కి స్వర్గమునకు పోయెను. నేను చిరంజీవినై యనుభవించిన విశేషములను మీకు తెలిపితిని' అని మార్కండేయ మహాముని చెప్పగా విని పాండవులు 'మహామునీ! స్వర్గమునుండి పతితుడగుచున్న యింద్రద్యుమ్ముని పునరుద్ధరించి స్వర్గమునకు పంపి యెంతటి మంచిపని చేసితివి' అనిరి. అది విని ఆ ముని 'యిట్లే పూర్వమీ కృష్ణభగవానుడు గూడ నరకబాధ ననుభవించుచున్న 'నృగ' మహారాజును ఉద్ధరించి తిరిగి స్వర్గమునకు పంపెను.' అని చెప్పెను. ఇంద్రద్యుమ్నాదుల చరిత్రను విని ధర్మరాజు తిరిగి యిట్లు ప్రశ్నించెను:—

ధార్మిక విషయముల వివరణము

దానఫలము :

"మహామునీ! ఎట్టి ప్రాయములలో చేసిన దానము వలన పురుషుడు స్వర్గలోక సుఖమును అనుభవించును? బాల్య- యౌవన గృహస్థ వృద్ధ వయస్సులలో దేనిలో చేసిన దానము ఎట్టిఫలము నిచ్చును?" అది విని మార్కండేయుడిట్లు బదులు చెప్పెను:—

"ఎవడు అపుత్రకుడో, ధర్మ బాహ్యుడో, పరాన్నమును భుజించుచుండునో, తన కొరకు మాత్రము వండుకొని యితరులకు పెట్టకుండ ఒక్కడే భుజించునో (అది చెడ్డ భోజనము) అట్టివారి జన్మము వ్యర్థమైనది కనుక వారు పూర్వము చెప్పబడిన నాలుగు

వయస్సులలోను షోడశ దానములు చేసిన వారైనను నవి నిరుపయోగములే యగును 'ఆరూఢ పతితునకు (వానప్రస్థ—సన్యాసాశ్రమములనుండి తిరిగి గృహస్థుడుగా మారినవాడు), కులభ్రష్టుడగు బ్రాహ్మణునకు, చోరునకును ఇచ్చిన దానము వ్యర్థ మగును, ఇట్లే అన్యాయ మార్గములో సంపాదించిన ధనమును దానముచేయుట గూడ వ్యర్థమేయగును. మాతా పితరులకు, గురువులకు, అసత్య వాదులకు, పాపాత్ములకు, కృతఘ్నులకు, గ్రామ పురోహితులకు, వేదవిక్రయము చేయువారికి, సేవకులకు, శూద్రులతో యజ్ఞములు చేయించువారికి, నీచ బ్రాహ్మణులకు, శూద్ర స్త్రీలను పెండ్లియాడిన బ్రాహ్మణులకు, పాములను పట్టి జీవితమును నిర్వహించు వారికి, సేవికలకు, స్త్రీలకు చేయబడు షోడశ (పది యారు) దానములు వ్యర్థములగును. (గురుజనమునకు చేయబడునది వారి సేవ యగును సేవకులకు స్త్రీలకుచేయునది వారి పోషణ యగును కనుక ఆ రెండు విధములగు దానములు చేయుట పురుషుని కర్తవ్యమే యగును గనుక అవి వ్యర్థములని భావము) తమో గుణమయము లగు భయ — క్రోధములచేత దానము చేయువాడు ఉత్తర జన్మములో గర్భవాస క్లేశరూపమగు దుఃఖముఖ అనుభవించును. సద్బుద్ధితో సద్బ్రాహ్మణులకు దానము చేయువాడు ఉత్తర జన్మములో అన్ని కోర్కెలను తీర్చుకొని పూర్ణ సుఖమును అనుభవించును. కనుక ధర్మరాజా, అన్ని ప్రాయములలోను చేయబడు సమస్త దానములను సద్బ్రాహ్మణులకే చేయవలెను. అట్టి దాతలు స్వర్గ సుఖమును అనుభవించెదరు." ఆ మాటలు విని ధర్మరాజు 'మహామునీ! ఏ బ్రాహ్మణుడు నాలుగు జాతుల వారినుండి దానము తీసి కొనునో అట్టివాడు ఎట్టి విశేష ధర్మములను ఆచరించుటచేత ఇతరులను తరింప జేసి తాను గూడ తరించునో చెప్పుడు ' అని అడుగగా మార్కండేయుడిట్లు చెప్ప దొడగెను :—

"రాజా! ఏ బ్రాహ్మణుడు జప—మంత్ర—హోమ వేదాధ్యయనములు చేయునో అట్టివాడు వేదరూపమగు నోడలో నితరులను సంసార సముద్రమునుండి దాటించి తాను గూడ దాటగలడు. బ్రాహ్మణులను సంతుష్టులను చేయువారియెడల దేవతలందరు సంతుష్టులగుదురు. బ్రాహ్మణాశీర్వాదమును పొందువారు స్వర్గలోక సుఖమును అనుభవించెదరు. పితరులను, దేవతలను, బ్రాహ్మణులను పూజించుటచేత· అనంత పుణ్య లోకములు లభించును. వివిధ రోగములచే బాధపడుచు మరణావస్థలో నున్నవారు స్వర్గసుఖములను కోరినచో బ్రాహ్మణులను పూజించి ఆ సుఖము నందగలరు. శ్రాద్ధకాలమునందు అత్యంత ప్రయత్నము చేసి ఉత్తమ బ్రాహ్మణులకే భోజనము పెట్టవలెను. అసహ్యమగు శరీర వర్ణము గలవారు, చెడ్డగా నల్లబడిన నఖములు గల వారు, కుష్ఠరోగులు, కపటులు, కుండులు (తండ్రి బ్రతికి యుండగా తల్లి యితర జార పురుషుని వలన కనిన పుత్రుడు 'కుండుడు' అనబడును), గోళకులు (తండ్రి మరణానంతరము తల్లి జారునివలన కనిన పుత్రుడు 'గోళకుడు' అనబడును), బాణములను ధరించి క్షత్రియ వృత్తిలోనున్నవారు నగు బ్రాహ్మణులను శ్రాద్ధ భోజనమునకు నియుక్తులను చేయగూడదు. అట్టి శ్రాద్ధము నింద్యమగును. అట్లు నిందితమగు శ్రాద్ధమును చేసిన యజమానుని ఆ శ్రాద్ధము అగ్ని యింధనమును వలె దహించి వేయును. శ్రాద్ధములలో వర్జనీయులగు 'అంధ-మూక-బధిర' ఇత్యాది బ్రాహ్మణులను వేదపారంగతులగు వారితో చేర్చి శ్రాద్ధములందు నియుక్తులను చేయవచ్చును." అని చెప్పి మార్కండేయముని యింకను దానమహిమను గూర్చి యిట్లనెను:—

"యుధిష్ఠిరా! ఎట్టివారికి దానము చేసినచో దాతలను, తమను సంసారమునుండి తరింపజేయుదురో అట్టి ప్రతిగ్రహీతలను (దానము తీసికొనినవారు) గూర్చి చెప్పెదను వినుము తనను, దాతను సంసార సాగరమునుండి తరింపజేయు శక్తిగల బ్రాహ్మణులకే శాస్త్రజ్ఞులు దానము చేయుదురు. గృహస్థులు అతిథులను భుజింపజేయుట చేత అగ్నులు వ్యాప్తిజెందును. అంతటి వ్యాప్తి అగ్నులకు హవిస్సులు, హోమములు, పుష్ప—సుగంధ ద్రవ్యముల అర్పణము చేయుట చేతగూడ కలుగదు. కనుక యుధిష్ఠిరా! నీవు సర్వప్రయత్నముల చేత అతిథులను భోజనాదులచేత తృప్తులను జేయుము. రాజా! ఎవరు అతిథులకు పాదోదకము, పాదములకు రాచుకొనుటకు నేయి, దీపము, అన్నము, వసతి యిచ్చెదరో అట్టివారికి యమరాజు దర్శనము ఉండదు అనగా నరకమునకు వారు పోవరని భావము. దేవతావిగ్రహములపై నుండి గంధ పుష్పాదినిర్మాల్యములను తీయుట, బ్రాహ్మణుల యెంగిలి పాత్రలను శుద్ధిచేయుట, వారికి గంధ పుష్పాద్యలంకారములు చేసి వారి పాదములను శరీరమును ఒత్తుట, ఈ పనులలో ఏ యొక్కటి చేసినను గోదాన ఫలముకన్న అధిక ఫలము చేకూరును 'కపిలా' గోవును (పసుపు మించిన తెల్లరంగు గల యావు) దానము చేసిన వారు సమస్త పాపములనుండి విముక్తులగుదురు.

"రాజా! శ్రోత్రియుడు—దరిద్రుడు—గృహస్థుడు —అగ్నిహోత్రములు చేయువాడు — దారిద్ర్యముచేత భార్యాపుత్రాదులను సంరక్షించజాలక వారిచేత తిరస్కరింపబడినవాడు—తనకెప్పుడును ఉపకారము చేయనివాడునునగు బ్రాహ్మణునకు దానము చేయవలెను. సంపన్నులకు ఎప్పుడు గూడ దానము చేయగూడదు. ఒక గోవును ఒక్కనికే యివ్వవలెను గాని అనేకులకు ఒక్కటి దానము చేయగూడదు. ఎందుకనగా వారు దానిని అమ్మి ఆ ధనమును, అందరు పంచుకొనెదరు. దానివలన దాతకు గోదానఫలము లభించదు. విక్రయింపబడిన గోవు దాత యొక్క మూడు తరముల సంతతిని నశింపజేయును. గోదానమును పుచ్చుకొని గోవును అమ్మిన వారు గూడ నశింతురు. ఉత్తమ వర్ణములో జన్మించిన వారికి సువర్ణ దానము చేసినచో నది శతసువర్ణ దానఫలము నిచ్చును. మంచి పుష్టిగల వృషభమును దానము చేయువారిని అది దాతలను దుర్గమమార్గములనుండి దాటించి స్వర్గమును చేర్చును పండితుడగు బ్రాహ్మణునకు భూదానము చేసిన వారికడకు అన్ని కోరికలు స్వయముగా వచ్చి చేరును. మార్గాయాసము చేత బడలి ఆకలి దప్పులకు లోబడివచ్చి అన్నమును యాచించిన వారికి, అన్నము దొరకు స్థలమును చూపినవారికి గూడ అన్నదాతలతో సమానమగు ఫలము కలుగును. కనుక ధర్మరాజా! అన్నదానముతో సమానమగు దానము లేదు సుమా! నీవు పుష్కలముగా అన్నదానము చేయుము. అన్నదాతకు బ్రహ్మ లోకము ప్రాప్తించును. అన్నము

కంటే మించినది లేదు. వేదములలో అన్నమే ప్రజాపతి యనియు, ప్రజాపతియే సంవత్సరమనియు, సంవత్సరమే యజ్ఞమనియు, సర్వ ప్రపంచము యజ్ఞమందే నిలిచి యున్నదనియు, అట్టి యజ్ఞము నుండియే చరాచరాత్మకమగు సర్వ ప్రపంచము పుట్టినదనియు చెప్పబడినది. అందుచేత అన్నదానమే అన్నిటికన్న శ్రేష్ఠమైనది.

"ఎవరు బావులు, నూతులు, చెరువులు, కుంటలు త్రవ్వించుదురో, అన్నదానము చేసి మధురముగా మాట్లాడుదురో అట్టివారికి యముని మాటగూడ వినపడదు. రాజా! ఎవరు కష్టించి సంపాదించిన ధన ధాన్యములను ఉత్తమ బ్రాహ్మణులకు దానము చేయుదురో అట్టివారి యెడల భూదేవి సంతుష్టురాలై ధన—ధాన్య వర్షములను గురియించును. అన్నదానము చేయువారు తొలుత, ఆ తరువాత సత్యము పలుకువారు, ఆ పిదప అయాచితముగా (అడుగకుండనే) దానము చేయువారు వరుసగా స్వర్గమునకు పోయెదరు. ఇట్లు ఆ ముగ్గురు పుణ్యాత్ములకు సమానముగా ఉత్తమ గతి లభించును." అని మార్కండేయముని చెప్పిన దానమహిమను విని ధర్మరాజు మరల నిట్లు ప్రశ్నించెను:—

యమలోక వృత్తాంతము

"మహాత్మా! ఈ మనుష్య లోకమునుండి యమలోకమెంత దూరమున నున్నది? అది యెట్లున్నది? ఎంత పెద్దది? ఆ యమలోక సంకటములనుండి విముక్తిని జెందుటకు మనుష్యుడు ఏయే ఉపాయములను చేయవలెను" అని యడుగగా, మార్కండేయుడిట్లు చెప్పెను:—

"ధర్మరాజా! అతి రహస్యమగు విషయమిది. చెప్పెదను వినుము. ఈ లోకమునకు యమలోకమునకు మధ్య ఎనుబది యారు వేల యోజనముల దూరము కలదు. (యోజనమనగా ఒక ఆమడ—సుమారు పదిమైళ్ళు). ఆ మార్గమంతయు జల రహితమగు శూన్యాకాశమే. అది ఘోరదుర్గమ మార్గము. అచట విశ్రాంతి తీసుకొనుటకు ఒక వృక్షము గూడ లేదు. యముని యాజ్ఞచేత యమదూతలు పాపులనచటికి ఈడ్చుకొని పోవుచుందురు. బ్రాహ్మణులకు ఈ లోకములో చేయబడిన అనేక దానములు యమలోక మార్గములో ఆశ్రయములై మరణించిన వారికి ఆయా సుఖములను కలుగజేయును. అవి చేయనివారికి ఆ సుఖములు అక్కడ లభించవు.

'వస్త్ర—హిరణ్య—భూమి—సస్య—జల—దీప—గో', దానములు చేసినవారు వస్త్రాభరణాదులచే భూషితులై, ఆకలి దప్పులు లేక వెలుతురు మార్గమునందు మనోహరమగు హంసల విమానములో పోవుదురు. ఒకనెల—ఆరునాళ్లు—మూడునాళ్లు ఒక్కొకపూట మాత్రము భోజనము చేయు వ్రతము నాచరించువారికి మార్గమధ్యములోనే సమస్త రోగములు తిరిగిపోవును. మంచిజలదాతకు మార్గములో నున్న 'పుష్పోదక' యను నదిలో చల్లని అమృతముతో సమానములగు నీరు లభించును. పాపులకు ఆ జలమే చీము—నెత్తురుల వలె కనిపించును. కనుక ధర్మరాజా! మార్గయాసాదులచే కష్టపడి వచ్చిన వారికి అన్నాది దానములను నీవు చేయుచుండుము. దీని వలన పుణ్యలోకము సుఖముగా లభించును. రాజా! నీకు అనేక దానమహిమలను వివరించితిని. ఇంకను ఏమి విన దలచితివో చెప్పుము" అని ప్రశ్నించగా యుధిష్ఠిరుడు 'మహాత్మా! నీవు వివరించు ననేక ధర్మములను వినుటకు కుతూహల పడుచున్నాను' అనగా మార్కండేయుడిట్లు చెప్ప దొడగెను:—

గోదాన మహిమ

"రాజా! గోదాన మహిమ సర్వపాప హరమైన ధర్మము అది చెప్పెద వినుము. 'జ్యేష్ఠ పుష్కర' తీర్థమునందు కపిలాధేనువును దానము చేసినంత ఫలము ఒక్క సద్బ్రాహ్మణుని కాళ్ళుకడిగినచో కలుగును. ద్విజపాదోదకముచేత నెంతకాలము భూమితడిసియుండునో యంతకాలము కాళ్ళుగడిగిన వారి పితృ దేవతలు తామరాకుతో జలమును పానముచేయుచు హాయిగా నుండెదరు. సద్బ్రాహ్మణునకు స్వాగతమిచ్చుటచేత అగ్నులు, ఆసనమిచ్చుట చేత నింద్రుడు, కాళ్ళు కడుగుటచేత పితృదేవతలు, భోజనము పెట్టుటచేత బ్రహ్మదేవుడును తృప్తి నొందెదరు. గోవు ఈను నప్పుడు దూడ తల కాళ్లు మాత్రము బయటకు కనబడుచు ఇతర శరీర భాగము మాతృగర్భములో నుండగా నట్టి సమయమునందు గోవును దానము చేయవలెను. దూడ మాతృయోనినుండి సగము బయట వెడలి భూమిని అంటకుండ నుండునట్టి పరిస్థితిలోనున్న ఆవు పృథివీస్వరూపముని భావించవలెను. అట్టి సమయమునందు గోవును దానము చేసినవారు, ఆ గోవు—దూడల యొక్క వెంట్రుకలు ఎన్నియుండునో అన్నివేల యుగములు స్వర్గలోకములో సుఖమనుభవింతురు. రాజా! బంగారముతో ముక్కును, వెండిచేత గిట్టలను నిర్మించి, సర్వ రత్నాలంకారములతో భూషితమగు నల్లని యావును నువ్వులచేత కప్పి దానముచేసినవాడు మాత్రమేకాక ఆ దానము గొని దానినట్లే యితరులకు దానము చేసినవాడు గూడ ఉత్తమోత్తమమగుఫలమును పొందెదరు. సముద్ర శైల కానన సహితముగా సమస్త భూమండలములను దానము చేసిన వానికి లభించు పుణ్యలోకములు ఆగోదాతకు వచ్చును.

"ధర్మరాజా! ఎవడు తన చేతులను మోకాళ్ళ నడుమ నుంచుకొని కుడి చేత భోజనము చేయునో అట్టివాడు తాను తరించి యితరులను తరింపజేయును. ఎవడు మద్యపానము చేయడో, నిర్దోషిగానుండునో, విధిపూర్వకముగా వేదపాఠము చేయునో, అట్టివాడుగూడ నితరులను తరింపజేయును. బ్రాహ్మణునికి ఆయుధము కోపమే, ఇంద్రుడు వజ్రాయుధముచేత శత్రు సంహారము చేసినట్లే బ్రాహ్మణుడు క్రోధాయుధముచే శత్రునాశము చేయగలడు. నేను నీకు ధర్మ యుక్తమైన కథను చెప్పితిని. దీనిని విని నైమిశారణ్య వాసులగు వారు మిక్కిలి ప్రసన్నులైరి. ఈ ధర్మములను విన్న మానవులు భయ శోక క్రోధ పాపాదులనుండి విముక్తులై ఈ ప్రపంచమున పునర్జన్మము లేకుందురు." ఈ ధర్మ రహస్యములను శ్రద్ధగా విని ధర్మరాజు "మహాత్మా! దేనిచేత బ్రాహ్మణుడు సర్వదా పరిశుద్ధుడుగానుండునో అట్టి 'శౌచము' అను ధర్మమును గూర్చి సెలవీయుడు" అని యడుగగా నా ముని ఇట్లు చెప్ప దొడగెను:—

"రాజా! శౌచము మూడు విధములుగ నుండును. (1) వాక్‌శౌచము (పవిత్రమగు వాక్కు), (2) కర్మశౌచము

(పవిత్రమగు కర్మ), (3) జలశౌచము (పవిత్రజలము) ఈ మూడింటి చేత పరిశుద్ధుడగువాడు (అనగా మంచిమాటలాడుచు, సత్కర్మలు చేయుచు, స్నానాదులచేత శరీరపారిశుధ్యము గలిగిన వాడు) తప్పక స్వర్గాధికారమును పొందగలడు. ప్రాతఃకాల సాయంకాలములయందు సంధ్యావందనము చేయుచు, పవిత్ర వేదమాతయగు గాయత్రీదేవి మంత్రము భక్తిపూర్వకముగా జపించు నట్టి బ్రాహ్మణుడు గాయత్రీదేవి కృపచేత పరమపవిత్రుడై పాపరహితుడగును. అట్టివాడు చతుస్సముద్ర ముద్రితమగు సమస్తభూమండలమును దానముగా గైకొన్నను ఎట్టి సంకటములలో పడడు. ఇంతేకాక, అట్టి బ్రాహ్మణునకు వ్యతిరేకములుగా నున్న సూర్యాది గ్రహములుగూడ శాంతములై శుభ ఫలము నిచ్చును. గాయత్రీ జప పరాయణుడగు బ్రాహ్మణుని ఘోర రాక్షసులుగూడ ఆక్రమించజాలవు. సంధ్యావందనమును సకాలములో చేయు బ్రాహ్మణుడు జ్వలించు అగ్నితో సమానుడగును. అధ్యాపన-యాజన- ప్రతిగ్రహముల వలన కలుగు దోషము లెవ్వియు నట్టి వానినంటవు. మంచిగా వేదము చదువని వాడైనను, చదివిన వాడైనను, ఉత్తమ సంస్కారయుక్తులైనను, సంస్కారహీనులైనను బ్రాహ్మణులను అవమానించగూడదు. ఎందుకనగా వారు నివురుగప్పిన నిప్పువలె నుందురు. శ్మశానములో నున్నదైనను అగ్ని సదా పవిత్రమైనట్లే, విద్వాంసుడైనను, అవిద్వాంసుడైనను బ్రాహ్మణుని దేవునితో సమానముగా భావించవలెను. బ్రాహ్మణోత్తములు లేని నగరములు, ఎన్నికోటలు, గోపురములు, సౌధములున్నను శోభించవు. రాజా ! వేదజ్ఞులు, సదాచార సంపన్నులు, జ్ఞానులు, తపశ్శాలురునగు బ్రాహ్మణులు నివసించు నగరమునే, నగరమందురు. అది గోశాలగాని, అడవిగాని, అచ్చట సకలశాస్త్ర వేత్తలగు బ్రాహ్మణులు నివసించియున్నచో అట్టి స్థానమును 'పట్టణము, పుణ్యక్షేత్రము' అని తలచెదరు. ప్రజారక్షకుడగు రాజును సేవించియు తపస్వియగు బ్రాహ్మణుని పూజించియు మనుష్యులు తత్కాలమునందే సర్వపాప విముక్తులగుదురు.

"రాజా! గంగాది పుణ్యతీర్థములందు స్నానము చేయుట, పవిత్ర మంత్రములను జపించుట, సజ్జనులతో సంభాషించుట" ఈ మూడును ఉత్తమ కర్మలని విద్వాంసులు చెప్పుదురు. సజ్జన సాంగత్యముద్వారా పవిత్రమగు సద్వచన జాలముచేత భూషితుడగు వాడు ఎల్లప్పటికిని తాను పవిత్రుడ ననియే భావించవలెను. "త్రిదండ (మూడుకఱ్ఱలు ఒకటిగా కట్టబడి యతులు ధరించుదండము) ధరించుట, మౌనమువహించుట, జడలు ధరించుట, శిరోముండనము చేయించుకొనుట, నార చీరలు-చర్మములు వస్త్రములుగా ధరించుట, నియమాచరణము చేయుట, స్నానము హోమము వనవాసము చేసి శరీరమును కృశింప జేయుట" ఈ మొదలగునవి భావ శుద్ధిలేనిచో వ్యర్థములు. రాజా! కన్నులు మొదలగు నింద్రియములను నిగ్రహించి తత్తద్విషయములగు రూపాదులను అనుభవించనంత మాత్రమున ఉపయోగము లేదు. ఎందుకనగా మనస్సు అతి వికారమైనది. బహిరింద్రియములు పని చేయకున్నను మనస్సు సర్వదా ఆయా విషయములందు ఆకర్షింప బడియుండును. గనుక అన్నిటికన్న భావ శుద్ధి, మనశ్శుద్ధి, గలిగి యుండుట ముఖ్యము.

"రాజా! మనస్సు, వాక్కు, కర్మలు, బుద్ధి, వీని చేత పాపము చేయనట్టి మహాత్ములే తపస్వు లనబడుదురు. కాని, శరీరమును నియమాదులచేత శుష్కింప జేసినంత మాత్రమున తపస్వులు కాజాలరు. వ్రతోపవాసాదులచేత శరీరమును పరిశుద్ధము చేసికొని, పాపకర్మలు చేయక యుండికూడ, తన కుటుంబ జనులయందు దయలేనివాడు తన తపస్సులన్నియు నశింపజేసిన వాడగును. కేవలము భోజనము చేయనంత మాత్రమున తపస్వి కాజాలడు సుమా! సర్వదా ఇంటిలోనే కూర్చొని యుండికూడ పవిత్ర భావముతో నుండి సద్గుణములు గలవాడై, జీవితమంతయు సర్వ ప్రాణులయందు దయగలవాడై యెవడు ఉండునో అట్టివానిని మునిగానే భావించవలెను. అతనికి యే పాపములు ఉండవు.

"రాజా! ఉపవాసములు చేసినంత మాత్రమున పాపములు క్షీణములు కాజాలవు. వానిచేత శరీర పోషకములగు రక్త మాంసాదులు క్షీణించి దేహము కృశించును. అశాస్త్రీయములగు కర్మలు చేయుటచేత క్లేశము మాత్రము కలుగునుగాని అవి పాపములను నశింపజేయ జాలవు. భావశుద్ధి అనగా శ్రద్ధ లేనివాని కర్మలను యజ్ఞాదులు నశింప జేయజాలవు గదా! మానవుడు తాను చేసిన పుణ్య కర్మలవలననే సద్గతిని పొందును. భావశుద్ధిచేత నిష్కామముగా చేయునుపవాసాది కర్మలుగూడ మనశ్శుద్ధిని చేకూర్చును. భావశుద్ధి లేకుండ కేవలము ఫలములను తినుచు, మౌనమును వహించుచు, వాయు భక్షణము చేయుచు, శిరోముండనము చేయించుకొని, గుడిసెలో నివసించుచు, జడలు ధరించి నేల పైన నిద్రించుచు, ప్రతిదినము ఆహారము లేకుండి, యజ్ఞములను చేయుచు, పుణ్య నదీజల స్నానములు చేయుచుండి నంత మాత్రమున పరిశుద్ధుడు కాజాలడు. అతనికి పుణ్యలోకములు సిద్ధించవు. తత్త్వజ్ఞానముచేతనైనను సత్కర్మాచరణము చేతనైనను మానవుడు జరామరణములను, మృత్యువును జయించి, సర్వరోగములను నశింపజేసి సద్గతిని పొందగలడు. అగ్నిలో తప్తములైన విత్తనములు తిరుగ నాటినచో మొలవ నట్లే, జ్ఞానాగ్నిచేత దహింపబడిన సంసార క్లేశములు తిరుగ ఆత్మతో సంయోగమును చెందవు. జీవుడు విడిపోయిన పిదప శరీరము కట్టెవలె, గోడవలె జడమై సముద్రములోని నురుగువలె నశించి పోవును.

"రాజా! శ్లోకము చేతగాని, శ్లోకార్థము చేతగాని, సర్వప్రాణి హృదయాంతరాళము అందు నివసించియున్న పరమాత్మ నెవడు తెలిసికొనునో అట్టివాడు సర్వ శాస్త్రములు చదివిన ప్రయోజనమును పొందగలడు. 'రామ శివ కృష్ణ తత్త్వ' అను రెండక్షరముల శబ్దముల జ్ఞానము గలవారు గాని గ్రంథ సహస్రముల జ్ఞానముగలవారుగాని తెలిసికొను పరమాత్మ ఒక్కడే. ఇరువురును జ్ఞానులే యగుదురు. సంశయాత్ములకు ఈ లోకములో గాని పరలోకములో గాని సుఖము లభించదు. 'జ్ఞానమొక్కటే మోక్షము' అని నిస్సందేహముగా తెలిసికొన వలెను. ఎప్పుడు వేదవిదుడు వేదముల ప్రయోజనము కర్మాచరణమే అని తెలిసికొనునో అప్పుడే అతడు సమస్త వేదములను దావానలమును విడుచు నట్లు విడిచి వానికి దూరమై జ్ఞానోపార్జన చేయును.

(సశేషము)

బడుగు వర్గాల అభ్యున్నతి

—వి. బండారు

స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశంలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను చాలా వరకు స్వచ్ఛంద సేవా సంస్థలు, మానవతా సంస్థలు చేపట్టుతుండేవి. స్వాతంత్ర్యం వచ్చాక యిటువంటి సేవా కార్యక్రమాలను లోగడకన్నా ఎక్కువగా ప్రభుత్వం చేపట్టుతోంది.

రెండు పుష్కరాలకు ముందు స్వరాజ్యం సంపాదించుకున్నాకనే మనం కొన్నికొత్త జాతీయ లక్ష్యాలను ఏర్పరచుకున్నాం. తదనుగుణంగానే బలహీనవర్గాల సంక్షేమం అనేది ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రధానమైనదైంది.

భారత రాజ్యాంగంలో నిర్దేశించబడిన ఆదేశిక సూత్రాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలహీన వర్గాలవారిని సమాజంలోని యితర అభివృద్ధి చెందిన వర్గాల సరసనే సమస్థాయిలో నిలపడానికై బలహీన వర్గాల అభ్యుదయానికి అనేక పథకాలను రూపొందించి అమలు పరుస్తున్నాయి

యాభై లక్షల షెడ్యూలు కులాలవారి ఉద్ధరణకు, ఆర్థికంగా వెనుకబడ్డ తరగతులుగా పేర్కొనబడుతున్న అసంఖ్యాక బడుగు వర్గ జనావళి సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా విశేషంగా కృషి చేస్తోంది.

1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుంచి గతఏడాది వరకు సాంఘికసంక్షేమ పథకాల క్రింద రూ. 44 కోట్లు ఖర్చుపెట్టబడ్డాయి. ఈ మొత్తంలో నాలుగింట మూడొంతులు హరిజన సంక్షేమానికే ఖర్చు చేయబడింది. బడుగు వర్గాల ఉద్ధరణ కార్యక్రమాల్లో ఎక్కువగా విద్యాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్య వైద్య సౌకర్యాల కల్పనకు, ఉపాధి సౌకర్యాన్ని కల్పించడానికి అధిక ప్రాధాన్యం యిస్తున్నారు.

ప్రజలలోని ఏవర్గం వారి వెనుకబడినతనమైనా పోగొట్టడంలో విద్య ప్రధాన పాత్రవహిస్తుంది. షెడ్యూలు కులాలు, ఆర్థికంగా వెనుకబడిన యితర తరగతులలో విద్యావ్యాప్తిని విస్తృతపరచే నిమిత్తం ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి విద్యావకాశాలను ఎంతగానో అధికం చేస్తోంది.

పాఠశాలల్లోను కళాశాలల్లోను షెడ్యూలు తరగతుల విద్యార్థులు కట్టవలసిన ఫీజుల్లో ఎన్నో రాయితీలు కల్పించబడుతున్నాయి. విద్యాసంస్థలన్నిటిలో యీ వర్గంవారికి కొన్ని సీట్లు ప్రత్యేకించబడుతున్నాయి. చదువుకోడానికిగాను అన్ని కోర్సులలోనూ యీ వర్గాలవారికి ఉపకార వేతనాలు యివ్వబడుతున్నాయి. అన్ని స్థాయిల్లోనూ ఉచిత వసతి సౌకర్యాలు కల్పించబడుతున్నాయి.

ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు కూడా ఫీజులో రాయితీ సౌకర్యం, ఉపకారవేతనాలు పొందే సౌకర్యం, ఉచిత వసతి సౌకర్యం లభిస్తోంది.

పిల్లలచదువులు తల్లిదండ్రుల మీద ఆర్థిక భారాన్ని కలిగించకుండా, వారి చదువు నిరాఘాటంగా కొనసాగడానికి ఉపకారవేతనాలు చాలా తోడ్పడతాయి. ముఖ్యంగా షెడ్యూలు కులాలవారికి, ఇతర బలహీన వర్గాల వారికి యీ ఉపకారవేతనాలు విశేషంగా తోడ్పడతాయి. ఎందుకంటే ఈ వర్గాలవారి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే వుండడంచేత ఉపకారవేతనాలుంటేగాని తమ చదువును కొనసాగించుకోవడం వీరికి సాధ్యం కాదు. అందువల్ల ప్రభుత్వం యిటువంటి అడుగు పొరజీవుల విజ్ఞానాభివృద్ధికి ఉదారంగా ఉపకార వేతనాలను అందజేస్తోంది. అన్ని రకాల చదువులకు ఈ విధమైన సౌకర్యం కల్పిస్తోంది.

ప్రభుత్వం గుర్తించిన వసతిగృహాలలో వుంటున్నవారికి "రెసిడెన్షియల్" స్కాలర్‌షిప్పులు మంజూరు చేయబడుతున్నాయి. తల్లిదండ్రులవద్దవుండి చదువుకుంటున్న విద్యార్థులకు "నాన్ రెసిడెన్షియల్" స్కాలర్‌షిప్పులు యివ్వబడుతున్నాయి.

సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరు మంజూరుచేసే ఉపకార వేతనాలు ప్రధానంగా రెండు రకాలు. ఒకటి—భారత ప్రభుత్వ ఉపకారవేతనాలు. రెండు—రాష్ట్ర ప్రభుత్వ ఉపకారవేతనాలు. మెట్రిక్ తర్వాత చదివే కోర్సులకు మాత్రమే భారత ప్రభుత్వ ఉపకారవేతనాలు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం యిచ్చే ఉపకార వేతనాలు మాత్రం మెట్రిక్‌కు ముందుచదువులకు, ఆతర్వాత చదువులకు కూడా లభిస్తాయి.

1970–71లో 17,248 షెడ్యూలు కులాల విద్యార్థులకు భారత ప్రభుత్వ ఉపకార వేతనం లభించింది. ఈ ఉపకార వేతనం క్రింద రూ. 61.36 లక్షలుపంపిణీ అయ్యాయి. 521మంది అల్పాదాయ

వర్గాలవారి విద్యార్థులకు కూడా ఉపకార వేతనం క్రింద రూ.3.67 లక్షలు పంపిణీ అయ్యాయి.

1971–72లో భారత ప్రభుత్వ ఉపకారవేతనాల క్రింద షెడ్యూలు కులాల విద్యార్థుల నిమిత్తం రూ. 45.65 లక్షలు, అల్పాదాయ వర్గాల విద్యార్థులకుగాను రూ. 4 లక్షలు కేటాయించబడ్డాయి.

మెట్రిక్‌కన్న తక్కువ చదువులో వున్న 8,536 మంది షెడ్యూలు కులాల విద్యార్థులకు 1970–71లో రూ. 20.90 లక్షలు రాష్ట్ర ప్రభుత్వ ఉపకారవేతనం క్రింద పంపిణీ అయ్యాయి.

1971–72 సంవత్సరానికిగాను యిందు నిమిత్తం రూ39.66 లక్షలు కేటాయించబడ్డాయి.

1970–71లో 11,654 మంది హరిజన క్రైస్తవ విద్యార్థులకు రూ. 25.10 లక్షలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రూ. 70.29 లక్షలు రాష్ట్ర ప్రభుత్వ ఉపకారవేతనాలుగా మంజూరుచేయబడ్డాయి. 1971–72కు గాను ఈ పద్దు క్రింద వరుసగా రూ. 26.30 లక్షలు రూ. 100 లక్షలు కేటాయించబడ్డాయి.

మెట్రిక్ పూర్వతరగతులవారికిచ్చే "నాన్ రెసిడెన్షియల్" స్కాలర్‌షిప్పులను జిల్లా కలెక్టర్లు మంజూరు చేస్తారు. ఇందుకుగాను 1970–71 లో రూ. 35 లక్షలు ఆయా జిల్లాలకు పంపిణీ చేయబడ్డాయి. 71–72 లో యీ పద్దు క్రింద రూ. 38.62 లక్షలు కేటాయించ బడ్డాయి.

వసతి సౌకర్యాలు

విద్యార్థి విజ్ఞానార్జనలో వసతి గృహాలు వహించే పాత్రను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సాధారణంగా షెడ్యూలు కులాల ప్రజలు చాలా పేదవారు. అటువంటివారు తమ పిల్లలను పాఠశాలలకు, కళాశాలలకు పంపించి చదివించాలంటే చాలా కష్టం. పిల్లలకు ఉచిత వసతి సౌకర్యం లభిస్తేగాని వారు తమ పిల్లలను చదువుకోవడానికి పంపించరు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని ప్రాథమిక పాఠశాల స్థాయి మొదలుకొని కాలేజీ స్థాయివరకు షెడ్యూలు కులాల, ఇతర ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాల విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించే చర్యలు తీసుకోవడం జరిగింది.

సాంఘిక సంక్షేమ శాఖ కొన్ని వసతి గృహాలను నెలకొల్పి పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే వాటిని నిర్వహిస్తోంది. వీటిని ప్రభుత్వ వసతి గృహాలని అంటారు. ప్రస్తుతం ఇటువంటి వసతి గృహాలు షెడ్యూలు కులాలవారి నిమిత్తం 407 వున్నాయి. వీటన్నిటిలో కలిపి 20,020 మంది వుంటున్నారు. ఇవికాక వెనుకబడిన తరగతుల వారి నిమిత్తం 43 వసతి గృహాలున్నాయి. వీటిలో 2,294 మంది విద్యార్థులు వుంటున్నారు.

ఈ షెడ్యూలు కులాల, వెనుకబడిన తరగతుల ప్రభుత్వ వసతి గృహాలను నిర్వహించడానికిగాను 1970–71 లో వరుసగ రు. 72.45 లక్షలు రు. 876 లక్షల మొత్తాలను జిల్లా పరిషత్తులకు మంజూరు చేయడం జరిగింది. 1971–72 కుగాను రు 87 లక్షలు, రు 11.33 లక్షలు కేటాయించబడ్డాయి.

సంఘ సేవకులు, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు నడిపే వసతి గృహాలను సాంఘిక సంక్షేమ శాఖ గుర్తించి, వాటికి కూడా సబ్సిడీలను యిస్తుంది. వీటిని సబ్సిడీ పొందిన వసతి గృహాలు అంటారు.

ప్రస్తుతంఇటువంటి సబ్సిడీ పొందిన వసతి గృహాలు షెడ్యూలు కులాల వారి నిమిత్తం 796 వున్నాయి. వీటిలో 28,766 మంది విద్యార్థులు వుంటున్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థుల నిమిత్తం మరో 161 వసతి గృహాలు వున్నాయి. వీటిలో 6,570 మంది వుంటున్నారు. ఇందుకుగాను 1970–71 లో వరుసగా రూ 94.84 లక్షలు రు 19.04 లక్షలు జిల్లా పరిషత్తులకు అందజేయబడ్డాయి. 1971–72 లో పంపిణీ నిమిత్తం షెడ్యూలు కులాల విద్యార్థుల వసతి గృహాలకుగాను 76.10 లక్షలు, వెనుకబడిన వర్గాల విద్యార్థుల వసతి గృహాల నిమిత్తం రూ 19.71 లక్షలు కేటాయించబడ్డాయి.

సమాజంలోని బలహీన వర్గాల విద్యార్థులకు వసతి సౌకర్యం నిమిత్తం ప్రభుత్వం దాదాపు రెండు కోట్ల రూపాయల్ని ఏటా ఖర్చు పెడుతోంది.

సాంఘిక సంక్షేమ పాఠశాలలు

మన రాష్ట్రంలో ప్రత్యేకంగా షెడ్యూలు కులాల విద్యార్థుల నిమిత్తం 529 ఎలిమెంటరీ పాఠశాలలు వున్నాయి. ఇవన్నీ హరిజన వాడలలోనే వున్నాయి. హరిజన వాడల్లో ఈ విధమైన పాఠశాలలు నెలకొల్పడం యీ పథకం యొక్క ముఖ్యోద్దేశం. ఇందువల్ల ఎక్కువ మంది హరిజన బాల బాలికలు చదువుకోడానికి ముందుకు రావచ్చు. ఈ పాఠశాలల్లో 30,000 కు పైగా హరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఈ సంస్థలను నడపడానికై 1970–71 లో రూ. 20 లక్షలు ఖర్చు చేయడం జరిగింది. 1971–72 లో రూ. 18.50 లక్షలు ఇందుకు కేటాయించారు. హరిజన బాల బాలికలను ఆకర్షించే వుద్దేశంతో యీ పాఠశాలలో "కేర్" సంస్థవారి మధ్యాహ్న భోజన సౌకర్యంకూడా కల్పించ బడుతుంది. ప్రభుత్వం రవాణా ఖర్చులు, ఇతర చిల్లర ఖర్చులను మాత్రమే భరిస్తుంది. 1971–72 లో మధ్యాహ్న భోజనాన్ని అందజేయడానికై రూ. 7.69 లక్షలు కేటాయించబడ్డాయి.

దారిద్ర్యం కారణంగా షెడ్యూలు కులాలవారు తమ పిల్లల చదువుకు కావలసిన పలకా బలపాలు, పుస్తకాలు, పెన్సిళ్ళుతదితర స్టేషనరీ సామాను, వస్త్రాలు మొదలైనవి యివ్వగల స్థితిలో లేరు. అందువల్లనే వారు తమ బిడ్డలను పాఠశాలలకు పంపించాలన్నా, చదువును కొనసాగించాలన్నా వెనుకంజ వేస్తుంటారు. ఇటువంటి సందర్భాలలో యీ సౌకర్యాలను ప్రభుత్వమే కల్పించిననాడు చాలామంది షెడ్యూలు కులాలవారు తమబిడ్డల చదువు సంధ్యలకు

అడ్డు చెప్పరు. ఈ సత్యాన్ని గ్రహించి ప్రభుత్వం షెడ్యూలు కులాల పిల్లలకు కావలసిన స్టేషనరీ సామాను, జాతీయం చేయబడిన పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేస్తోంది. వీరికి కావలసిన సౌకర్యాలు యించుమించు అన్నిటినీ వివిధ విద్యాపథకాల ద్వారా ప్రభుత్వం భరిస్తోంది.

శిక్షణ కేంద్రాలు

పంట భూమి పరిమితంగా వుండడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ప్రజలందరికీ వ్యవసాయం మీదనే ఉపాధి లభించడం సాధ్యంకాదు. అందువల్ల గ్రామీణ ప్రజల్లో కొందరిని వ్యవసాయ వృత్తుల నుంచి పారిశ్రామిక వృత్తుల వైపు మళ్ళించడం చాలా అవసరం. తోళ్ళపని, నేత, వడ్రంగం మొదలైన వృత్తులలో శిక్షణ యివ్వడం వల్ల వ్యవసాయ వృత్తులలో నిరుద్యోగానికి తావుండదు. ఈ ఉద్దేశంతోనే యీనాడు చాలా మంది షెడ్యూలు కులాల వారికి యిటువంటి వృత్తులలో శిక్షణ కల్పించబడుతున్నది.

షెడ్యూలు కులాల వారికి వారి వృత్తులలో నైపుణ్యం కల్పించాలనే దృష్టితో శిక్షణ-ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించబడ్డాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో అటువంటి కేంద్రాలు 27 వున్నాయి. వీటిలో 600 మంది శిక్షణ పొందుతున్నారు. వీటిని సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహిస్తోంది.

ఈ వృత్తులలో షెడ్యూలు కులాల వారికి ఒక ఏడాది పాటు శిక్షణ యిస్తారు. శిక్షణ కాలంలో స్టైపెండు కూడా యివ్వబడుతోంది. శిక్షణ పొందిన అనంతరం వారికి అవసరమైన వృత్తిపరికరాలను కూడా అందజేయడం జరుగుతుంది. అందువల్ల వారు శిక్షణానంతరం ఆయా వృత్తులలో స్థిరపడి తమ జీవన భృత్యాన్ని సంపాదించుకోగలుగుతారు.

ఈ విధమైన కేంద్రాలను నిర్వహించడానికై 1970-71 లో జిల్లాపరిషత్తులకు రూ. 6 లక్షలు మంజూరు చేయడం జరిగింది. 1971-72 లో యిందుకుగాను రూ. 5.44 లక్షలు కేటాయించబడ్డాయి.

ఇళ్ళ స్థలాలు

సాంఘిక జీవితంలో లోగడ హరిజనులను వెలివేసిన కారణంగానూ, వారి ఆర్థిక స్థితిగతులు దయనీయ స్థితిలో వుండి దారిద్ర్యానికి ఎరకావటం చేతనూ హరిజనులు ప్రత్యేకమైన గూడెంలలోనూ, ప్రత్యేకమైన ప్రాంతాలలోనూ నివసించవలసి వచ్చేది. ఈ ప్రాంతాలలో క్రిక్కిరిసిన యిళ్ళమధ్య, సరియైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేనిచోట నివసించవలసి వచ్చేది. ఈ స్థితినుంచి వీరికి విమోచనం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కొన్నేళ్ళుగా కొన్ని పథకాలను రూపొందించి అమలు జరుపుతున్నది. వీరికి ఆరోగ్య పారిశుద్ధ్య సౌకర్యాలు, గృహవసతి సౌకర్యం కల్పించే పథకాలను పెద్దఎత్తున ప్రభుత్వం చేపట్టింది. స్వంతఇళ్ళులేని పేద హరిజనులకు ఉచితంగా ఇళ్ళ స్థలాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. మెట్టప్రాంతంలో అయితే కుటుంబానికి 5 సెంట్లు చొప్పున, పల్లపు ప్రాంతంలో అయితే కుటుంబానికి 3 సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ళస్థలాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

ఇళ్ళ స్థలాల్ని యివ్వడమే కాదు, అలాయిచ్చిన యిళ్ళ స్థలాలవారికి ఇళ్లు నిర్మించుకోడానికి ప్రోత్సాహాన్నిచ్చే నిమిత్తం కుటుంబానికి రూ 100 చొప్పున నగదు కూడా అందజేయడం జరుగుతోంది. ఇళ్ళ స్థలాల్లో 25 శాతం స్థలాలు ఆర్థికంగా వెనుకబడినవారి నిమిత్తం ప్రత్యేకించబడ్డాయి. ఇందువల్ల ఇతర వర్గాలవారు కూడా హరిజనులతో నివసించడానికి, సాంఘిక సమైక్యత వర్ధిల్లడానికి వీలు ఏర్పడుతుంది.

ప్రజారోగ్యం

చాలా ప్రాంతాలలో షెడ్యూలు కులాల వారికి మంచినీటి బావులు, రోడ్లు, డ్రైనేజీవంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. హరిజనవాడల్ని అసలు గ్రామాలతో కలిపేదార్లు లేవు. సాంఘిక సంక్షేమ శాఖ యీ సౌకర్యాలను పంచాయతీరాజ్ సంస్థల ద్వారా షెడ్యూలు కులాలవారికి కల్పిస్తోంది.

గ్రామగ్రామాల్లో వాడవాడల్లో అస్పృశ్యతా ప్రచారం జరిపే నిమిత్తం డైరెక్టరేట్‌లో ఒక ప్రత్యేక విభాగం వుంది. దీనిద్వారా రాష్ట్రస్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు, వెనుకబడిన షెడ్యూలు తెగల, షెడ్యూలు కులాల కళాకారుల సన్మానం, కళాశాల, హైస్కూలు స్థాయిల్లో విద్యార్థులకు వక్తృత్వ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం గత ఏడాదినుంచే ప్రారంభించబడింది. అస్పృశ్యతా నివారణకు పాటుపడే స్వచ్ఛంద సంస్థలకు ఆర్థికంగా సహాయ పడతారు. పత్రికల ద్వారా అస్పృశ్యతా నివారణకు ప్రకటనలిచ్చి ప్రచారం చేస్తుంటారు.

బలహీన వర్గాల సముద్ధరణ ఈ పథకాలన్నిటి ప్రధానలక్ష్యం— బలహీన వర్గాల స్థాయిని సమాజంలోని యితర వర్గాల స్థాయికి తీసుకొచ్చి, సామాజిక జీవన స్రవంతిలో అందరితోను సమానంగా బలహీన వర్గాలవారూ కలగలిసి కదిలేందుకు ప్రయత్నించడమే. ఇంతవరకూ యీ దిశగా తీసుకున్న చర్యలు సత్ఫలితాల్ని యిస్తున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈనాడు షెడ్యూలు కులాలు, తదితర బలహీన వర్గాలలో చదువుకునే వారి సంఖ్య బాగా అభివృద్ధి చెందింది. వారి ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగయ్యాయి. ఆరోగ్య గృహవసతి సౌకర్యాలు పెరిగాయి. జీవన సరళిలో మార్పు వచ్చింది. సాంఘిక గౌరవ ప్రతిపత్తి లభించింది.

స్వాతంత్ర్యానంతరం పంచవర్ష ప్రణాళికలు చేపట్టినతర్వాత యీ వర్గాలవారి సముద్ధరణకు గట్టిగా కృషి జరిగి అన్ని రంగాలలోనూ ప్రగతి సాధించబడినా ఇంకా చేయవలసిన కృషి ఎంతో వుంది. అందుకు ప్రభుత్వమే కాక స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజల కృషికూడా కావాలి. అనాడే గాంధీజీ కలలుగన్న రామరాజ్యమూ, సమసమాజ స్థాపనా సాధ్యమౌతుంది.

*


త్రివిధ మార్గాలకు సంగమం - రామతీర్థం

కె. కాశీపతిరావు

విశాఖపట్టణం జిల్లాలో విజయనగరానికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఈశాన్యంగా ఉంది రామతీర్థం. విజయనగరం నుండి శ్రీకాకుళం వెళ్ళే బస్సులు కొన్ని రామతీర్థం మీదుగా వెళ్తాయి. మధ్యలో చంపావతీ నది పొంగి పొర్లుతూ వుంటే ఏమో చెప్పలేం గానీ, లేకపోతే రామతీర్థం వెళ్ళడం పెద్ద కష్టమేమీ కాదు.

శ్రీరామచంద్ర మూర్తి ఈ రామతీర్థంలో వెలసి వున్నాడు. ఇది చాలా కాలంగా పుణ్యక్షేత్రంగా విలసిల్లుతూ వుందనటానికి సందేహం లేదు. మొదటి విక్రమేంద్రవర్మ పుత్రుడైన ఇంద్ర భట్టారక వర్మ క్రీ.శ. 469–496 మధ్య కాలంలో రాజ్యపాలన చేస్తుండినట్లు. ఆయన "రామతీర్థ శాసనము" అనే శాసనాన్ని చేసినట్లు కీ. శే. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారు "విష్ణుకుండి మూడవ మాధవ వర్మ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక" అనే తమ వ్యాసంలో పేర్కొన్నారు. మాధవ వర్మ రాజ్యం విశాఖ జిల్లా వరకూ వ్యాపించి వున్నదనటానికి ఆధారాలున్నాయి. ఆ శాసనంలోని రామతీర్థం, ప్రస్తుతం చెప్పబడుతూన్న రామతీర్థం ఒక్కటే అనడానికి ఏమాత్రం సందేహంలేదు. కాబట్టి క్రీస్తు శకం ఐదవ శతాబ్దానికే ఈ పుణ్యక్షేత్రం ఈ ప్రాంతంలో ఉంది.

అన్ని పుణ్యక్షేత్రాలకు లాగానే రామతీర్థానికి కూడా స్థల పురాణం ఒకటుంది. పాండవులు అరణ్యవాసం చేస్తూ ఈ ప్రాంతారణ్యాల లోనికి వచ్చేరనీ, శ్రీకృష్ణుని విడిచి ఉండలేక ఆ పరమాత్ముని ప్రార్థిస్తే శ్రీరామచంద్రమూర్తిగా ఇక్కడ వెలసేడనీ, అందుకు సంతోషించి పాండవులిక్కడనే ఆలయమును నిర్మింపజేసి, విగ్రహ ప్రతిష్ఠచేసి కొలిచేవారనీ చెప్పుకుంటారు. ఆ తరువాత వేదగర్భుడనేవాడు వంద సంవత్సరాలపాటు ఈ స్వామిని సేవించేడని, అతని తర్వాతి కాలంలో ఈ విగ్రహాలు భూగర్భంలోకి వెళ్ళిపోయేయనికూడా అంటారు. తర్వాత రామతీర్థానికి దగ్గరిలోనే వున్న కుమిలి అనేవూరినుండి ఒక మూగది, పుల్లలు ఏరుకొనటానికి ఇక్కడికి వచ్చి గాలి వానలో చిక్కి, శ్రీరామచంద్ర మూర్తిని ప్రార్థిస్తే, అతడు సాక్షాత్కరించి మూగతనమును పోగొట్టి, ఆమెవూరు చేర్చి, మహారాజా వారికి ఈ సంగతిచెప్పమని ఆదేశించాడనీ, ఆమె ఆ మహారాజా కీసంగతి చెప్పగా ఈ దేవాలయాన్ని పునరుద్ధరించేడని చెప్పుతారు. ఆ మహా



శ్రీరామచంద్రమూర్తి ఆలయ ప్రవేశద్వారం

రాజే 1656–1698 మధ్యకాలంలో కుంభిణా పురాన్ని పాలించిన శ్రీ సీతారామచంద్ర మహారాజులని ఈ స్థలపురాణంలో చెప్పబడింది.


దేవాలయానికి దక్షిణంగా, దానినానుకునే "భాస్కరసరస్సు" అనే పేరుగల కోనేరుంది. స్వామిని దర్శించుకునే ముందు భక్తులిక్కడ స్నానాదులాచరిస్తారు. దీని కారణంగానే ఈ పుణ్యక్షేత్రం పుణ్యతీర్థం కూడా అయింది. ఇప్పటికీ ఈ వూరిలో ప్రజలందరికీ భాస్కర సరస్సు నీటివసతి కల్పిస్తోంది.

దేవాలయానికి ఉత్తరంగా "రామతీర్థంకొండ" ఉంది. కొండమీద కూడా కోవెల ఉంది. అయితే అదిమాత్రం వాడుకలో లేదు. కాని రామతీర్థంలో శ్రీరామ చంద్ర మూర్తిని దర్శించటానికి వచ్చేవారందరూ, ఈ కొండ ఎక్కుతుంటారు. ఈ కొండమీద సీతమ్మవారి పాదములు, భీముని ఇరుకురాయి, పాండవుల పంచలు మొదలైన చిహ్నాలున్నాయని ప్రజలు నమ్ముతారు.

ప్రతియేటా శివరాత్రినాడు రామతీర్థంలో పెద్ద జాతర జరుగుతుంది. శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి మొదలైన పండుగలున్నా ఈ వైష్ణవక్షేత్రంలో శివరాత్రి ఎక్కువ ప్రాముఖ్యం

వహిస్తుంది. చుట్టుప్రక్కల గ్రామాల నుండి నాటు బళ్ళమీదనూ, బస్సులమీదనూ అసంఖ్యాకంగా జనం ఈ పండగను ఈ పుణ్యక్షేత్రంలో చేసుకోవడానికి చేరుకుంటారు. శివరాత్రినాటి సాయం కాలం నుండి మళ్ళా తెల్లవారే వరకూ విజయనగరం నుండి ప్రత్యేకమైన బస్సులు తిరుగుతాయి. ఆ రాత్రంతా వచ్చే పోయే వాళ్ళతోనూ, జాగరణ చేస్తూన్న వాళ్ళతోనూ, మొక్కులు తీర్చుకునే వాళ్ళతోనూ కోలాహలంగా ఉంటుంది ఈ ప్రాంతం. దేవాలయ ప్రాంగణంలోనూ, కొండపాదంలోనూ, కొండమీదా ఎక్కడ చూసినా జనసందోహం వుంటుంది. బళ్ళు బారులు తీర్చి నిలబెట్టి, బళ్ళక్రిందనే వంటలవీ చేసుకొని ఆ రోజంతా అక్కడే గడుపుతారు పొరుగూరు నుండి వచ్చిన జనం.

శివరాత్రేమో శైవ మతస్థులకు పట్టు, పుణ్యతీర్థమా అంటే వైష్ణవ మతస్థుల కాటపట్టు. అక్కడ ఈ పండుగకు సంబంధించేయడంలో విశేషమేమిటని అడిగితే ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు. ఇది తరతరాల నుండి వస్తున్న సంప్రదాయం. బహుశా శివకేశవులకు అభేదం చెప్పడమే ఈ సంప్రదాయం యొక్క తాత్పర్యమేమో!



కొండమీద బౌద్ధవిహార ప్రాకార శిథిలాలు

రామ తీర్థానికి వెనుక వైపున దీని నానుకునే మరో కొండ వుంది. దీన్నే గనికొండ అంటారు. ఈ కొండ ఒకప్పుడు బౌద్ధ మతానికి ఆలంబనగా వుండేది. బౌద్ధ మతం ఆంధ్రదేశాన్ని తన ప్రభావంతో ముంచెత్తిన రోజుల్లో ఆంధ్రదేశం నాలుగు చెరగులా బౌద్ధ క్షేత్రాలు వెలసాయి. బౌద్ధ నిర్మాణాలు తలెత్తాయి. అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, గోలి, భట్టిప్రోలు, గుమ్మడిదురు, ఘంటసాల మొదలైన బౌద్ధ క్షేత్రాలు తలెత్తి విశ్వ విఖ్యాతిగాంచాయి. అటు ఆంధ్రదేశంలో ఉత్తరంగా కూడా అనేక బౌద్ధ క్షేత్రాలు వెలసి బౌద్ధ మతాన్ని ప్రచారం చేసాయి. బొజ్జన్నకొండ, గని కొండ, శాలిహుండం మొదలైన ప్రాంతాలు ఈ నాడు నామమాత్రాలుగా మిగిలిపోయినా ఒకనాడు సుప్రసిద్ధ బౌద్ధ కేంద్రాలుగా ప్రఖ్యాతి చెందాయి. ఈ నాటికీ ఈ ప్రాంతాలలో బౌద్ధ నిర్మాణాల తాలూకు శిథిలాలు పురావైభవాన్ని చాటి చెప్తుంటాయి.

గనికొండలోకూడా తొల్లిటి వైభవోజ్జ్వల చరిత్రని చాటి చెప్పే బౌద్ధ శిథిలాలు చాలా వున్నాయి. బహుశా యిది శాతవాహనుల కాలానికి చెందినదని పరిశీలకుల అభిప్రాయం. శాతవాహనులు హిందూ మతావలంబకులైనప్పటికీ బౌద్ధ మతాన్ని అభిమానించారు. కొందరు రాజులు బౌద్ధ మతాన్ని అవలంబించి ఆ మత వ్యాప్తికి బహు విధాలుగా కృషి చేసారు. శాతవాహనుల కాలంనాడే ఆంధ్ర దేశంలో అనేక బౌద్ధ క్షేత్రాలు వెలిసాయి. గనికొండ చరిత్ర కూడా అప్పటిదే కావచ్చు.

కొండ పాదం నుంచి కొండ మీదికి రాతి మెట్లు వున్నాయి. ఈ కొండ చాలా ఎత్తైనది కావడం వల్ల కొండమీదికి చేరడానికి సుమారు అర్ధగంట పడుతుంది. కొండపైన సమతల ప్రదేశంలో బౌద్ధ నిర్మాణాలు శిథిలదశలో వున్నాయి. ఇంత ఎత్తునవున్న యీ ప్రాంతాన్ని బౌద్ధ క్షేత్రంగా ఎన్నుకోవడంలో ఒక ప్రత్యేకత వుంది. సమతల ప్రదేశాన్ని ఆనుకొని కోటగోడ మాదిరిగా సుమారు 40అడుగుల ఎత్తున మరోకొండఅంచు నిటారుగా 90డిగ్రీల లెవెల్‌లో ఏర్పడివుంది. ఇలా ఒక గోడ కట్టినట్టుగావున్న స్వాభావికమైన పెద్దరాతిబండ ఒక ఫర్లాంగుదూరం వరకు అలాగే వుండి సమతల ప్రదేశానికి పెద్దపెద్ద గాలులనుండి, వర్షాలనుండి రక్షణను కల్పిస్తూ వుంటుంది. సమతల ప్రదేశం రెండోవైపు లోతైన అగాధంలోకి దిగిపోయి వుంటుంది. అటువైపున అన్నీ కొండలే వుండడంవల్ల సహజసిద్ధమైన ప్రకృతి సౌందర్యానికి కాణాచిగావుంది. అవన్నీ కొండలే కావడంతో జన పదాల సందడి వుండదు. ప్రశాంతమైన వాతావరణం. ప్రకృతి సౌందర్యానికీ, ప్రశాంత వాతావరణానికీ, రక్షణకు అనువైన ప్రదేశం కావడం వల్లనే బౌద్ధులు యిక్కడ యింత ఎత్తున తమ కట్టడాలను నిర్మించుకున్నారు.


గనికొండను బౌద్ధ విహారంగా పేర్కొనవచ్చును. బౌద్ధ భిక్షువులు జన పదాలకు దూరంగా ప్రశాంత వాతావరణ లో ప్రకృతి మాత ఒడిలో బుద్ధ భగవానుణ్ణి కొలుచుకోడానికి యిక్కడ స్థూపాలు, విహారాలు మొదలైనవి నిర్మించుకొని వుండవచ్చు.



గుహలోని పాదపీఠం

ఈ నాటికీ చెక్కుచెదరని స్థితిలో ఒక స్తూపం యిక్కడవుంది. రెండు విహారాలు శిథిలమైపోగా వట్టి ప్రాకారాలు మాత్రమే మిగిలి వున్నాయి. ఫర్లాంగు పొడవు, ముప్పయ్ అడుగుల వెడల్పుగల సమతల ప్రదేశంలో విహారాల కిరువైపులా అనేక గదులువుండే వనడానికి చిహ్నంగా వట్టిపునాదులు మాత్రమే ఈ నాటికీ స్పష్టంగా మిగిలివున్నాయి. ఈ గదుల్లో బౌద్ధ సన్యాసులు నివసించివుండవచ్చు. ఎందుకంటే ఈ పునాది గోడలను బట్టి ఒక్కొక్క గది ఒక్కొక్క వ్యక్తికన్న ఎక్కువమంది ఉండటానికి సరిపోయేదిగా లేదు. ఇటువంటి గదులు వందకు పైగానే యిక్కడ వున్నాయి

కొండపైన ఒకచోట స్వాభావికంగా ఏర్పడిన గుహావుంది. ఈ గుహలో గత పదేళ్ళ క్రితం వరకు కొన్ని శిల్పాలు వుండేవి. గాని వాటిని పురాతత్వశాఖవారు తరలించారని చెప్తారు. ఇప్పుడు అక్కడ పాదపీఠం ఒక్కటేవుంది. దీని మీదవుండిన బుద్ధ విగ్రహాన్ని పురాతత్వశాఖవారు తరలించుకుని వెళ్ళారని స్థానిక ప్రజల భోగట్టా. అది గాక అక్కడ శిథిలావస్థలోవున్న రెండు విహారాలలోనూ మూలల్లో త్రవ్వగా వాసెనలు కట్టిన మట్టి కుండలు లభించాయనీ, వాటిని కూడా పురాతత్వ శాఖవారు తీసుకువెళ్ళి భద్రపరచారని ఇక్కడి ప్రజల ద్వారా తెలిసింది.



గనికొండ మీది స్తూపం

ఇక్కడి స్తూపం సుమారు పది అడుగుల చదరంగా కట్టిన గద్దెమీద నిర్మించబడింది. చుట్టూ ఇటుకలతో ప్రాకారం నిర్మించబడివుంది. ఈగద్దెమీద రాతి పలకలతో వరుసలాకారంగా ఆరు అడుగుల ఎత్తున స్తూపాన్ని నిర్మించారు. దీనివ్యాసం కూడా ఆరడుగులు వుంటుంది.

విహారాదుల పునాదులు మాత్రమే ఇప్పుడున్నాయి. ఆకారంలో ఇది దీర్ఘ చతురస్రంగా వున్నప్పటికీ రెండు పార్శ్వాలు అర్ధచంద్రాకారంలోవుండి కోడి గ్రుడ్డు ఆకారంలో వున్నట్లనిపిస్తాయి. ఇవి పూర్తిగా శిథిలమై పోవడం వలన ఇప్పుడు రెండడుగుల ఎత్తు గద్దెమీద నిలచిన గోడలు మాత్రమే మనం చూడగలం. ఆంధ్ర విశ్వ విద్యాలయ చారిత్రక విభాగంవారు గాని, ప్రభుత్వ పురాతత్వ శాఖవారుగాని విపులంగా త్రవ్వకాలు జరిపితే చాలా విషయాలు వెలుగులోకి రావచ్చు. అటువంటి ప్రయత్నం జరగాల్సిన అవసరం ఎంతయినావుంది.


ఇక ఇక్కడి నిర్మాణాల్లో వుపయోగించిన ఇటుకలు పరిమాణంలో చాలా పెద్దవి. ఇవి 10″ × 10″ × 2½″ సైజులో వున్నాయి. మరికొన్ని యిటుకలు వెడల్పు, మందమూ అంతే వుండి పొడవులో మాత్రం మరో రెండంగుళాలు ఎక్కువగా వున్నాయి. ఇన్ని వందల సంవత్సరాలు నుండీ ఎండావానలకు తట్టుకుని కూడా ఆ యిటుకలు జీర్ణం కాలేదంటే ఆశ్చర్యమే. ఇటుకలు పెద్దవి మాత్రమేకాక రాతిలా గట్టివికూడా.

గనికొండమీద బౌద్ధ విహారాలుండటంచేత, బౌద్ధ విహారాలకు "ఆరామము"లని కూడా అంటారు కాబట్టి, ఇక్కడి గ్రామమునకు "ఆరామ తీర్థము" అనే పేరు వచ్చిందనీ, కాలక్రమేణా అది "రామతీర్థం" అయ్యిందని అంటారు. కాని కీ॥శే॥ కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారి వ్యాసంలోని చారిత్రకాధారాలను బట్టి ఇది తప్పని చెప్పవచ్చును.

ఇది చిన్న గ్రామమే అయినా, బౌద్ధ ప్రాభవమూ, పురాణ వైభవమూ మట్టికొట్టుకు పోతుండినా, ఇక్కడ జిల్లాపరిషత్తువారి ఉన్నత పాఠశాల, దేవస్థానంవారి సంస్కృత పాఠశాల వున్నాయి. శ్రీరామచంద్రమూర్తి దేవాలయం వుండటంచేత వైష్ణవ పరంగాను, శివరాత్రి పండుగనాడిక్కడ సంబరం చేయడాన్నిబట్టి శైవ పరముగాను, గనికొండ మీద బౌద్ధ నిర్మాణాలుండటం వల్ల బౌద్ధ పరంగాను ఈ రామతీర్థం 'త్రివిధ మార్గాలకు సంగమం' అని చెప్పవచ్చు.

పురాతన చిహ్నాలు మన సంస్కృతికి నిదర్శనం
వాటిని రక్షించుకోవడం మన ధర్మం





నగరంలో వార్తా చిత్రాలు


ఎడమవైపు పైన: స్పీకర్ శ్రీ రంగారెడ్డి ఏప్రిల్ 2వ తేదీన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, శాసనమండలి అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు, వగైరా లవారికి అసెంబ్లీలో ఎట్‌హోం ఇచ్చారు.

మధ్య: రాష్ట్రగవర్నరు మార్చి 1వ తేదీన జూబిలీహాలులో జీవిత బీమా సంస్థ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల, ఏజంట్ల సమావేశాన్ని ప్రారంభోత్సవం చేశారు.

క్రింద: లావోస్ నుండి అయిదుగురు సభ్యుల ప్రతినిధివర్గం ఒకటి మార్చి 6న హైదరాబాదు వచ్చింది

కుడివైపు పైన: ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావును ఏప్రిల్ 7న అంతర్జాతీయ పంటల పరిశోధనా సంస్థ మండలి ప్రధానాధికారి శ్రీ రాల్ఫ్ డబ్ల్యు కమింగ్స్ కలుసుకున్నారు.


క్రింద: క్రీడావిషయాల మంత్రి శ్రీ ఎం. ఆర్. [illegible]రావు మార్చి 7వన జాతీయ సైకిల్ ఛాంపియన్‌ను ఫతేమైదాన్ క్లబ్బులో సన్మానించారు.














వార్తా చిత్రాలు


ఎడమవైపు పైన: ఆంధ్రప్రదేశ్ బంగ్లాసంఘంవారు మార్చి 18 న హైదరాబాదులో జరిపిన బంగబంధు జన్మదినోత్సవ సభకు కేంద్ర రేడియో, సమాచార మంత్రి శ్రీమతి నందినీ సత్పతి ప్రారంభోత్సవం జరిపారు.

కుడివైపుపైన: రాష్ట్ర గవర్నరు ఏప్రెల్ 1 న శ్రీ గోపాల్ రావు ఎగ్బోటే చేత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేయించినప్పటి చిత్రం.

మధ్య: రెవిన్యూ బోర్డు ప్రథమ సభ్యుడు శ్రీ ఎన్. భగవాన్‌దాస్ సికిందరాబాదులో నేత సహకార నూలుమిల్లుకు మార్చి 2 న ప్రారంభోత్సవం చేశారు.

ఎడమవైపు క్రింద : శ్రీ భగవాన్ దాస్‌గారు నూలు మిల్లుకు ప్రారంభోత్సవం చేసిన తర్వాత లోపలి దృశ్యాలను తిలకించుట.

కుడివైపు క్రింద : ఫిబ్రవరి 19 న హైదరాబాదు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'ముషాయిరా' జరిగినప్పటి చిత్రం.





వందేమాతరం

ముదిగొండ వీరభద్రమూర్తి

కలకత్తాలో ఆరోజు సురేంద్రనాథ బెనర్జీ ఉపన్యాసము. సాక్షియను కల్పితపాత్ర, మరి యిద్దరు ప్రేక్షకులు సభకు వెళ్ళు చున్నారు. కలకత్తాలోని నాటి ప్రముఖుల పరిచయము.

పరిణత మానవత్వ బ్రహ్మవాహన
ప్రథమంబు ఠక్కురపరమహంస
ప్రథమభారతఖండపట్టభద్రుడు త
ద్విశ్వవిద్యాలయావిష్కృతుండు బ్రి
బ్రిటనుసత్కృతనుత పీతరుచ్యప్రాచ్య
బుధజనప్రథము డా ప్రోలి వెలగు
జాతీయసమితిసంస్థాపనప్రథము వా
గ్ధారాసముల్లాసి తెన్నివాసి

యచటి పులుగుల కిచకిచ లాంగ్లభాష
యచటి వారికి లండ నుద్యానవనము
కాని యిది పల్లెబుడుత చుక్కాని చూచు
దాని చిత్తరువు కలకత్తా యటంచు

సురేంద్రనాథ బెనర్జీ

జాతీయ గోష్ఠి వలీ తల్లజమును గా
శీఘట్టసీమ మొల్పించినాడు
ప్రభుత త్రుంపని యట్లు స్వజనవర్తనమును
గంచెగా చుట్టు కల్పించినాడు
అమృతధారగ నుపన్యాససారము వోసి
బెచ్చెర బెరుగ బోషించినాడు
ఎల్ల రాష్ట్రముల భారోల్లాసమును బంది
లిగ జేసి దాని నల్లించినాడు

భరత మహీ మాజినీమూర్తి పట్టనీక
కాలయాంగ్లభాషాబోధనా త్తకీర్తి
నామము సురేంద్రనాథబెనర్జి ప్రజల
యుధికృతుని సామమున గోరు నతని యర్జి.

'ఇండి'యనెసోసియేష న
ఖండము తత్పదసి దేశగౌరవసరణిన్
నిండించు వెలుగు చుట్టున్
మెండుకొనిన నాళ్ళ జోతి మిసిమి బలువుతో

ఢిల్లి కిదర్బారునకై
వెళ్ళిసురేంద్రుండువచ్చివెలయించెనయా
ఫుల్లజనమనఃకాంక్ష
తల్లికి దర్బారుగాసదస్సునుదీనిన్

నరేంద్రుడు

ఆ పదార్థేండ్ల మాణవు నరసి యిరువు
పరసి నంతనె మల్లెలు విరిసె యెడద
యేడు జన్మల తావిలో సీతకొట్టె
నెవరో యీ బొట్టె యన సాక్షి యిట్లు పలికె.

ఇతా డొక దైవ కటాక్షో
ద్యుతు డాళ్య 'నరేంద్రనాథ దత్తు' మనసు సం
తత మెద్దానినో వెదకెడు
గతి డోపించియును నగ్రగణ్యుడు విశ్వన్.

విద్యాసాగరు పాఠశాల జిగి యీ పిన్నండు వేయున్ సుమీ
సద్యోజాత సమాన సూరి ముఖముల్ స్తబ్ధమ్ములౌ ప్రశ్నముల్
సేద్యం బీతని గొంతులో ప్రకృతి సేసెన్ ద్రాక్ష బండించె నీ
హృద్యస్థాయి నరేంద్రు గేయములు నేడీ గోష్ఠి నాద్యస్థముల్

దేవేంద్రనాథ టాగూరు

మతమును మతియే తెలుపును
శ్రుతమును దృష్ట మనుభవము జోడించుచు నే
వితమైన పుస్తపఠియును
విత యని దేవంద్రబాబు విసుచును మాకున్.

ఇతడెఱుంగని మత మీ జగమ్మున లేదు
స్వీకారమునకు నచ్చినది లేదు
ఇతగు పఠింపని దే పురాణము లేదు

ఎఱిగిన విగ్రహ మ్మేటను లేదు
ఇతడు చూడనియోగి యే గుహలో లేదు
కొలిచిన వాడు నొక్కడును లేదు

మ్రొక్కు నీశ్వరునకు రామ మోహనునకు
బెట్టు కలడు ప్రాగ్గొత్తల పట్టు కలదు
బిరుదున మహర్షి యీత డెవ్వరి కధర్షి
మాధురీ దృష్టి దేవేంద్రనాథ కృష్టి.

చూచు నీతడు రయితుల సుతుల నొక్క
కంట, దనకు రాదగిన లక్షయము మఱచు
గాని తానీయ దగినది గర్వమేని
మరుప, డొకమాట పలు డొకమాట యనడు

రవీంద్రుడు

వాడిన పువ్వులు నిగ నిగ
లాడును లేని హాసనమ్ము లాలన సేయన్
వాడె రవీంద్రు డితనిసుతు
డీడున పిన్నమది బెద్ద నెన్నిటిలోనో

ఆ పొడవైన నాసిక విదాయతి పంటపొలమ్ము పాలమా
త్మాపణనీలరత్నయుగమైన కనుల్ కలభప్రకాండము
డాపరిమాణబాహులు వెదండయెడందయు నున్కి తండ్రి కె
ట్లై పొలుచున్ గుమారునకు నట్లె రవీంద్రున కార్షచిహ్నముల్

ప్రాయునితండు పద్యములు పాటలు వెన్నెలతేటలో యనం
గ్రాయువవృద్ధులీ పురమునన్ గత హైందవమేలలోన నౌ
రా యని నారలంటగదు! రమ్యరవీంద్రకవిత్వముగ్ధులై
తీయని గొంతుకైతయు గదే మనుజత్వములోని సారముల్.

తిన్నగ వెంటవేసికొని త్రిప్పె రవీంద్రుని శీతపర్వతా
భ్యున్నతభూమి దండ్రి తప మూనుచు నయ్యెడ దల్లి లేని యీ
పిన్నవి దల్లియై ప్రకృతి పెంచె శకుంతకలస్వనమ్ముతో
గ్రొన్ననవ్వులో వివిధరుచ్యఫలమ్ములతో ఝురమ్ముతో.

కేశవచంద్రసేన్

మతవాదమ్మున వాని సాటి యతిదే మా యూరిలో పాదిరీ
మతిగర్వుండయి వేయు బాదములకుం బంధమ్ము వెట్లో విడన్
కుతుకన్ వేయు నిదే యిదే వరుసయై గోడాడినారల్ బుధుల్
శ్రుతిశ్రుత్యంత కణాదవాద ముఖశాస్త్రోదంత పాథోనిధుల్.

ఒండనుపోయి క్రైస్తవము బ్రాహ్మము నేకము సేసి చెప్పెత
చ్చండిచి రాజు మంత్రిజనవర్గకృతానుపమానమాననా
ఖండలు దయ్యె దక్కితును గైకొని రాణి భజింప నేను ప్రా
ఖండ మెఱుంగ దంటి యఖండము వై భవముం బతీచిలో.

అట్టి కేశవచంద్రసే నడుగుపెట్టె
తిరిగి కాళిఘట్టమ్మున దెలిసియొ తెలి
యకొ పరమహంసయై మునెట్టె నంతె. కమల
మయ్యె నే తన్మతసరోవరాంతరమున.

ఏ మత మిది కాళీ! కా
ళీ! మన్నించు మను మతము లెల్లను బుఱలన్
మెమె నొంసెడి మతము మ
హీమండలిముక్కటి రామకృష్ణుని మతమున్.

సురేంద్రుని ప్రసంగము

ఆచ్చపు దిండ్లతో జదరమైన వితర్దియు నద్దె లేకయే
వచ్చిన యెఱ్ఱబుట్టలు తుపాకుల పీపులు పొట్టికఱ్ఱకే
లచ్చిన కాపలాయుగు నా సభలో బలుకాడుచుండె గాం
గోచ్చతరంగ ఘూర్ణనవదుక్తి సురేంద్రుడు భావసాంద్రుడై

" పత్రికలకు సిరా రాజభక్తి కలదు
పాలనమ్మె మొబాధ్యతామీలనమ్ము
ఏలుబడిబాట లోగొన్ని మైలురాళ్ళు
దేశ్యములు కానియెడ న్యాయతృప్తిలేదు.

వచనరచనలందు స్వాతంత్ర్య మడుగంబె
నోరు కేలు సాగ నోటు పడియె
నన్ని పదవులందు నాంగ్లుల ప్రాధాన్య
మతిశయించె దేశమతి కృశించె.


అచ్చటికి నేల పోవలె?
యిచ్చట నా ఐ. సి. యస్. పరీక్ష కుదురదో!
వచ్చిరిపో! యుద్యోగులు
మచ్చున కొక డుండునటవె! మనవా డందున్

గుడి గంట కొట్టి దేవుని
గడెగడెకున్ కోర్కెలడుగు కైవడి ప్రజ యే
ల్బడి వెంబడి ఒడి యాము
న్నది జ్ఞప్తికి దెచ్చి గెలువ నూల్కొనవలయున్

ప్రజలు తా మెన్నుకొన్నట్టి ప్రతినిధుల స
భాద్వయమ్మున బ్రిటనులో పగిది నిందు
బాలనమ్ము కావలె భాగ్యమూలనమ్ము
మున్నె కావలె మన భిదోన్మూలనమ్ము

మన దేశ పాలనాధికృ
తిని మన పాలుకొలు రక్షింప దిక్ప్రజలకు నై
వని సేయు సమితి యిది దీ
నిని బెనుచున్ గాత జనము నిత్యక్షణమున్

అని యుద్వాణి శ్రుతమ్మగాగ దుదివ ల్కర్ధ్యక్షుడే లాలు వె
హనఘో షాడెను "దప్పికై నపుడు నీవై యాక లైనప్పుడున్
జనమై యొప్పె సురేంద్రు వాఙ్మఖము శ్రోత్రాణ మీ
భార
మ్మున కీనాడు, ప్రభావితుండ నయితిన్ బుష్పించి
జాతీయతల్



4

సన్నాహం

పోలయ్య నాయకుని ఆధ్వర్యాన రేకపల్లి వద్ద నగర నిర్మాణం చురుకుగా జరుగుతున్నది. ఆ ప్రాంతంలోనే వేలాది సైనికులకు, చాల మంది నాయకులకు శిక్షణ యివ్వబడుతున్నది. ప్రతి వారు రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్నారు. సైనిక శిక్షణను పొందు తున్నారు.

కాపయ్య రేకపల్లి నుండి వెళ్ళి ఒక నెల దినాలు గావచ్చింది. అతడు రాజమండ్రి మొదలు అద్దంకి వరకు తిరిగి ప్రతి వారిని మేల్కొలుపుతున్నాడు. నగర నిర్మాణానికి కావలసిన ధనాన్ని సేకరిస్తున్నాడు. ప్రతి నాయకుణ్ణి కనీసం రెండు వందల నుండి వేయి మంది సైనికుల్ని కూర్చుకొమ్మని చెప్పి వస్తున్నాడు.

నాయకులు గూడ చాల ఉత్సాహంగానే వున్నారు. వారు తమ యావచ్ఛక్తిని వినియోగించి రానున్న పోరాటానికి కావలసిన సన్నాహాలన్నిటినీ గావిస్తున్నారు. వీలయినంత మంది సైనికుల్ని సమకూర్చుకుంటున్నారు. ధనాన్నీ, అశ్వాలను సేకరించడంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. నగర నిర్మాణ మవుతూనే సాధ్యమయినంత త్వరలో యుద్ధ సన్నాహాలన్నీ పూర్తి చేయాలని అనుకుంటున్నాడు పోలయ్య. పట్టణ నిర్మాణాన్ని పరివేక్షించి అప్పుడే తన కార్యాలయానికి వచ్చాడు. అతడు వచ్చేటప్పటికి అన్నమంత్రి అతని కోసం వేచి వున్నాడు.

అన్నమంత్రిని చూస్తూనే పోలసీడు అతనికి నమస్కరించాడు. అన్నమంత్రి అతణ్ణి ఆశీర్వదించాడు.

" నగర నిర్మాణం త్వరగా పూర్తవుతుందనుకొంటాను. " అన్నాడు అన్నమంత్రి.

" త్వరలోనే పూర్తికావొచ్చు. ఇక ఆయుధ సేకరణే మిగిలి వుంది. తగినంత ధనం గూడ లేకుండా వుంది. "

" ధనానికేమిలే. రుద్రదేవుడా పని చూస్తున్నాడు. ఆ విషయంలో కొదువేమీ వుండదనుకొంటాను."

" ధనలోపం లేకపోతే అన్ని పనులు నిర్ణీతకాలంలోనే పూర్తి అవుతాయి. "

" కాపయ్య ఎప్పటికి వెళ్ళాడు?. "

" అతడు నాయకుల వద్దకు వెళ్ళాడు " ఇప్పుడద్దంకిలో వుంటాడనుకొంటాను. "

అన్నమంత్రి నవ్వాడు.

" కాపయ్యకు వేమారెడ్డికి విడరాని స్నేహమనుకుంటాను. వారిద్దరు నీకు కుడి ఎడమ భుజాలుగా పనికి వస్తారు. ఇద్దరూ కొదమసింగాలలాటివారు." అన్నాడు అన్నమంత్రి.

" అది నిజమే. ఇద్దరూ కలిసి తిరిగితే లాభిస్తుందని వేమారెడ్డి అభిప్రాయం. అందుకనే కాపయ్య అచ్చటికి వెళ్ళాడు " పోలసీడన్నాడు.

" కలసి తిరిగితే లాభిస్తుందనడం నిజమే. అంతేగాక వారు విడిగావుండలేరు గూడ."

పోలసీడు నవ్వాడు.

" ఈ నగరానికి ప్రతాపరుద్ర నగరమని నామకరణం చేస్తే బావుంటుందనుకొంటున్నారు చాల మంది. నాకు గూడ అదే యిష్టంగా వుంది " అన్నాడు అన్నమంత్రి.

అలాగే చేదాము. అప్పుడందరూ ఆ మహాచక్రవర్తిని జ్ఞాపకముంచుకోవడానికి వీలౌతుంది. ఆ పేరు ప్రజలందరికీ, ముఖ్యంగా నాయకులందరికీ ఒక విధమైన ఉత్తేజాన్ని కలిగిస్తుంది,

“ అది నిజమే. ఆ సార్వభౌముడంటే ప్రజల్లో ఇంత భక్తి ప్రపత్తులున్నాయని నేననుకోలేదు. మన మనుకొన్నదే నిజమయింది ” అన్నాడు అన్నమంత్రి.

మీరు సరిగానే ఊహించి సలహా యిచ్చారు. ఢిల్లీ సుల్తాను మీద మనమే తిరుగుబాటు చేస్తామంటే అది సాధ్యమేనా? అని ప్రజలు సందేహించేవారు కాని ప్రతాపరుద్ర చక్రవర్తే ఈ పోరాటాన్ని నడపమన్నాడని, అతని ఆజ్ఞననుసరించే మనమీ సన్నాహాలన్నీ గావిస్తున్నామని ఈ ఏర్పాట్లన్నీ పూర్తయి మనం సన్నద్ధంగా వున్నప్పుడా సార్వభౌముడే వచ్చి నాయకత్వం వహిస్తాడని మనం చేస్తున్న ప్రచారం చాల లాభిస్తున్నది. మరలా కాకతీయ సామ్రాజ్యం నెలకొంటుందని, చక్రవర్తి పరిపాలనలో తమకు సౌఖ్యం కలుగుతుందని, మహమ్మదీయుల దౌర్జన్యాలంతరించి ప్రశాంతత నెలకొంటుందని ప్రతివారు ఆశిస్తున్నారు. అందుకోసం వారు ఎదురుతెన్నులు చూస్తున్నారు.”

“ ఎందుకు చూడరు ? సుల్తాన్ పరిపాలన ఒక నరక ప్రాయంగా వుంది వారికి. ఈ పరిపాలనలో ఎవరికీ రక్షణ లేకున్నది. ప్రతివాడు ప్రాణా లరచేతిలో పెట్టుకొని బ్రతక వలసి వస్తున్నది. ఇదొక పీడకల. ఇదెప్పుడు విరగడవుతుందా ననివారు ఎదురు చూడడంలో ఆశ్చర్య మేమీ లేదు.

“ఇక మనం ఏమేమి చేయవలసి వుంటుంది?”

“కాపయ్య వచ్చిన తరువాతనే ఆవిషయాలను నిర్ణయించాలి. ఢిల్లీ సుల్తాను మరణావస్థలో వున్నట్లు విన్నాను. అదేనిజమైతే మనం జయించడానికి మంచి అదను చిక్కవచ్చు.

“ఏ విధంగా?”

“ఆవిషయాన్ని గూర్చి మరలా మాట్లాడు కొందాము. ఇప్పుడు నగర నిర్మాణం ఎంతవరకు వచ్చిందో చూచి వద్దాము.” అని అన్నమంత్రిలేచాడు.

“దాదాపు పూర్తి అయినట్లే. ఇదేమంత పెద్దదిగాదు గదా. అవసరం కొద్ది నిర్మిస్తున్నది. సైనికావసరాలకు మాత్రమే సరిపోయే విధంగా నిర్మించమన్నారు గనుక, అందులోనూ ధనాభావం హెచ్చుగా వున్నది గనుక. మీసలహాల ననుసరించే దీనిని పూర్తి గావిస్తున్నాను.” అంటూ పోలయ్య గూడ అతనితో వెళ్ళాడు.

ఆనాడు ఘయాజుద్దీను ఢిల్లీకి సుల్తానుగా వున్నాడు. దక్షిణాపథాన ఓరుగల్లుపై దాడి వెడలివచ్చి దాని నాక్రమించింది ఉలుఘ్‌ఖాననే అతని కుమారుడే.

ఒకసారి ఓరుగల్లుపై దాడి జరుగుతున్నప్పుడు పోరు ఘోరంగా జరుగు తున్నది. విజయ మెవ్వరిదో చెప్పలేనంతటి సందిగ్ధస్థితి ఏర్పడింది. ఆసమయంలో ఘయాజుద్దీను మరణించాడన్న వార్త ఓరుగల్లు పరిసరాలలో వ్యాపించింది. ఆ వార్తను వింటూనే ఉలుఘ్‌ఖాన్ దాడిని విరమించి ఏకాఏకిని ఢిల్లీ వెళ్లి పోయాడు.

కాని అప్పుడు ఘయాజుద్దీను మరణించ లేదు. కనుక నేడు ఆ సుల్తాను మరణావస్థలో ఉన్నాడన్న వార్త వచ్చినప్పటికీ దాని నెవ్వరూ అంతగా విశ్వసించ లేదు. కాని ఆవార్త, తీర ఆంధ్ర ప్రాంతీయులందరిలోను ఒక విధమైన ఉత్సాహాన్ని రేకెత్తించింది.

అన్నమంత్రి ప్రోలనీడు అన్నట్లు ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తాను బంధాల నుండి తప్పించుకొని వచ్చి ఎచ్చటో ఒకచోట మారు వేషంలో వున్నాడని ఆ ప్రాంత ప్రజలందరు నమ్ముతున్నారు. కాపయ్య, వేమా రెడ్డి చేస్తున్న ప్రచారం గూడ దానికి హెచ్చుగా దోహదమిచ్చింది. ఆ ప్రచారంవల్ల నాయకులే గాక ప్రజలు గూడ ప్రోలయ్య, కాపయ్యా నిర్వహిస్తున్న ఉద్యమానికి శక్తికి మించి సాయపడ జొచ్చారు. అంతేగాక అన్నమంత్రి, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనాయకుడు వీరి ముఖ్యవీరి సలహాలు, వారి ఆశీస్సులు ఈ ఉద్యమానికున్నాయని విని వారు మరింత ముందుకు రాసాగారు. ప్రతాప రుద్రుని కాలంలోగాని, కాకతీయ పరిపాలనలోగాని ఎన్నడూ లేని ఐకమత్యం, ఉత్సాహం ఆ తీరాంధ్ర ప్రజలలో ఆనాడేర్పడింది. దానికి యువ నాయకులైన కాపయ్య, వేమారెడ్డి వీరిద్దరే ముఖ్యకారకులు.

ఒక నాడు కాపయ్య, వేమారెడ్డి కొలనిలో పరుండి వున్నారు. తాము నిర్వహించిన కార్యక్రమాన్ని గూర్చి సమీక్షించు కుంటున్నారు.

“ప్రజలలో ఇంత ఉత్సాహమున్నదని నేనెన్నడూ అనుకోలేదు వేమా? ఆ ఉత్సాహము కట్టలు తెంచుకొన్న గోదావరిలాగా కనబడుతున్నది.” అన్నాడు కాపయ్య.

“ నిజమే కాపయ్యా. నాకుగూడ ఇది ఆశ్చర్యకరంగానే వున్నది. ప్రజల్ని మేల్కొలపాలని మనం వెదుతుంటే వారే మనల్ని ప్రోత్సహిస్తున్నారు. పైగా త్వరపడమని పురికొలుపు తున్నారు.” అన్నాడు వేమారెడ్డి.

“ జయం మనదేననిపిస్తున్నది నాకు. ”

“ అనిపించడమేమిటి ? జయంమనదే ”

“ ఢిల్లీసుల్తాను మరణించినది నిజమైతే ఉలుఘ్‌ఖాను సుల్తానవుతాడను కొంటాను. ”

“ ఆ పిచ్చివాడా ?” వేమారెడ్డి నవ్వాడు. “ అతడే సుల్తానయితే మనపని సులభమే అవుతుంది.”

“ అలా అనుకోకు వేమా ? అత డేపట్టు బడితే ఆ పట్టే. అందువల్ల ఆలాటివారితో పోరాడడమే మనకు కష్టం.”

“ అదీ చూదాం. ఏమైనా మనం జయించితీరాలి.”

“ మన జీవితంలో మనమొకసారైనా ఓరుగల్లును పట్టుకొని తీరాలి.”

“ తప్పని సరిగా పట్టుకొందాము. ఇప్పుడు మనచక్రవర్తి వుంటే ఎంత బాగుండేదో !” వేమారెడ్డి దీనంగా అన్నాడు.

"ఎంతో బాగుండేది. కాని మనమేమిచేయగలం. ఆ మహా భాగుడు పౌరుషవంతుడు గనుక ఆ నర్మదా నదీజలాలలో బడి మరణించాడు. ఆ సుల్తానుకు బందీగా వుండి అతని చేత అవమానించబడే కంటే అదే ఉత్తమమని అనుకున్నాడు."

"నిజమే కాని మన ప్రచారం వల్ల మన చక్రవర్తి ఇంకా జీవించి వున్నాడనే ప్రజ లనుకుంటున్నారు."

"మన ప్రచారం లేక పోయినా ఆ సార్వభౌముడు. మరణించాడని ఎవరూ అనుకునే వారుగాదు. అతడు వారికంత సన్నిహితుడయ్యాడు."

"చక్రవర్తి అదృష్టవంతుడు. మరణించి కూడ జీవించి వున్నాడు. ప్రజల హృదయాంలో కల కాలం మని వుంటాడు."

"ఆ చక్రవర్తి తెచ్చుకున్న ప్రతిష్టలో ఆవగింజంతైనా మనంతెచ్చుకుంటే చాలు, అందుకోసం మనం ఎన్నో త్యాగాలను చేయవలసి వుంటుంది. అన్నాడు కాపయ్య."

''ఇప్పటికి మనకెంత సైన్యం ఒనగూడినట్లు?'' ప్రశ్నించాడు వేమారెడ్డి.

"దాదాపు పదివేల సైన్యానికి పైగానే వుంటుంది రేకపల్లెలో రెండువేల మంది సైనికులు శిక్షణ పొందుతున్నారు. మన పర్యటన వల్ల నాయకుల ద్వారా దాదాపు ఎనిమిది వేల మంది సైనికులైనా సాయం రావచ్చుననిపిస్తున్నది.

"అంతకంటే తక్కువ వుండదు. కాని వారికి మరికొంత శిక్షణ కావాలి'' అన్నాడు వేమారెడ్డి."

"అదేమంత పెద్దపని కాదు. అందరూ చాల శ్రద్ధగా వున్నారు గనుక సులభంగానే వారన్నిటిలోను ఆరితేరుతారు.''

"అశ్వాలు గూడ అవసరమైనన్ని లభించి నట్లే గదా?"

"లభించినట్లే. కాని మరికొన్ని హయాల కోసం ప్రయత్నిస్తే మంచిది. పోరాటం ఎలావుంటుదో చెప్పలేము."

"మనం తిరుగుబాటు చేయాలంటే అందరము ఒక్కసారిగా చేయాలి. సమైక్య ప్రతిఘటనకు పూనుకోవాలి. అప్పుడు మనకెక్కువ సైన్యం అవసరం లేదు."

"మొదటి దెబ్బ కొట్టడానికంత అవసరం లేదు. నిజమే కాని ఆ తరువాత ఎదురు దెబ్బకు తట్టుకోవడానికి హెచ్చు సైన్యముండాలి ఢిల్లీ సుల్తాను తన ఓటమి నేమాత్రం అంగీకరించడు. పైగా ప్రతీకారం తీర్చుకోవడానికికేమైనా చేస్తాడు" అన్నాడు కాపయ్య.

"అదీ నిజమే. నీవన్నట్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాల అవసరం.'' వేమారెడ్డి అన్నాడు.

ఘయాజుద్దీను మరణావస్థలో వున్నాడన్న వార్త దేశమంతా ప్రాకింది. ఆ వార్త ధృవపడుతూనే ప్రోలనీడు, కాపనీడు తదితర నాయకులు తమఉద్యమాన్ని మరికొంత తీవ్రతరం గావింపసాగారు.

నాయకుల నిర్విరామ కృషి వల్ల రేకపల్లి వద్ద నగర నిర్మాణం పూర్తయింది. ఆ గోదావరీ నదీ తీరాన, ఆ అరణ్యాల మధ్యలో, మాల్యవంతం పాదపీఠం వద్ద నిర్మించబడిన ఆ చిన్న నగరం చాల శోభాయమానంగా వుంది.

ఆ నగరం సైనికావసరాలకు ముఖ్యంగా ఉద్దేశించబడింది. అందువల్ల అది ఒక సైనిక శిబిరం లాగా కానవచ్చింది. కాని చూడడానికి అది ఎంతో మనోహరంగా వుంది.

నగర నిర్మాణం పూర్తి అయినట్లుగానే పోరాటానికి కావలసిన సన్నాహాలన్నీ దాదాపు పూర్తి కావచ్చాయి.

ఇంతలో ఘయాజుద్దీను మరణించాడన్న వార్త జ్వాలలాగా దేశమంతటా వ్యాపించింది. అతని మరణాన్నాలకించి హిందువులందరూ ఎంతో సంతసించారు. అప్పటి తమ దుస్థితికి అతడే కారణమయి నందువల్ల అతని మరణం వారికంత ఆనందాన్ని కలిగించింది.

ఢిల్లీ సుల్తాన్ మరణించినాడని వింటూనే ముఖ్యమైన నాయకుల నందరినీ సమావేశపరచమని అన్నమంత్రి ప్రోలయ్యకు వర్తమానమంపాడు. ఆ సాహిణి సలహా ననుసరించి ప్రోలనీడు ప్రధానమైన నాయకుల్ని సమావేశ పరచాడు. ఆ సమావేశంలో భవిష్యత్కార్య క్రమాన్ని గూర్చి చర్చింపబడింది. చర్చా వివరాలన్నీ రహస్యంగా వుంచబడ్డాయి.

ఆ సమావేశం జరిగిన వెనువెంటనే తీరాంధ్ర ప్రాంతంలో ఎచ్చట జూచినా ఒక విధమైన కదలిక ఏర్పడింది. ప్రతివారు ఏదో కార్యక్రమంలో నిమగ్నమై వున్నట్లు తోచింది.

ఆయా ప్రాంతాలలో వున్న నాయకులందరూ యుద్ధానికి సంసిద్ధ మవుతునట్లు, అశ్వాలను, ఆయుధాలను సేకరిస్తున్నట్లు, ధనాన్ని సమకూర్చు కొంటున్నట్లు కనబడింది.

తీరాంధ్ర మంతా ఏదోపోరాటానికి సన్నద్ధ మవుతున్నట్లనిపించింది. ఆ పోరాటం నేడో రేపో వస్తున్నట్లగుపడింది

ఇంతలో ఓరుగల్లునోడించి ప్రతాప రుద్రుణ్ణి బంధించిన ఉలుఘ్‌ఖాన్ ఢిల్లీ సుల్తాను కానున్నట్లొకవార్తవచ్చింది. అతని పట్టాభిషేకానికి కావలసిన ఏర్పాట్లన్నీ జరుగుతున్నట్లు మరొక వార్త వచ్చింది. పట్టాభిషేక మహోత్సవం జరిగేనాటికి దేవగిరి, ఓరుగల్లు, ద్వారసముద్రం, కంపలి మొదలైన కేంద్రాలలోవున్న రాజ ప్రతినిధులు, సుబేదారులు, తదితర ప్రధాన అధికారులు ఢిల్లీకి రావలసిందని తాఖీదులు వచ్చాయని గూఢచారులవల్ల తెలియవచ్చింది.

ఆవార్త తెలుస్తూనే కొలని రుద్రదేవుడు ప్రతాపరుద్ర నగరానికి వచ్చాడు. ఆలోగా అచ్చట సింగమ నాయకుడు,అన్నమంత్రి, వేమారెడ్డిగూడ వున్నారు వారు ప్రోలనీడుతోను. కాపయ్య నాయకునితోను సమాలోచనలను కొనసాగిస్తున్నారు రుద్రదేవు

(తరువాయి 67వ పుటలో)

శ్రీకాకుళం కొండల్లో శరవేగంతో నిర్మిస్తున్న "వట్టిగెడ్డ" రిజర్వాయరు ప్రాజెక్టు

—భూషణం

మనిషి మనుగడకు కావలసిన ప్రాథమికావసరాల్లో మొట్ట మొదటిది ఆహారం. ప్రాణికోటి నిత్యం పడుతున్న తపన, అన్వేషణా ఆహార సంపాదన కోసమే. ఒకనాటి మానవుడు ప్రకృతి మీదపూర్తిగా ఆధారపడేవాడు. నేటి మానవుడు ప్రకృతి మీద విజయం సాధించి, తన అవసరాలకు అనుగుణంగా దానిని మలుచుకుంటున్నాడు.

ఇటువంటి దశలో శ్రీకాకుళం జిల్లా, పార్వతీపురం తాలూకా, చినమేరంగికి ఏడున్నర కిలోమీటర్ల దూరంలోవున్న కొండల్లో ప్రవహిస్తున్న వట్టిగెడ్డ అనబడే నాగావళి ఉపనదికి రిజర్వాయరు నిర్మించబడుతున్నది. దీని నిర్మాణానికయ్యే ఖర్చు ఒక కోటి ఎనభై లక్షల రూపాయలు.

ఈ నది తూర్పు కనుమల్లో పుట్టి, సుమారు యాభైయ్యారు కిలోమీటర్లు పడమటి దిక్కుగా ప్రవహించి, ఉమిడి గ్రామం దగ్గర నాగావళి నదిలో కలియుచున్నది. ఈ నదీ ప్రవాహపు మొత్తంలో పంధొమ్మిది మైళ్ళవరకూ కొండల్లోనూ, మిగిలినది మైదాన ప్రాంతంలోనూ వున్నది. మైదాన ప్రదేశ ముఖద్వారంలా ఉన్న రావాడ కొండల నడుమ ఈ రిజర్వాయరు నిర్మాణం సాగుతున్నది. ఈ జీవనదిలో వేసవి కాలములో కూడా ఐదు క్యూసెక్కుల వరకూ నీరు పారుతూనే ఉంటుంది.

రిజర్వాయరు నిర్మాణం పూర్తయిన తరువాత ఇందులో నిలిచి ఉండగల నీటి పరిమాణము ఎనిమిది వందల అరవై మిలియన్ ఘనపుటడుగులు. ఇందులో వ్యవసాయానికుపయోగపడే నీరు ఏడువందల తొంభైయ్యేడు మిలియన్ ఘనపుటడుగులు. కురుపాంలో పద్దెనిమిది సంవత్సరాలనుండి లభ్యమైన వర్షపాతపు కొలతలవలన ఈ రిజర్వాయరు సంవత్సరానికి రెండు పర్యాయాలకు తక్కువ కాకుండా నిండునని అంచనా వేయడం జరిగింది.


ఈ నదికి రెండు వైపులా మట్టితో అడ్డుకట్టలు వేయుచున్నారు. ఎడమ ప్రక్క కట్టయొక్క నిడివి మూడు వేల ఏడు వందల ఇరవై అడుగులు. దీని గరిష్ఠ ఎత్తు ఎనభై యేడు అడుగులు. పై వెడల్పు పదిహేను అడుగులు. ఈ కట్టడమునకు కావలసిన మట్టి పరిమాణము ఒక కోటి ఎనభై లక్షల ఘనపుటడుగులు. ఇది తూర్పు కనుమల్లోని ఒక కొండను ఆనుతూ దూరానికి కొండల్లోనుండి వస్తున్న పెద్ద పాములా కనిపిస్తుంది. కుడి పక్క కట్టకూడా అలానే కనిపిస్తూ నదికి కుడి భాగాన ఉన్న ఒక కొండకు ఆనుతుంది. దీని నిడివి మూడు వేల ఐదు వందల ముప్ఫై అడుగులు. ఎత్తు ఏభై యేడు అడుగులు. పై వెడల్పు పదిహేను అడుగులు. ఈ కట్టడమునకు కావలసిన మట్టి పరిమాణము ఒక కోటి ఇరవై లక్షల ఘనపుటడుగులు.

ఇటువంటి రెండు గట్లకు మధ్యగా రెగ్యులేటరు నిర్మించబడుతుంది. నల్లరాతితో నిర్మించబడుతున్న ఈ రెగ్యులేటరు అదనముగా నదినుండి వచ్చే నీరు పొర్లి పోయేందుకు ఉపయోగపడుతుంది. దీని పొడవు నూట తొంభై అడుగులు. రాతి కట్టడముయొక్క ఎత్తు యాభై అయిదడుగులు.


ఈ కట్టడముమీద నలభై అడుగుల వెడల్పున, ఇరవై మూడడుగుల ఎత్తున మూడు పెద్ద గేట్లు పెట్టబడును. ఇక్కడ గరిష్ఠ నీటి ప్రవాహము సెకండునకు యాభై మూడు వేల ఘనపుటడుగులు. కట్టడమునకు ప్రకృతి సిద్ధముగా నది మధ్యనున్న చట్టు రాయి ఉపయోగపడినది. అందుచేత పునాదులు దృఢముగా ఉండి, నీటి వరవడికి తట్టుకొని నిలిచేందుకు అవకాశం ఉంది.

రిజర్వాయరునకు కుడి ప్రక్కన ఒక కాలువ, ఎడమ ప్రక్కన వేరొక కాలువ త్రవ్వబడుచున్నవి. కుడి కాలువ క్రింద సాగునకు వచ్చు భూమి పదమూడు వేల నాలుగు వందల ఎకరములు. ఎడమ కాలువ క్రింద సాగునకు వచ్చు భూమి మూడు వేల మూడు వందల అరవై ఎకరములు.

ఈ రిజర్వాయరుమీద ప్రభుత్వము పెట్టిన పెట్టుబడికి శిస్తు రూపంలో 1.9% వడ్డీ వస్తుంది. అంతేగాకుండా ఈ నిర్మాణం



ఎడమకట్ట లోపలిభాగం



రెగ్యులేటర్

వలన అనేక కోయ పల్లెలు వెలుగు లోనికివచ్చినవి. మూడు బస్సుల రాకపోకలవలన ప్రయాణం సుఖతరమైంది. నాగావళి నదియొక్క వరదల ఉద్ధృతముకగ్గే అవకాశంకూడా ఉంది. మత్స్య పరిశ్రమ స్థాపనావకాశం ఉంది. ఇంత ఉపయోగకరమైన నిర్మాణంవలన ఈ ప్రాంతపు ప్రజల జీవన స్థాయి పెరుగుతుంది.

ఒకప్పుడు ఇక్కడ చిరుతపులులు, అడవిపందులు, ఎలుగు గొడ్ల అరుపులు వినవచ్చేవి. ఇప్పుడు ట్రాక్టర్ల, బుల్‌డోజర్ల, లారీల, జీపుల ధ్వనులతో కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి.

కీచురాళ్ళ రొద, అడవి జంతువుల గుడ్లగూబల భయంకరమైన కూతలతో నీరవ నిశ్శబ్దంగాఉన్న ఈ ప్రాంతపు రాత్రి ఈ నాడు విద్యుద్దీపాల ధవళకాంతితో సజీవంగా కన్పిస్తుంది.

ఇక్కడ సూర్యోదయం చాలా అందంగా ఉంటుంది. తూర్పుకనుమల కొండకొనలనుంచి ఉదయిస్తున్న సూర్యుడూ, లేత బంగారు కిరణాల కిరీటాన్ని తొడుక్కున్న శిఖరాలూ; హరిత వర్ణచ్ఛాయను తాత్కాలికంగా కోల్పోయి అరుణ వర్ణంతో మెరిసే వృక్షాగ్రాలూ చూచి పరవశించని హృదయముండదు. ఆక్షణాల్లో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి గీతం గుర్తుకు రావడం సహజం.

''ఆకులో ఆకునై

పూవులో పూవునై

కొమ్మలో కొమ్మనై

నునులేత రెమ్మనై

ఇచటనే ఆగిపోనా

ఎటులైన

ఇచటనే దాగిపోనా......!''

అనిపిస్తుంది.

[60 వ పేజీ నుండి]

ఓరుగల్లు పునరాక్రమణ

డచటికి వస్తూనే యువనాయకులందరూ లేచి అతనికి నమస్కరించారు. అప్పుడతడు వారిని కూర్చోమని తానుగూడ అచ్చట ఆశీనుడయ్యాడు.

"ఉలుఘ్‌ఖానుకు పట్టాభిషేకం జరుగుతుందన్న విషయం మీకు తెలిసిందా?" ప్రశ్నించాడు రుద్రదేవుడు.

"తెలిసింది ఆ విషయాన్ని గూర్చే యిచ్చట చర్చిస్తున్నాము. ఫలానానాడు పట్టాభిషేకం జరుగుతుందని గూడ తెలిసింది" అన్నాడు అన్నమంత్రి.

"అలాగా, అయితే అది మంచిదే. దానిని గూర్చి మీరు ఏమనుకుంటున్నారు?" అడిగాడు రుద్రదేవుడు.

"ఆనాడే మనం తిరుగుబాటు గావించితే మంచిదనుకుంటున్నాము" సింగమ నాయకుడన్నాడు.

"చక్కగానే అనుకొంటున్నారు. కాని ఆ తిరుగుబాటు ఎలా వుండాలని అనుకొంటున్నారు?" మరలా ప్రశ్నించాడు రుద్రదేవుడు.

"ఆనాడు తీరాంధ్రలోవున్న నాయకులందరూ తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించాలని అనుకొంటున్నాము." అన్నాడు అన్నమంత్రి.

"మరీ మంచిది. దక్షిణాదిలోనున్న సుబేదార్లు, సేనానాయకులందరూ ఆనాడు ఢిల్లీలో వుంటారు గనుక మనం స్వాతంత్ర్యం ప్రకటించినా వారేమీ చెయ్యలేరు మరలా మనల్ని అణచివేయాలంటే వారికంత సులభసాధ్యమైన పనిగాదు." అన్నాడు రుద్రదేవుడు.

ఉలుఘ్‌ఖాను పట్టాభిషేకం చేసుకుంటూ ఆనందంలో మునిగివున్నప్పుడు మనం తిరుగుబాటు చేయనున్నాము ఈ విషయం తెలిస్తే ఆ సుల్తాను గుండెలు గుభేలుమంటాయి" అంటూ నవ్వాడు ప్రోలయ్య.

అప్పుడందరూ నవ్వారు.

"అది మొదటి ఆఘాతం మాత్రమే. కాని ఇంకా అతనిగుండె ఎన్నోమార్లు గుభేలుమనవలసి వుంటుంది" అన్నాడు కాపయ్య.

ఆ మాటలు విని అందరికీ నవ్వు వచ్చింది.

[సశేషం]

గ్రంథ సమీక్ష

భగవద్గీత - ఆంధ్రానువాదము

తత్త్వ సూర్యప్రభ వ్యాఖ్యా సహితము

వ్యాఖ్యాత

"మహాస్వామి" ఎస్. వి. ఆదివరాహాచార్యులు

ప్రతులకు : అనువాదకులు

c/o. వైద్యశ్రీ గ్రంధే రఘురామగుప్త

మార్కాపురం, ప్రకాశంజిల్లా

1/4 రాయల్ సైజు: పుటలు 301—వెల రూ. 8 లు.

ప్రపంచసాహిత్యంలో భగవద్గీతకు వచ్చినంత ప్రఖ్యాతి మరొక గ్రంథానికి రాలేదని పండితుల, విమర్శకుల అభిప్రాయం. ఆధ్యాత్మికదృష్టితోనే కాక కవితాదృష్టితోనూ భగవద్గీత సర్వోత్తమంగా పరిగణింపబడింది. ఈ విషయాన్నే లోకమాన్యుడు తన గీతా రహస్యం పీఠికలో వెలువరించారు.

''శ్రీమద్భగవద్గీత మన ధర్మగ్రంథాలన్నిటిలోనూ అత్యంత ఉజ్జ్వలమూ, పవిత్రమునైన వజ్రమువంటిది. అతిగహనమైన విషయాలను ఆబాలవృద్ధులు తెలుసుకొనే రీతిగా సరళాతిసరళంగా వివరించే గ్రంథం ప్రపంచసాహిత్యంలోనే దీనితో సమానమైంది మరో గ్రంథం లేదు. కేవలం రచనాదృష్టితో చూచినా ఇంతటి కావ్యం మరోటి కనిపించదు. సాక్షాత్తు కృష్ణభగవానుడు కంఠోక్తిగా సమస్త వైదికధర్మాలను ఏకత్ర సమీకరించిన గ్రంథం భగవద్గీత అన్నప్పుడు దీని ప్రాధాన్యాన్ని గూర్చి వేరే చెప్పనక్కర లేదు.

దాదాపు 2,500 సంవత్సరాలనుంచి యిది వేదతుల్యంగా ప్రజాదరాన్ని పొందుతూ వుండడమే దీనిమహత్వాన్ని తెలుపుతున్నది. ప్రతిఅధ్యాయ సమాప్తిలోనూ "ఇతి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే..." అని చెప్పడమే దీని ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని చాటుతుంది''అని లోకమాన్య బాలగంగాధర తిలక్ అన్నాడు.

భగవద్గీత ప్రాచీనత్వాన్ని గురించి యిటీవల చాల సంశయాలు బయలు దేరాయి. మహాయాన బౌద్ధప్రవర్తకుడైన నాగార్జునాచార్యుని శూన్యవాద ప్రతిపాదకాలైన మాధ్యమిక కారికలువంటి అర్వాచీన గ్రంథాల అనుకరణగా, వేదమత పునరుద్ధరణకు గుప్త సామ్రాజ్యంలో జరిగిన ప్రయత్నాల ఫలితాలలో భగవద్గీతా రచన ఒకటని కొందరు అధునికులవాదం. కాని, మహాభారతం యిప్పుడున్న రూపంలో రెండు సహస్రాబ్దాలకిందనే ఉన్నట్లు లోకమాన్యుడు తన గీతారహస్యంలో వివరించాడు.

విష్ణుగుప్తరచితమైన పంచతంత్రం క్రీ॥శ॥ ప్రారంభం నాటిదని పండితులైన రాజనీతిజ్ఞుల అభిప్రాయం. ఇది క్రీ॥శ॥ 570 నాటికే పహలవీ (ప్రాచీన యిరానీ)భాషలో అనూదితమైంది. ఆ అనువాదానికి సిరియా—అరబ్బీ భాషలలో అనువాదాలున్నట్లు చరిత్రకారులు చెప్పుతున్నారు. పంచతంత్రంలో—

'హతస్త్వం ప్రాప్స్యసి స్వర్గం
జీవన్ గృహమథో యశః
యుధ్యమానస్య తే భావి
గుణద్వయ మనుత్తమం"

(లబ్ధప్రణాశః)

అని ఉదాహరించబడింది. ఈ శ్లోకం భగవద్గీత 'హతోవా ప్రాప్స్యసే స్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీం' అనే రెండో అధ్యాయం 3వ శ్లోకమేనని యెవరైనా చెప్పగలరు. ''మహాభారతమివ అనంతగీతాకర్ణనానందితనరం'' అని కాదంబరిలో మహాకవి బాణభట్టుడు రాజభవనవర్ణనములో చెప్పినాడు. రాజభవనము మహాభారతమువలె ఉన్నదట. అనంతుని(కృష్ణుని) గీతను విని ఆనందించిన నరుడు(అర్జునుడు) కలది మహాభారతం. రాజభవనమేమో అసంఖ్యాక గీతాలతో నిరంతరం ఆనందించిన నరులు కలది అని శ్లేషార్థము. బాణభట్టుడు క్రీ॥శ॥ 6వ శతాబ్దంలోని హర్షుని ఆస్థానంలో ఉన్నవాడు. దీన్ని బట్టి భగవద్గీత ప్రాచీనత్వం తేటపడుతున్నది. ఇది ఆదిశంకరాచార్యుల కాలంనుంచే ప్రచారంలోకి వచ్చిందనే వాదం పరాస్తమైనట్లు భావించవచ్చు. మన మతంలో ఉన్న వేదాలూ, ఉపనిషత్తులూ, ఆరణ్యకాలూ భిన్నభిన్న ప్రస్థానాలను వివరించాయి. మనదేశంలో ఒక ప్రత్యేక మార్గాన్నే అవలంబించాలనే నిర్బంధమనేది లేకుండా మతస్వాతంత్ర్యం అనాది కాలంగా ఉంటూనే ఉన్నది. కాని, బౌద్ధమతవ్యాప్తివల్ల కలిగిన అలజడిలో వేదోపనిషదుక్త సిద్ధాంతాల సమన్వయం అవసరమైంది. దానితో ఆ అలజడిని ఎదుర్కొనవలసి వచ్చింది. అందుచేతనే అంతవరకు ప్రచారంలో పరబ్రహ్మ ప్రతిపాదకాలుగా ఉన్న ఉపనిషత్తులు, భగవద్గీతలు, బ్రహ్మసూత్రాలవంటి గ్రంథాలవలె ప్రధానంగా పరిగణింపబడిన భగవద్గీతను గూడా ప్రస్థానత్రయంలో చేర్చి ఆదిశంకరులు భాష్యం వ్రాశారు. దీనివల్ల, భిన్నభిన్న ఆస్తిక మతాల క్రోడీకరణకూ, సమన్వయానికి భగవద్గీత సహస్రాబ్దాలుగా ఎంత ప్రధాన గ్రంథమో స్పష్టమౌతున్నది. ఇటీవలి కాలములోనూ దీని ప్రాశస్త్యానికి ఉదాహరణంగా డా॥ హీరాలాల్ చోప్రా భగవద్గీతను పర్షియా భాషలో అనువదించి టెహరాన్ విశ్వవిద్యాలయంలో డాక్టరేటు బిరుదు పొందడమే సాక్షి. (ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా 1972, ఫిబ్రవరి. 20)

సుమారు రెండు శతాబ్దాలకు ముందు 1785లో చార్లెస్ విల్కిన్స్ అనే విద్వాంసుడు భగవద్గీతను తొలిసారిగా ఆంగ్లభాష

లోకి అనువదించాడు. అప్పటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ దీనికి పీఠిక వ్రాస్తూ 'బ్రిటిష్ సామ్రాజ్యం భవిష్యత్కాలంలో ఉండకపోయినప్పటికీ భగవద్గీత యీ ఆంగ్లానువాద ప్రాముఖ్యం ఎల్లకాలమూ ఉంటుంది'' అని అన్నాడు. దీన్ని బట్టి వారన్ హేస్టింగ్స్ దూరదృష్టి భగవద్గీత పైన ఆయనకు ఉన్న విశ్వాసము ఎంతటిదో స్పష్టమవుతున్నది. ఆధునిక కాలంలో ఆంగ్లం ద్వారా భగవద్గీత వ్యాప్తి యూరప్‌లో జరిగితే, పూర్వకాలంలో అరబ్బీ ద్వారానూ, చైనీ ద్వారాను అరబ్బీ చైనా దేశాలలో జరిగింది. అరబ్బీ ద్వారా ఈ గ్రంథం కొన్ని పాశ్చాత్య దేశాలకూ చైనా ద్వారా కొన్ని తూర్పు దేశాలకూ వ్యాపించింది. ఈ శతాబ్దంలో గూడా వివిధ భారతీయ భాషలలోనూ విదేశాల్లోను భగవద్గీతానువాదాలు కోకొల్లలుగా వచ్చాయి. కొన్ని శతాబ్దాలుగా పరతంత్రులై ఆత్మ విశ్వాసం కోలుపోయిన భారతీయులను కర్మ నిష్ఠులుగనూ ధీరులగనూ చేయటానికి లోకమాన్యుడు తన గీతా రహస్యం ద్వారా ఉత్తేజపరిస్తే, గాంధీజీ యీ గ్రంథాన్నే ఆధారంగా చేసుకొని దేశంలో స్వాతంత్రోద్యమ సమరాన్ని సాగించారు. గాంధీజీ సిద్ధాంతానికి అనుగుణంగానే దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పున్నగువారు గీతకు అనువాదాలూ వ్యాఖ్యానాలు చేశారు. అవన్నీ నైతిక రాజకీయ వ్యాఖ్యలు.

ఆది శంకరులు భిన్న భిన్న మతాలను సమన్వయపరిచే దృష్టితో భగవద్గీతను ప్రస్థాన త్రయంలో చేర్చి భాష్యం వాసిన తరువాత తదనుసారంగా రామానుజ మధ్వాచార్యులు విశిష్టాద్వైత ద్వైతాది మతాల పరంగా దీనికి భాష్యాలు వ్రాశారు. వీరేకాక మధుసూదన సరస్వతి మొదలైన మహావిద్వాంసులు గూడా భాష్యాలకు దీటైన వ్యాఖ్యానాలు తమతమ మతానుగుణంగాచేశారు.

శ్రీ ఆది వరాహాచార్యులు శ్రీమద్రామానుజ సిద్ధాంతానుసారముగా భగవద్గీతను అనువదించి 'కర్మ సూర్య ప్రభ' అనే సమీక్షతో ఈ గ్రంథాన్ని వెలయించినారు. దీనికి వ్రాసిన 70 పుటల ఉపోద్ఘాతంలో సృష్టి క్రమము-బ్రహ్మ తత్వము—శంకరాచార్యుల అధ్యాసవాదము మొదలు వివిధ వాదములు-ప్రవృత్తి తత్త్వము, ప్రాకృత తత్వమూ, పురుష తత్త్వమూ ప్రాచీన వైదిక మతాలనూ వివరించారు. ప్రాచీన మతములలో అవైదికములుగా పరిగణింపబడిన జైనబౌద్ధాది మతములనూ, ప్రాచీన కాలము నుండీ వెలసిన వైష్ణవ-శైవ-శాక్తేయ, సౌర-గాణాపత్య-కాపాలికాలు అనే షణ్మతాలను వివరించటంతో పాటు గత శతాబ్దిలో భారతీయేతర మతాలను ఎదుర్కొనడానికి పుట్టిన బ్రహ్మ సమాజ-ఆర్య సమాజములను గూర్చికూడా వివరించారు. భగవద్గీత సిద్ధాంతము 'నాస్తికము మొదలైన దుర్వాదములను నిరసించి వైదిక మతము సుప్రతిష్ఠితము' చేయుట అను నిర్వచనముతో ఉపోద్ఘాతమును ముగించారు.

వీరి అనువాదంలో శ్లోకాలకు తాత్పర్యం వ్రాసి సమీక్షలో విశేషాలను వివరిస్తూ రామానుజ మతాన్ని ఇతర మత ఖండన ద్వారా స్థాపించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నం "శ్లో వ్యాసస్వోచ స్త్వం "యాసిశాసర్వభూతానాం'' — క్షేత్రంజ్ఞంచాపిమాంవిద్ధి" ఇత్యాది శ్లోక సమీక్షల్లో స్పష్టంగా కనపడుతుంది. ఇందు నిష్పాక్షికంగా వీరు మూడు మతాల సిద్ధాంతాలను వివరించి ఉంటే పాఠకులకు ఇంకా ఉపయోగకరంగా ఉండేది. ఇందలి భాషా-అనువాదశైలి-వివరణ పద్ధతీ చాల సరళంగానూ జిజ్ఞాసువులకు విషయము సుబోధంగానూ ఉన్నాయి. ఆస్తిక్య ప్రచారాన్ని ఉద్దేశించి వీరు ఈ గ్రంథాన్ని రచించారు కాబట్టి వీరి ఉద్దేశ సిద్ధి పూర్తిగా నెరవేరిందనవచ్చును.

వీరి ఉపోద్ఘాతంలో ఆర్యసమాజాన్నీ, బ్రహ్మ సమాజాన్నీ, బౌద్ధాన్ని గురించి వ్రాసిన వివరాలు అంతగా ప్రామాణికుల దృష్టిని ఆకర్షించేవిగా లేవు. పుట50లో బౌద్ధమతాన్ని గురించి వీరు వ్రాసిన చరిత్ర, ఆ మతాన్ని గూర్చి యిటీవల లభించిన అపూర్వ గ్రంథాల పరిశీలన దృష్ట్యా విచిత్రంగా కనిపిస్తున్నది.

ఏమైనా, ఈ గ్రంథం నేడు అత్యవసరమైన ఆస్తికత ప్రచారానికి దేశంలో ఎంతో ఉపయోగపడేదిగా ఉంది. ఆ విధంగా వీరి ఉద్దేశం సిద్ధించింది. అందరూ ఆదరించవలసిన గ్రంథం.

—క.ల.శా.

ఈ సంచికలో రచయితలు

- శ్రీ బుజ్జాయి, ఆర్టిస్టు, మద్రాసు
- శ్రీయుతులు ఇటిక్యాల మాణయ్య, మడపతి సంగమేశ్వర్, జహీరాబాద్
- శ్రీ బి. నాగభూషణరావు, మేరంగి, పార్వతీపురం తాలూకా
- శ్రీ సోమసుందర్, గాంధీనగర్, కాకినాడ
- శ్రీ ఐ. వి. రమణయ్య, రిటైర్డ్ హెడ్మాస్టరు దిల్‌సుఖ్‌నగర్ కాలనీ, హైదరాబాదు
- శ్రీ ఆర్. ఆర్. రావు, ఫీల్డు పబ్లిసిటీ ఆఫీసరు, నల్లగొండ
- శ్రీ ఎస్వీ. రామారావు, అన్వార్ ఉలుం కళాశాల, హైదరాబాదు
- శ్రీ సు. సత్యనారాయణ శాస్త్రి, భద్రాచలం.
- శ్రీ వి. బండారు, మాసాబ్‌ట్యాంక్ రోడ్, హైదరాబాదు
- శ్రీ పణతుల నరసింహయ్య, చిత్తూరు
- శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
- శ్రీ ఇల్లిందల సరస్వతీదేవి, నల్లకుంట, హైదరాబాదు
- శ్రీ కె. కాశీపతిరావు, విజయనగరం
- శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
- శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. సి. చిత్తూరు

నిడుముక్కలలో హరిజన కాలనీ

గుంటూరు జిల్లాలో బలహీన వర్గాల సంక్షేమం నిమిత్తం మూక ఉమ్మడి పునరావాస గ్రామీణ గృహవసతి కార్యక్రమం క్రింద చేపట్టిన కాలనీలలో తాడికొండ పంచాయతీ సమితిలోని నిడుముక్కల కాలనీ ఒకటి.

జిల్లాలో బలహీన వర్గాల నిమిత్తం యింతవరకు రూ. 30 కోట్ల ఖర్చుతో 10,000 యిండ్లను నిర్మించారు.

నిడుముక్కల కాలనీలో 36 యిండ్లు ఉన్నాయి. వాటి ఖర్చు రు. 42 వేలు. క్రైస్తవ సంఘం తరఫున ఫాదర్ ఎం. డి. ఇన్నయ్య యీ యిండ్ల నిర్మాణాన్ని చేపట్టారు.


ఇంటికి రూ. 500 ల చొప్పున ప్రభుత్వం సహాయం అందజేయగా, ప్రయోజనం పొందేవారు రు. 450 లు చెల్లించగా క్రైస్తవ సహాయకసంఘం రూ. 250 ల చొప్పున యిచ్చింది.

తాడికొండ పంచాయతీ సమితి 50 శాతం విరాళంగా రూ. 10,000 మంజూరు చేసింది.

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయ్ కె. దేశాయ్ ఏప్రిల్ 5 వ తేదీన యీ కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.

గడ్డిపల్లిలో శ్రీ అరవిందుని అవశేషాల ప్రతిష్ఠ


నలగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకాలోని గడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 4 వ తేదీన శ్రీ అరవిందుని అవశేషాలు ప్రతిష్ఠాపన చేయబడినాయి. ఈ అవశేషాలు పుదుచ్చేరి నుంచి గొనిరాబడినాయి. అనేక వ్యాప్త భక్తులు ముఖ్యంగా లంబాడీలు అవశేషాల దర్శనం చేసుకొన్నారు. ఈ సందర్భంలో హైదరాబాదు స్టేట్ బ్యాంక్ జనరల్ మేనేజరు శ్రీ కె. యస్. దత్తు అధ్యక్షతలో బహిరంగ సభ జరిగింది. పుదుచ్చేరిలోని శ్రీ అరవింద అంతర్జాతీయ విద్యా కేంద్రం రిజిస్ట్రారు శ్రీ కిరిట జోషి ప్రసంగిస్తూ శ్రీ అరవిందుని అవశేషాలు ఆ మహనీయుని భౌతిక కాయానికి చిహ్నమని, ప్రజలు ఆ మహర్షి ఆశయాలను ఆచరణలో పెట్టవలెనని చెప్పారు. డా. మద్ది సుదర్శనరెడ్డి ప్రసంగిస్తూ గడ్డిపల్లి ఇప్పుడు యాత్రా కేంద్రం స్థాయిని అందుకొన్నదని చెప్పారు. డా. గోపాలరెడ్డి, శ్రీ సత్యనారాయణ గారలు కూడా ఈ సందర్భంలో ప్రసంగించారు.



ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుకు విశాఖ పట్నంలోని వాణిజ్యపన్నుల డిప్యూటీ కమిషనర్ శ్రీ పి. సీతాపతి గత నెలలో రక్షణ నిధిని అందజేస్తున్న దృశ్యం

పిల్లల చికిత్సావార్డుకు గవర్నరు ప్రారంభోత్సవం

రాష్ట్రగవర్నరు శ్రీ ఖండూభాయి కె దేశాయి గుంటూరులో ఏప్రిల్ 5 వ తేదీన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని పిల్లల చికిత్స విభాగానికి ప్రారంభోత్సవం జరుపుతూ పిల్లల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకొనవలెనని ఉపోద్ఘాతించారు. పిల్లలకు పౌష్టిక ఆహారం లభింపజేయడం చాలా అవసరమని ఆయన పక్కాణించారు. పిల్లల చికిత్స విభాగం 2.25 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించబడింది. ఈ విభాగంలో 50 మంచాలు ఉన్నవి.



గుంటూరు జనరల్ ఆస్పత్రిలో పిల్లలవార్డుకు గవర్నరు ఏప్రిల్ 5వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతంగా కొనసాగడానికి పిల్లల భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక విషయాలలో శ్రద్ధ తీసుకొని వారిని సక్రమమైన పద్ధతిలో పైకి తీసుకొని రావాలని గవర్నరు చెప్పారు. ఈ చికిత్స విభాగాన్ని ఏర్పాటు చేయడానికి గుంటూరు ప్రజలు శ్రద్ధ తీసుకొని తగిన సహాయం చేసినందుకు వారిని గవర్నరు ప్రశంసించారు.

మహబూబునగర్‌లో ఉగాది ఉత్సవాలు

మహబూబునగర్ టౌన్‌హాలులో సమాచార, పౌరసంబంధ శాఖ అధ్వర్యాన ఉగాది దినోత్సవ సందర్భముగా పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డవి. స్థానిక ఆర్ట్స్ సైన్సు కాలేజి లెక్చరర్ శ్రీ వి. బుచ్చారెడ్డి అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. శ్రీ లక్ష్మినారాయణ శాస్త్రిగారిచే పంచాంగశ్రవణం జరిగింది. కవిసమ్మేళనములో 20 మంది కవులు పాల్గొన్నారు. జిల్లా రెవిన్యూ ఆఫీసరు శ్రీ వైద్యనాథ అయ్యర్ తాహశీల్దారు శ్రీ విశ్వేశ్వరరావు, డి. యం. ఓ. శ్రీ జయమోహన రెడ్డి తదితర స్థానిక ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరైనారు. అంతకుముందు అసిస్టెంటు రేడియో ఇంజనీరు శ్రీ ఎ.బి. కృష్ణమోహన్‌రావు అతిథులకు స్వాగతం చెప్పారు.

పంచాయతీ పన్నుల వసూళ్లు


పంచాయతీ రాజ్ శాఖా మంత్రి శ్రీ టి. హయగ్రీవాచారి, మార్చి 30వ తేదీన మేడ్చల్ పంచాయతీలోని కీసరగుట్టను సందర్శించిన సందర్భంలో పంచాయతీ సంస్థల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ గ్రామీణ మంచినీటి సరఫరా పథకాల నిర్వహణ కొనసాగింపుకు వీలుగా పంచాయతీ పన్నులను వసూలు చేయడానికి గట్టిగా కృషి చేయాలని ఉద్బోధించారు. పంచాయతీ రాజ్ మంత్రి, జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ భోజరెడ్డి, శాసన మండలి సభ్యులు శ్రీ ఎస్. వెంకటరామారెడ్డితో కలిసి బోగారాం, కీసరగుట్ట గ్రామాలలో పర్యటించారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతి నిమిత్తం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను తనిఖీచేశారు. వేలమంది యాత్రికులకు ఉపాధి కల్పించేవిధంగా కీసరగుట్టలో కొన్ని గ్రామీణ ప్రపిశ్రమలను నెలకొల్పాలని మంత్రి సూచించారు.

ఏలేటిపాడు పంచాయతీ భవనం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర సమితికి చెందిన ఏలేటిపాడు పంచాయతీ నిర్మించిన కార్యాలయ భవనానికి జిల్లా



గవర్నరుకు గుంటూరు మునిసిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ శ్రీ బండా కోటేశ్వరరావు ఏప్రిల్ 6న సన్మాన పత్రం సమర్పిస్తున్న దృశ్యం.



ఒంగోలు జిల్లా కలెక్టరు శ్రీ కె. చంద్రయ్య ఫిబ్రవరి 25వ తేదీన పిచ్చికలగుడిపాడు ఆయకట్టు రోడ్డుకు ప్రారంభోత్సవం చేసినప్పటి దృశ్యం

కలెక్టర్ శ్రీ యస్.ఆర్. గోవిందరాజన్ ఐ. ఎ. యస్. నేడు ప్రారంభోత్సవం చేశారు. రు.14 500/-లు ఎస్టిమేటుతో నిర్మించిన ఈ భవనంఖర్చులో సగం జిల్లా కలెక్టర్ మేచింగ్ గ్రాంటు నుండి ఇవ్వగా మిగిలిన సగం గ్రామ పంచాయతీ భరించింది.

గ్రామ సర్పంచ్ శ్రీ చిర్ర తాతారెడ్డి జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ప్రారంభోత్సవ సభకు సమితి అధ్యక్షులు శ్రీ మంతెన భావరాజు అధ్యక్షత వహించారు. పంచాయతీచే నిర్మింపబడిన పార్కును, పెనుగొండ నియోజకవర్గ నూతన శాసన సభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ ప్రారంభోత్సవం కావించారు.

స్త్రీలకు వ్యవసాయ శిక్షణా కార్యక్రమం

పిచ్చాటూరు పంచాయతీ సమితి ప్రాంతంలోగల మహిళా మండలుల సభ్యులు 25 మందికి పిచ్చాటూరులో 17-3-72 నుండి 21-3-72 వరకు వ్యవసాయ శిక్షణా కార్యక్రమం జరుపబడింది. పిచ్చాటూరు బి. డి. ఓ. శ్రీ వెంకోజీరావు శిక్షణ కార్యక్రమమునకు ప్రారంభోత్సవం జరిపారు. కాళహస్తి శిక్షణ కేంద్రం రేడియో కాంట్రాక్టు ఆఫీసరు శ్రీ యం. హనుమంతరావు పిచ్చటూరు వ్యవసాయ విస్తరణాధికార్లు శ్రీ దశరథ రామరాజు, రంగప్ప ఆధునిక వ్యవసాయ పద్ధతులను గూర్చి, విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుటుంబ నియంత్రణ అవశ్యకతను గూర్చి ఆరోగ్యము ప్రథమ చికిత్సల గురించి వివరించారు. పశు వైద్యాధికారి శ్రీ బల దేవసింగ్ కోళ్ళ పెంపకములను గురించి, కోళ్ళ ఫారమును చూపుచు, విపులంగా తెలియజెప్పారు. కుమారి మేకి సుకేసిని, డిమాన్‌స్ట్రేటర్ కుమారి కె. విశాల స్త్రీ - శిశు సంక్షేమ విస్తరణాధికారి, స్త్రీలకు వివిధ కార్యక్రమాలను గూర్చి శిక్షణ గరిపారు.

వెలగలవారి పాలెంలో హరిజన దినోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర సమితిలోని వెలగలవారి పాలెంలో నేడు హరిజన దినోత్సవం కడు వేడుకగా నిర్వహింప బడినది. శ్రమదాన్ కార్యక్రమముతో ప్రారంభమైన ఈ ఉత్సవములో గ్రామ ప్రజలు బ్లాక్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ శ్రీ దాట్ల నీలాద్రిరాజు పాల్గొన్నారు. సమితి ఆరోగ్య సిబ్బంది పల్లెలోని ప్రతి గృహమును సందర్శించి, పరిశుభ్రమైన ఇంటిని, ఆరోగ్య కరమైన పాపను నిర్ణయించిరి.

గ్రామ సర్పంచ్ శ్రీ దాట్ల నీలాద్రిరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో బ్లాక్ డెవలప్ మెంటు ఆఫీసర్ శ్రీ పి.వి. నరశింహారావు ఇతర సమితి సిబ్బంది ఉపన్యసించారు.

పెను మంట్రలో ఉగాది కవి సమ్మేళనం

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధ, యాంత్రిక శాఖ ధ్వర్యమున పెనుమంట్ర హైస్కూలులో ఉగాది కవి సమ్మేళనము బ్లాక్ పబ్లిక్ రిలేషన్సు ఆఫీసర్ చే జరుపబడినది. సమితిలోని వివిధ గ్రామముల నుండి ఆహ్వానింపబడిన 12 మంది కవి పండితులచే సుమారు 5 గం॥ లు కాలము కవితా గానము చేయబడినది. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. వరదయ్య గారి అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనములో సర్వశ్రీ తంగిరాల జగన్నాథ శాస్త్రి, వెలిది సత్యనారాయణ మూర్తి, షేక్ మీరాజాన్. కోట నరశింహమూర్తి, చిక్కాల కృష్ణారావు, చిరంజీవి అప్పలరాజు భాగవతార్, యస్. కనకరాజు, టి. ఆర్. మోహన్‌రావు ఆర్. కె మొగసాటి. సి. హెచ్. వీరంశెట్టి, ఎ. యస్. ఆర్. ఆంజనేయులు, మదురుపాటి గంగాధరశాస్త్రి తమ కవితా గానముచే సదస్సులను ఆనంద పరచారు. సభానంతరము కవిపండితులను ఉచిత రీతిన బ్లాక్ పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు సత్కరించారు.



ఉగాది సందర్భంగా అనంతపురంలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న రచయితలు.

హైద్రాబాదు జిల్లాలో కరువు సహాయక పనుల సమీక్ష

పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ టి. హయగ్రీవాచారి ఇటీవల హైదరాబాదు జిల్లా పరిషత్తు సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ అధికారులు. అనధికారుల మధ్య సన్నిహిత సహకారం వున్నప్పుడు ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉంటాయనీ, ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లో జరుగుతున్న కరువు సహాయక పనులను జాగరూకతతో పర్యవేక్షణచేయాలనీ, నీటిఎద్దడిని గురించి ప్రజలలోభయాందోళనలను నివారించడానికి వారు ప్రయత్నించాలనీ, ఈసమస్యలను తీర్చడానికి ప్రభుత్వం తన యావచ్ఛక్తిని వినియోగిస్తున్నదనీ. ప్రజాసమస్యలను ఆదరణ యోగ్యమైన పద్ధతిలో పరిష్కరించడానికి కృషిచేయాలనీ, ప్రజాదృష్టిలో పంచాయితీరాజ్ సంస్థల గౌరవ ప్రతిష్ఠలు పెరిగే విధంగా సభ్యులు కృషిచేయాలనీ అన్నారు.



బంగ్లాదేశ్ నిధి ఎక్కువగా వసూలుచేసినందుకు ఆరోగ్య శాఖా మాత్యులు హైదరాబాదు జిల్లా కలెక్టరు శ్రీ టి. లక్ష్మారెడ్డికి మెమెంటో బహూకరించారు.

మునిసిపల్ శాఖామంత్రి శ్రీ ఎం. మాణిక్‌రావు ప్రసంగిస్తూ నీటి ఎద్దడిగల ప్రాంతంలో నీటిసరఫరా చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో వున్నదనీ, అవసరమైతే లారీలద్వారా అయినాసరే నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఇందుకొరకు రూ. 20 లక్షలు కేటాయించడం జరిగిందనీ చెప్పారు.

జిల్లా కలెక్టర్ శ్రీ టి. లక్ష్మారెడ్డి మంత్రులకు, స్వాగతం చెబుతూ హైదరాబాదు జిల్లాలో మార్చినెల ఆఖరువరకు కరువు సహాయక పనుల క్రింద కోటి రూపాయలు ఖర్చుపెట్టడం జరిగిందని తెల్పారు. మొత్తం 1,151 పనులు చేపట్టబడినాయి. వీటిలో 436 పనులు పూర్తి అయినాయి.

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ ఎం. భోజిరెడ్డి ప్రసంగిస్తూ పంచాయతీరాజ్ సంస్థల వనరులను సమీకరించడానికి వున్నతాధికార సంఘం తగిన సూచనలు చేయవచ్చునన్న ఆశాభావం వెల్లడించారు.


U-IL-C-4 TEL



పొగాకూ, సాంకేతిక సిబ్బంది సమస్యా

ఆంధ్ర రాష్ట్రంలోని రైతు, మరీ ముఖ్యంగా పొగాకు పండించే నల్ల రేగడి భూముల్ని సాగుచేసే రంగంలో, యీ దేశంలోకల్లా చాలా ముందంజ వేసిన వాళ్ళల్లో ఒకడు. కాని, సిగరెట్టు పొగాకు పండించే క్రొత్త ప్రాంతాలలో, అంటే సంప్రదాయకంగా పొగాకు పండించే నల్ల రేగడి భూముల్లో కాకుండా, ఇసుక నేలలో, వర్షాధారపు భూముల్లో పొగాకు పండించటం చాలా భిన్నమైనది. క్రొత్తగా పొగాకు పండించే యీ రైతులకు యీ క్లిష్టమైన పంటను పండించటం గూర్చిన శిక్షణ యివ్వగల సాంకేతిక సిబ్బంది చాలా సంఖ్యలో కావలసివస్తుంది.

అధిపత్యం వహించగలిగిన వారికీ, సాంకేతిక సిబ్బందికీ శిక్షణ యిచ్చి తయారు చేయవలసిన అవసరాన్ని ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ, వారి అనుబంధ సంస్థ అయిన ఇండియా టొబాకో కంపెనీ లిమిటెడ్, వారూ గుర్తించారు. ముఖ్యంగా సాంకేతిక సిబ్బందికి శిక్షణ యివ్వటం కోసం ఐ.ఎల్.టి.డి. వారు 1965లో మైసూరు రాష్ట్రంలోని హున్సూరులో ఒక శిక్షణ కేంద్రాన్ని స్థాపించారు. ఇక్కడ 6 నెలల కాలంలో పొగాకు సాగు చెయ్యటాన్ని గూర్చిన సమగ్రమైన శిక్షణ, అంటే పొగాకు పండించటమూ, దానిలో ఎదురయ్యే సమస్యలను గూర్చిన పరిపూర్ణ శిక్షణ యిస్తారు. ఈ శిక్షాకేంద్రం ఒక్క ఐ.ఎల్.టి.డి.లో పనిచేసే వారికోసమే కాదు. ఇప్పటికే, ప్రభుత్వము వారు నియుక్తీకరించిన చాలామంది హున్సూరులో శిక్షణ పొందారు.



ఐ.ఎల్.టి.డి. వారి దృష్టిలో, శిక్షణ యివ్వటం అంటే భవిష్యత్తుపైన పెట్టుబడి పెట్టటం అన్నమాట

ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్

స్వీయ చరిత్ర ఆధారంగా - బుజ్జాయి



Reg. No. H. 133

